రామాయణం

# సుందరకాండ



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంథాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తిరుమల తిరుపతి దేవస్థానం వారి వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)

**http://ebooks.tirumala.org**



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# సుందరకాండ

ఉషశ్రీ





తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

శ్రీమత్ రామాయణం

# సుందరకాండ

ఉషశ్రీ

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2006

# SUNDARAKANDA

*by*

*USHASRI*

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No.14

Re-Prints : 2005, 2006

Copies : 5,000

Published by:

**Sri A.P.V.N. Sarma, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati — 517 507

*Cover Design*
*G. Chandrasekhar*

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press, Tirupati.

# ముందుమాట

ప్రాచీన సాహిత్యాన్ని చెక్కుచెదరకుండా ఉంచుకున్న మహోత్కృష్ట జాతి మనది. భారతీయుడిది గృహాశ్రమ జీవనం. రామాయణ భారత భాగవతాలు భారతీయ విజ్ఞాన భాండారాలు; భుక్తి, ముక్తి ప్రదాలైన ఇతిహాసాలు. త్యాగభావనాయుక్తుడవై ప్రపంచ పదార్థాలను అనుభవించమనడమే ఈ గ్రంథాలలోని సంస్కృతి.

భారత రామాయణాలు కర్మప్రవృత్తి కలగజేస్తాయి. భాగవతం, భక్తి జ్ఞాన వైరాగ్యాలు లభింపజేస్తుంది. భాగవతాన్ని తెలుసుకోవడానికి భక్తి ఉండాలి. భారతాన్ని తెలుసుకోవడానికి భక్తి యుక్తి అవసరం. రామాయణాన్ని గ్రహించడానికి భక్తియుక్తులు రెండే కాకుండా శక్తి కూడా కావాలి.

సుందరకాండలో సుభగసుందరుడూ, శివాంశసంభూతుడూ అయిన హనుమంతుడి తేజో బల పరాక్రమాలు వర్ణించబడ్డాయి. సుందరకాండ చదివితే రామాయణమంతా పఠించిన ఫలం దక్కుతుందని పెద్దలు చెబుతారు.

తిరుమల తిరుపతి దేవస్థానం చేపట్టిన బహువిధ భక్తి సాహిత్య కార్యక్రమాలలో ప్రాచీన గ్రంథాల ప్రచురణ ఒకటి. మహోత్తమ కావ్యాల సారాన్ని సకల జనులకూ చక్కని వచనంలో అందజేయాలని మా అభిలాష. ఆంధ్ర సహృదయ లోకం ఈ పునర్ముద్రణ గ్రంథాన్ని ఎప్పటిలాగే ఆదరించి మా ఆశయాలకు చరితార్థత చేకూర్చగలదని ఆశిస్తున్నాము.

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# ఒక్కమాట

అంజనా నందనం వీరం
జానకీ శోక నాశనమ్।
కపీశమ్ అక్ష హంతారం
వందే! లంకా భయంకరమ్॥

సుందరకాండ ఎందుకు చదవాలి? అని కొందరు ప్రశ్నిస్తారు.

ఆదికవి వాల్మీకి మునిచంద్రుడు సైతం ముచ్చటపడిన "కాండ" కనక సుందరకాండ చదవితీరాలి.

శ్రీరామచంద్రుని బాల్యం, విద్య, వివాహం చిత్రించి దానికి "బాలకాండ" అనీ, సీతారాములు అయోధ్య వదిలేవరకూ జరిగిన కథకు "అయోధ్యకాండ" అనీ, వారి వనవాస విశేషాలను వివరించే సన్నివేశాలకు "అరణ్యకాండ" అనీ, రామ లక్ష్మణులు కిష్కింధా నగరంలో గడిపిన జీవితగాథకు "కిష్కింధాకాండ" అనీ, రామ రావణ సంగ్రామ కథాభాగానికి "యుద్ధకాండ" అనీ పేర్లు పెట్టిన వాల్మీకి మహర్షి-

కిష్కింధా - యుద్ధకాండల మధ్య జరిగిన విశేషాలకు "సుందరకాండ" అని నామకరణం చేశారు.

నిజానికి దీనికి అన్వేషణ కాండ అనీ, హనుమత్కాండ అనీ పేరు పెట్టవచ్చు. మహాకవులెవరయినా యిది వ్రాసి ఉంటే!

కాని ఆయన "కవి" మాత్రమే కనక కావ్యదృష్టితో "సుందరకాండ" అన్నాడు.

ఇందుకు అనేకులు అనేక కారణాలు చెపుతారు. నేనేమనుకున్నానంటే :

ఇందులో ప్రప్రథమంగా హనుమంతుని విశ్వరూప సౌందర్యం, ఆయన సేవాధర్మ సౌందర్యం ఉన్నాయి.

ప్రపంచంలోని సర్వనగర నిర్మాణాన్నీ తలదన్నే లంకానగర సౌందర్యం, ఆ నగరంలో ఉన్న కమనీయ కామినీజన సౌందర్యం ఉన్నాయి. దశకంఠ రావణుని రాజసవీర సౌందర్యం ఉంది.

ఈ పాంచభౌతిక సుందరత్వం అంతనూ తృణప్రాయంగా చూడగల జానకీ ''శీలసౌందర్యం'' ఇక్కడే సాక్షాత్కరిస్తుంది.

ఇన్నిటితో-

వాల్మీకి మునిచంద్రుని కవితాశిల్ప సౌందర్యం ఇక్కడే నిక్షిప్తమయి ఉంది.

అన్నిటినీ మించి ఆత్మహత్యకు సన్నద్ధులయిన ''జానకీ - హనుమంతుల'' ప్రాణరక్షణ సౌందర్యం గోచరిస్తుంది.

ప్రతి మానవుడికీ జీవితం మీద ఆశ కల్పించే సన్నివేశాలున్నందు వల్లనే ఇది చదవాలి. పారాయణం చెయ్యాలి, నిత్యం.

అందుకే ఈ గ్రంథాన్ని మీ పూజాగృహంలో భద్రంగా ఉంచండి; వ్యాసపీఠం మీద.

★ ★ ★ ★

## మరొక్క మాట

శ్రీ మద్రామాయణం ఆదికవి వాల్మీకి అందించిన సుముహూర్తం ఎటువంటిదంటే - నాటినుంచి నేటివరకూ భాస, కాళిదాస, భవభూతి, మురారులవంటివారు సైతం ఆ మునిచంద్రునికి తలవంచి తమ పలుకులలో కావ్యాలుగా, నాటకాలుగా వ్రాసుకుని జన్మధన్యమయిందను కున్నారు.

తెలుగువారు హరికథలుగా, నాటకాలుగా వినిపించి, ప్రదర్శించి తృప్తిపడుతున్నారు. పాటలుగా జానపదులు స్త్రీలు పాడుకుంటూనే ఉన్నారు. శతకాలతో అర్చించుకుంటున్నారు. చివరకు భారతీయ జ్ఞానపీఠం మీద తెలుగు సరస్వతిని ఆరాధింపజేశారు, విశ్వనాథవారు ''రామాయణ కల్పవృక్షం''గా వాల్మీకిని.

నాగరక చిహ్నమయిన చలనచిత్రంగా రామాయణం శతదినోత్సవాలు జరుపుకుంటున్నది.

వేల సంవత్సరాలుగా లక్షల మానవులకు అక్షర భాండారంగా ఆదికవి అందించిన రామకథను యథాశక్తి నేను కూడా రేడియో ద్వారా వినిపించి, పుస్తకంగా తెలుగు వచనంలో అందించాను. అంతకుముందే మహాభారతాన్ని బాగా సంక్షిప్తంచేసి ''భారతం''గా అందించాను.

ఆ రెండూ మీ ఆదరణపొంది అయిదేళ్ళు దాటుతున్న సందర్భంగా 'సుందరకాండ' ఈనాడు తెలుగువారికి తెలుగుభాషలో పారాయణ యోగ్యంగా అనువదించాను. అదే మీరు చదవబోతున్నారు.

★ ★ ★★

# శ్రీమద్రామాయణం

శ్రీ సమృక్షమమా. విద్వాంస భూషితమూ, వీరయోధ విలసితమూ అయిన అయోధ్యానగరాన్ని పాలించే దశరథ మహారాజుకి కౌసల్య, సుమిత్ర, కైకేయి అనే పేర్లుగల ముగ్గురు భార్యలవల్ల రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులనే నలుగురు కుమారులు కలిగారు.

వీరిలో పెద్దవాడయిన రామచంద్రుడు తండ్రిమాట ప్రకారం అరణ్యానికి బయలుదేరగా ఆయన వెంట భార్య జానకీ, తమ్ముడు లక్ష్మణుడూ కూడా వచ్చారు.

పదమూడు సంవత్సరాలకాలం అరణ్యంలో మునీశ్వరుల ఆశ్రమాలను దర్శిస్తూ, సాధు హింసకులయిన రాక్షసులను సంహరిస్తూ కాలం గడిపాక, ఒకనాడు లంకేశ్వరుడయిన రావణుడు (మాయచేసి మారీచుని సాయంతో) సీతను అపహరించాడు.

భార్యా విరహంతో రాముడు తిరిగి తిరిగి కిష్కింధచేరి సుగ్రీవునితో స్నేహంచేసి, వాలిని సంహరించాడు. అనంతరం వానరులందరూ సీతాన్వేషణకు నాలుగు దిక్కులకూ వెళ్ళారు. వారిలో అంగదుని నాయకత్వాన దక్షిణదిశకు వచ్చిన యోధులలో హనుమంతుడు సముద్రం దాటడానికి సన్నద్ధుడయాడు.

ఇది మొదటి నాలుగు కాండలలో కథ, ఇక చదవండి, అయిదవదయిన

**సుందరకాండ.**



# ప్రస్థానం

**తతో రావణ నీతాయాః**
**సీతాయా శ్శత్రుకర్శనః।**
**ఇయేష పద మన్వేష్టుం**
**చారణా చరితే పథి–॥**

సర్వశత్రుమర్దన సమర్థుడయిన హనుమంతుడు దేవ గంధర్వాదులు విహరించే గగనమార్గాన బయలుదేరి, రావణుడు అపహరించిన సీతను అన్వేషించడానికి సన్నద్ధుడయాడు.

అసాధ్యమయిన పనిని సాధించడానికి ఉద్యుక్తుడై ఆ వానరయోధుడు మెడ నిక్కించి శిరసు పైకెత్తాడు. అప్పుడాయన మోరపైకెత్తిన ఆబోతువలె వున్నాడు.

వైడూర్యకాంతులీనే పచ్చిక బయళ్ళలో ఒక్కసారి యధేచ్ఛగా తిరిగి, పరిసరప్రాంతాల పక్షులకూ, జంతువులకూ భయం కలిగించే సింహంలా కనిపించాడు.

ఆయన ఎక్కిన పర్వతంమీద రంగు రంగుల రాళ్ళు మనోహరంగా ఉన్నాయి. ఆ పర్వత సానువుల మీద చీని చీనాంబర ధారులయిన కామరూపులు యక్ష, కిన్నర, గంధర్వ, నాగజాతులవారు యధేచ్ఛగా విహరిస్తున్నారు.

మత్తేభయూథాల గుంపులో గజరాజులా వున్నా డాయన.

సూర్యునికీ, దేవేంద్రునికీ, బ్రహ్మదేవునికీ చేతులు జోడించి స్మరించి తూర్పుగా తిరిగి తన జనకుడయిన వాయుదేవునికి ప్రణామాలర్పించి, దక్షిణ దిశగా తిరిగి ప్రయాణోన్ముఖుడై శరీరాన్ని పెంచడం ఆరంభించాడు. పర్వదినాలలో సముద్రంవలె ఆ శరీరం పొంగుతున్నది. దేహాన్ని పెంచి పెంచి ఒక్కసారి పాదాలతో పర్వతాన్ని కదిలించాడు. అది గజ గజ లాడింది.

ఆ ఊపుకి పర్వతంమీది చెట్ల పువ్వులన్నీ జలజల రాలాయి. పూలజల్లులతో నిండిన ఆ గిరి పుష్పగిరిలా ఉంది. ఆ తాకిడికి పర్వతం పగుళ్ళిచ్చి నీటి ఊట లుబికాయి.

అగ్నిగుండం మధ్యనుండి మంటలు లేస్తూ అటూ యిటూ పొగలు జిమ్ముతున్నట్లు మణిశిలలతో యితర రకాలతో రాళ్ళతో భాసించిందది.

కొండ గుహలలో విశ్రాంతి తీసుకునే మృగాలు భయభ్రాంతాలయి రోదనధ్వానాలతో బైటపడుతున్నాయి. స్వస్తిక చిహ్నాలుగల పడగలు విప్పి కాకోలవిషం క్రక్కుతూ మహాసర్పాలు తమ వాడి కోరలతో బండశిలలను కరువగా మంటలురేగి రాళ్ళు పొడిపొడి అయిపోయాయి. సర్పవిషాన్ని హరించగల ఓషధులున్నా మంటలు రేగడంవల్ల ఆ మూలికలు కూడా మాడిపోయాయి..

ప్రశాంతంగా ప్రేయసీజనంతో విహరించే విద్యాధరులు ఈ రణగొణ ధ్వనికీ ప్రకంపనాలకూ జంకి ఎలావున్నవారు అలానే గగనవీధికి ఎగిరి పోయారు.

వారు పానంచేసే సువర్ణపాత్రలనూ, బంగారు కుండలనూ, రత్నపు పిడుల కరవాలాలనూ, వివిధ మాంసాహారాలనూ ఎక్కడి వక్కడే విడిచి ఎఱ్ఱపడిన కనులతో ఆకాశ మార్గం చేరారు. ఆశ్చర్యంతో ఎవరికివారు తమ ప్రియుల భుజసీమలను పట్టుకుని నిలబడ్డారు.

వారికి కొంచెం పైభాగాన వున్న సిద్ధులూ, మహర్షులూ, ఆ దృశ్యాన్ని చూసి:-

*"ఓహో! పర్వత సమదేహుడయిన హనుమంతుడు రామ కార్యార్థియై భీకర మకరాలయమైన సముద్రం దాటడానికి సంకల్పించాడు, అని అనుకున్నారు."*

ఆ మాటలు విని దిగువనున్న విద్యాధరులు కన్నులు విప్పారించి హనుమంతుని చూశారు. మహాపర్వతంలా గోచరించాడు హనుమంతుడు.

ఒక్కసారి తన దేహాన్ని ఊగిసలాడించగా రోమ రోమం కదలింది. ఒక్క సింహనాదం చేశాడు. కారుమేఘం ఉరిమినట్లుంది. తన వాలాన్ని మరింత దీర్ఘంగా పొడిగించాడు.

నేలకు ఆని కూర్చున్నాడు.

చేతులు ముడిచాడు; కంఠం ఉగ్గబట్టాడు.

బల, పరాక్రమ, సామర్థ్యాలను కేంద్రీకరించాడు. ప్రాణాన్ని హృదయంలో నిబంధించాడు. ఆకాశంలోకి చూపు పోనిచ్చాడు. చెవులు ముకుళించాడు. పాదాలు తొక్కిపట్టాడు. లేవబోతూ, లేవబోతూ తన స్నేహితుల వైపు తిరిగి: -

***"వాయు వేగంతో సాగే రామబాణంలా లంకానగరానికి వెడతాను. అక్కడ సీతాదేవి కనిపించకపోతే దేవలోకానికి వెడతాను. అక్కడా అమ్మవారు లేకపోతే తిరిగి లంకచేరి రావణుని బంధించి తెస్తాను. రావణ సమేతం లంకను పెల్లగించి తీసుకు వస్తాను".***

అంటూ ఒక్క ఊపులో పైకి ఎగిరాడు. ఆ క్షణంలో ఆయన గరుత్మంతునివలె వున్నాడు.

ఆయన గమనవేగానికి పర్వతంమీది వృక్షాలు ఊగిసలాడి సమూలం కదిలి ఆయనతో కొంతదూరం పోయాయి. ఆత్మీయులు ప్రయాణం అవుతూంటే సాగనంపే బంధుజనంలా, మహారాజును అనుసరించి పోయే సేనలా ఉన్నాయి.

కొంతదూరం సాగి సముద్రంలో పడుతూ అవి ఇంద్రభీతితో సాగరంలో మునిగే పర్వతాలను తలపింపజేశాయి. ఎర్రని చివుళ్ళతో, మొగ్గలతో వున్న ఆ వృక్షాల మధ్య హనువుంతుడు మిణుగురులు నిండిన పర్వతంలా వున్నాడు.

కదిలిన తరువులన్నీ సముద్రప్రాంతం చేరగానే క్రింద పడిపోవడం చూస్తే స్నేహితులను జలాశయం దాకా సాగనంపుతున్నట్లనిపించింది.

రంగు రంగుల పూలకాంతుల మధ్య హనుమంతుడు మెరపు తీవెలు నిండిన మేఘంలా వున్నాడు.

రాలిన పూలతో నిండిన సముద్రం తారా తోరణాలంకృత గగనవీధిలా ఉంది.

బారసాచిన చేతులు అయిదు పడగల పాముల్లా ఉన్నాయి. చూస్తూంటే ఆ మహాకపి ఆకాశాన్ని కబళించి, సాగరాన్ని ఔపోసనం పట్టేలా ఉన్నాడు. ఎరుపెక్కిన కన్నులు పర్వతంమీద అగ్నిగోళాలవలె ఉన్నాయి. ఉదయించే సమయంలో చంద్ర, సూర్యబింబాలవలె కనిపిస్తున్నాయి ఆ కన్నులు.

ఎరుపెక్కిన ముఖం మరింత ఎర్రని వదనం సంధ్యారాగ రంజిత మయిన సూర్యమండలమేమో అనిపిస్తున్నాయి.

ఆ వాలం ఇంద్రధ్వజంలా ఉంది. అప్పుడప్పుడు ఆయన తోక వలయాకృతిలోకి వచ్చి చుట్టూ గుడి కట్టిన సూర్యునివలె తోపింపజేస్తున్నది. తోక పైకి లేచినపుడు ఆ ఎరుపు చూస్తే పెల్లగించిన జేగురురాతి పర్వతంలా ఉంది, హనుమంతుని దేహం. కదులుతూన్నప్పుడు చలించే గాలి ఉరుముల ధ్వనితో వీస్తున్నది.

వాలం నిటారుగా వచ్చినపుడు పొడుగయిన తోకచుక్కలా ఉన్నాడు. మధ్యగా వచ్చి వ్రాలిన తోకతో ఆయన దీర్ఘరజ్జుబంధితమైన మత్తేభంలా భాసిస్తున్నాడు. వాయువశమయిన పెద్ద నౌకలా సాగుతున్నాడు.

ఆయన ముందుకు సాగుతూంటే ఆ వాయువేగానికి సముద్రం అల్లకల్లోల మవుతున్నది.

ఆ కపిశార్దూలుడు తన బాహువులతో సముద్రాన్ని చిమ్ముతూ ముందుకు సాగుతున్నట్లనిపించింది.

ఆ తీవ్రవేగానికి పైకిలేచిన తరంగాలు మేఘమండలాన్ని చేరి శరత్కాల మేఘంలా ప్రకాశిస్తున్నాయి. అప్పుడు తరంగాలలో బయటపడిన జలచరాలు వస్త్రహీనులయిన మానవులను తలపింపజేశాయి.

సాగరంలోని సర్పాలకు ఆకాశంలోని హనుమంతుడు గరుత్మంతుడేమో అనిపించింది. ఆయన నీడ బహువిశాల ప్రాంతాన్ని ఆక్రమించింది. నీటిలో ఆ నీడ కదిలే మేఘంలా ఉంది. వాయుపథంలో సాగే హనుమంతుడు రెక్కల పర్వతంలా వున్నాడు. సాగుతున్నంతమేరా క్రింది సముద్రంలో గాలి ఒత్తిడి కలిగి అది దోనెలా అవుతున్నది.

మేఘమండలంలో చంద్రునివలె సాగుతున్నాడు; దారికి అడ్డువచ్చి చెల్లాచెదరయిన మేఘాలు రక రకాల కాంతులీనుతున్నాయి.

హనుమంతుని తీవ్రగమనాన్ని తిలకించి దేవ, గంధర్వగణాలు పూలవాన కురిపించాయి.

ప్రయాణంలో వాయువు సహకరించాడు. సూర్యుడు చల్లచల్లగా ఉన్నాడు. గగన సంచారులెందరో ప్రశంసావర్షం కురిపించారు.

అనాయాసంగా ఆకాశమార్గాన సాగే ఆ మహాకపిని అభినందించారు, వారు.

ఇక్ష్వాకువంశీయులయిన సగరులవల్ల వృద్ధిపొందిన సాగరుడు ఆ హనుమంతునికి ఏదోవిధంగా సాయపడడం తన కృతజ్ఞతకు అవకాశంగా భావించాడు.

ఈ సాహసయాత్రలో హనుమంతునికి కొంత విశ్రాంతి యివ్వగలిగితే మరింత సుఖంగా సముద్రం ఆవలి ఒడ్డును చేరగలడనుకున్నాడు.

తనలో మునిగి ఉన్న హిరణ్యనాభుడయిన మైనాకుని పిలిచి, పాతాళం లోని రాక్షసులు వెలుపలకు రాకుండా దేవేంద్రుడు నిన్నిక్కడ అడ్డుగా ఉంచాడు. ఇప్పుడు నువ్వు కామరూపశక్తితో పైకి పెరిగితే నీకూ, నాకు ఎంతో మేలు కలుగుతుంది. ఇక్ష్వాకువంశీయుడయిన శ్రీరామచంద్రునికి సేవా ధర్మంతో హనుమంతుడు వెడుతున్నాడు. నువ్వు పైకి పెరిగితే కొంతసేపు విశ్రాంతి తీసుకుంటాడు. ఆలస్యం చెయ్యకు. ఆయనకు ఆతిథ్యం ఇచ్చి మన కర్తవ్యం మనం నిర్వర్తించి పెద్దల మన్ననలు పొందుదాం;

ప్రవాసంలో ఉన్న సీతను అన్వేషించడానికి వెళ్ళే ఈ వానర వీరునికి శ్రమలేకుండా సాయపడాలి, అనగా విని మైనాకుడు, మేఘమండలాన్ని చీల్చుకు వచ్చే సూర్యునివలె సముద్రంనుండి పైకి లేచాడు.

కాగి కాగి కరగిన బంగారు కాంతుల శిఖరాలతో లేచిన మైనాకం కాంతితో నీలాకాశం పసిడిశోభ లీనింది.

పెరిగి పెరిగి తన మీదికి వచ్చే మైనాకాన్ని చూచి, హనుమంతుడు తన ప్రయాణానికి ఏదో అడ్డం వస్తున్నదని భావించి, తీవ్రవేగంతో శిఖరాన్ని ఢీకొన్నాడు.

మైనాకుడు హనుమంతుని తీవ్రవేగశక్తికి సంతోషించి;

వానరోత్తమా! అనన్యసాధ్య మయిన ఈ సాగరతరణంలో కొంతసేపు నా శిఖరంమీద విశ్రాంతితీసుకో. నువ్వు రామకార్యార్థివై వెడుతున్నావు. ఆ రామచంద్రుని ప్రపితామహులయిన సగరులవల్ల యింతవాడయిన సాగరుడు తన కృతజ్ఞత తెలుపుకోవాలని నన్ను పంపాడు. ఉపకారానికి ప్రత్యుపకారం చెయ్యడం సర్వప్రాణిధర్మం. నా సానువులమీద సువాసనలీనే, అతిమధురమయిన కందమూలఫలాలున్నాయి. వాటిని ఆరగించి, విశ్రాంతి తీసుకుని వెళ్ళు.

ఎంతటి సామాన్యుడయినా అతిథిని పూజించాలి. అటువంటప్పుడు నీవంటివాని విషయంలో వేరే ఆలోచన అవసరంలేదు. దేవతా శ్రేష్ఠుడయిన వాయువుకి కుమారుడవు. నీ తండ్రి అంతవేగంగా పయనించగల శక్తి సంపన్నుడవు.

నీకు జరిపే సత్కారం వాయుదేవునికే చెందుతుంది. ముఖ్యంగా నీకీ అతిథిమర్యాద జరపడంలో నా కృతజ్ఞతకూడా వెల్లడించుకుంటున్నాను.

కృతయుగంలో మా పర్వతాలకు రెక్కలుండేవని వినివుంటావు. వాటితో అవి గరుత్మంతునివలె వాయువేగంతో ప్రయాణాలు చేసేవి. అవి ఏ ప్రాంతాన పడతాయో అని అందరూ భయపడుతూంటే దేవేంద్రుడు వజ్రాయుధంతో వాటి రెక్కలు ముక్కలు చేశాడు.

ఆ సమయంలో వాయుదేవుడు నన్ను ఈ సముద్రంలో పడవేశాడు. ఆయనవల్ల నా రెక్కలు సురక్షితంగా వున్నాయి. ఇప్పుడు తెలిసిందా. నేనెందుకింత ఆదరం చూపుతున్నానో. నా సత్కారాలు పొంది అనుగ్రహించు, అన్నాడు.

మైనాకా! నీ ఆదరవచనాలే నా కెంతో సంతోషం కలిగించాయి అయితే యిప్పుడు నేను ఆగడానికి వీలులేదు. సూర్యాస్తమయం కాకుండా నేను ఆవలితీరం చేరాలి, మరొక విధంగా నువ్వు భావించకు. అతిథి సత్కారం అందినట్లే విశ్వసించు, అని తన చేతితో గిరిశిఖరం స్పృశించి ముందుకు సాగాడు.

సాగరుడు, మైనాకుడు హనుమంతుని ఆశీర్వదించారు. దేవేంద్రుడు మైనాకుని ప్రశంసించాడు.

వాయువీధిని వీడి విమల వినీలాంబర వీధిలో వెడుతున్నాడు.

సిద్ధ, సాధ్య, దేవ ఋషి సంఘాలు హనుమంతుని అభినందిస్తున్నాయి. ఆ సమయంలో వారు నాగమాత సురసను పిలిచి: ఈ హనుమంతుడు సాహసపరాక్రమోపేతుడు. దానికితోడు ధీశక్తి ఉన్నదో లేదో పరీక్షించాలి, అనగా ఆమె భయంకర రాక్షసాకారంతో బయలుదేరి హనుమంతునికి అడ్డుగాపోయి:

మా ప్రభువులు నిన్ను నాకు భోజనంగా యిచ్చారు. నువ్వు మర్యాదగా నా వదనగహ్వరంలో ప్రవేశించు. హాయిగా ఆరగిస్తాను, అంది.

అప్పుడాయన: దశరథనందనుడయిన రాముడు భార్యసీతతో, తమ్ముడు లక్ష్మణునితో వనవాసానికి వచ్చాడు. అక్కడ సాధుజనరక్షణ కార్యమగ్నుడు కాగా రాక్షసులకు వీరిమీద ద్వేషం కలిగింది.

అంతతో వారి ప్రభువయిన రావణుడు దొంగచాటుగా సీతను అపహరించుకుపోయాడు. ఇప్పుడు నేను సీతాన్వేషణకు వెడుతున్నాను. ఆ పని పూర్తికాగానే వస్తాను. నన్ను నమ్ము అన్నాడు.

మాటలు కట్టిపెట్టు. ఈ భువన భవనంలో నన్ను అతిక్రమించి పోగలవారు లేకుండా వరమిచ్చారు దేవతలు నాకు, అంది.

హనుమంతుడు: సరే, నా శరీరం పట్టేటంత విశాలంగా నీ నోరు తెరుస్తావా, అంటూ దేహాన్ని పెంచుతున్నాడు.

సురస తన వదన గహ్వరం విశాలం చేస్తున్నది. ఆయన ఎంత పెరిగితే అంతకు రెట్టింపు నోరు పెంచుతున్నది.

అలా పెరిగి పెరిగి ఒక్కలిప్తలో అంగుష్ఠమాత్రదేహుడై మరొక లిప్తవ్యవధిలో ఆమె ఉదరంలోకి పోయి పైకివచ్చి:

ఓ దాక్షాయణీ: మరి నాకు సెలవా, అన్నాడు.

సురస, నాయనా సంతోషం. సుఖంగా కార్యసాధనచేసి రామచంద్రునికి సంతోషం కలిగించు, అంది.

గరుత్మంతునివలె సాగుతున్నాడు, హనుమంతుడు.

సింహ, శార్దూల, పక్షి, సర్పవాహనాలమీద విహారయాత్ర చేసే విద్యాధరాది గణాలన్నీ సంతోషిస్తున్నాయి. చంద్ర, సూర్యసంచార యోగ్యమయిన మంగళ పథంలో వెడుతున్నాడు.

సాగుతూ సాగుతూండగా హనుమంతుని గమనం ఆకస్మికంగా ఆగిపోయింది.

ఏమిటా అని క్రిందికి చూశాడు, సముద్రంలో ఛాయాగ్రాహిణి సింహిక కనిపించింది. అది సముద్రంలోపలి నుండి నోరు తెరిచి పైకి లేవడం చూశాడు. సీతాన్వేషణకు బయలుదేరే సమయంలో సుగ్రీవుడు చెప్పాడు.

దక్షిణ సముద్రంమీద వెళ్ళేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. అందులో ఒక రాక్షసి ఉంది. దానిమీద పడిన నీడ ఆధారంగా ఆ ప్రాణిని క్రిందికి లాగుతుంది, అని.

అది గుర్తుకు రాగా తన శరీరాన్ని వర్షాకాలమేఘంలా విశాలంగా పెంచాడు. సింహిక తన నోరు మరింత విశాలంచేసి లాగుతున్నది. తెరిచిన వదనంలోంచి దాని మర్మస్థానాలు చూశాడు హనుమంతుడు.

చూస్తూనే క్రిందికి దిగుతూ తన శరీరాన్ని సంకోచింపజేసి దాని వదనంలోనుండి ఉదరంలోకిపోయి, వాడిగోళ్ళతో మర్మస్థానాలు చీల్చి ఒక్క ఊపులో గగనవీథికి చేరాడు.

సింహిక సముద్రంమీద తేలిపోయింది, చచ్చిపడి.

సిద్ధ, సాధ్య, విద్యాధర, గంధర్వగణాలు హనుమంతుని ధీశక్తినీ, ధీరత్వాన్నీ అభినందించాయి.

సాగి సాగి సముద్రం అవ్వలి ఒడ్డు చేరాడు. అక్కడ వనాలూ, సముద్రంలో ప్రవేశించే నదీ ముఖద్వారాలూ చూశాడు.

పర్వతంమీద దిగుతూ:

నేను యింత విశాల దేహంతో ఉంటే రాక్షసులందరూ నన్ను చూడాలనే కాంక్షతో రావచ్చు. అది కార్యభంగ హేతువవుతుంది, అనుకుంటూ శరీరాన్ని బాగా కుంచించాడు. బలిచక్రవర్తిని వంచించడానికి త్రివిక్రమ రూపం ధరించిన మహావిష్ణువువలె పెరిగిన హనుమంతుడు వామనాకృతి ధరించాడు.

ఆ కొండమీద విహరిస్తూ లంకానగరాన్ని చూశాడు.

ఆ నగరం అమరావతిలా వెలుగుతున్నది.

ఇది

మహర్షి వాల్మీకి విరచితమయిన
రామాయణం సుందర కాండలో
మొదటి సర్గకు ఉషశ్రీ అనువాదం.

## త్రికూటగిరి

అమరావతిలా గోచరించే లంకానగరాన్ని చూస్తూ, తాను దిగిన త్రికూటగిరిమీద విహరిస్తున్నాడు.

ఆ కొండమీది చెట్లనుండి జారిన పూలతో నిండిన హనుమంతుడు విచిత్రంగా ఉన్నాడు.

నూరుయోజనాలు దాటివచ్చినా ఆయనలో ఈషణ్మాత్రం ఆయాసం కాని, క్లేశంకాని కనిపించడంలేదు.

ఇటువంటి విశాలసాగరాలు మరో యిన్ని అనాయాసంగా దాటగలను, అనుకుంటూ నడుస్తున్నాడు.

పచ్చిక బయళ్ళతో, సుగంధభరిత పుష్పాలతో నిండిన లతలతో అల్లుకొన్న వృక్షసంతతులతో నిండిన వనాలు చూశాడు. దట్టంగా అలముకున్న వృక్షాలు నిండినచోట పర్వతం అంతా వృక్షగిరిలా కనిపించింది.

ఆ గిరిశిఖరంమీద ఉన్నది లంకానగరం.

అంతటా దేవదారువులు, కర్ణికారాలు, ఖర్జూరాలు, కరవీర, కుంకుమ, దేవకాంచనాలు. ఏపుగా పెరిగిన ఏడాకుల అరటి, విరగబూసిన వేగిస, వావిలి....................

అలా తిరుగుతున్నాడు.

వాటి కొమ్మలు కొన్ని మొగ్గ తొడుగుతూంటే, కొన్ని పూల బరువుతో వంగుతున్నాయి. అంతటా వివిధ జాతుల పక్షుల కలస్వనాలు. అక్కడక్కడ దిగుడుబావులు, విశాల సరోవరాలు. వాటినిండా కమలాలు, కలువలు కలహంసనాదాలు.

లంకానగరాన్ని సమీపిస్తున్నాడు.

చుట్టూ పెద్ద కందకం. కందకంనిండా రకరకాల పూలతోరణాలు.

కోటచుట్టూ బంగారు కాంతులీనే ప్రాకారం.

కామరూపధారులయిన రాక్షసులు కనురెప్ప వెయ్యకుండా కాపలా కాస్తున్నారు. వందలాది బురుజులు. బురుజులపై పతాకాలు. బంగారు లతా తోరణాలు. శరత్కాల మేఘాలవలె విశాలమయిన భవనాలు.

విశ్వకర్మ నిర్మించిన ఆ లంకానగరం త్రికూటగిరి శిఖరంమీద అలరారు తీరు చూస్తుంటే ఆకాశంలో తేలుతున్నట్టనిపించింది.

ప్రాకారమే కటిస్థలంగా కందకాలలోని నీరే చీనాంబరంగా, కోట గోడలమీది శతఘ్నులూ, శూలాలూ, కేశపాశంగా, బురుజులే ఆభరణాలుగా వెలిగే ఆ నగరాన్ని విశ్వకర్మ మనస్సంకల్పంతో అవతరింపజేసినట్లున్నాడు, అనిపించింది.

దానిలో భవనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒకనాడు కుబేరుని రాజధాని అది. ఖడ్గ, శూలపాణు లయిన రాక్షసవీరులు తమ వాడి కోరలతో అటూ యిటూ నడుస్తూంటే నాలుకలు చాచి కోడెత్రాచులే కదులు తున్నట్లనిపించింది.

అలా ఆ నగర ప్రాకార రక్షణ విధానాన్ని చూస్తూ హనుమంతుడు:

ఈ లంకలో అడుగుపెట్టడం అసాధ్యం; పెట్టినా దుర్భేద్యమయిన దీనిని స్వాధీనం చేసుకోవడం మరీ కష్టం. ఈ రాక్షసులు సామ మార్గాన మాటలతో లొంగరు. దానం యిక్కడ పని చెయ్యదు. భేదం అసలే వ్యర్థపదం. ఇక యుద్ధమే శరణ్యం. అయితే వానరయోధులలో సుగ్రీవునితో పాటు అంగదుడు, నీలుడు మాత్రమే సముద్రం దాటి యిక్కడకు రాగలరు. మిగిలినవారిక్కడ కాలు పెట్టలేరు, అనుకుంటూ కొంతసేపు తిరిగి:

ఇంతకూ సీతాదేవి యింతకాలం యిక్కడ జీవించి ఉన్నదో, లేదో చూడాలి. అప్పుడు అనంతర కర్తవ్యం ఆలోచించాలి.

అయితే, ఈ విశాలదేహంతో నేను లంకలో తిరగడం మంచిది కాదు. ఈ క్రూర రాక్షసగణం కంటబడకుండా అన్వేషించాలి.

దేశ కాల పరిజ్ఞానం లేని దూతవల్ల సర్వమూ వినాశనమే ప్రాప్తిస్తుంది, కనక ఈ నగరంలో జాగరూకంగా సాగాలి.

నా అంత వాడు లేడు అనుకునే దూతకు అర్థానర్థ పరిజ్ఞానం ఉండదు. అటువంటి అవలక్షణం నాకు లేదు. ఆ గర్వం దరిజేరితే సర్వం వ్యర్థమే. ఇప్పుడు నేను రాక్షస రూపంతో తిరిగినా వీరు పసిగట్టగలరు.

ఈ నగర రక్షణ విధానం చూస్తుంటే గాలికూడా వీరికి తెలియకుండా కదలడానికి వీలులేనట్లుంది.

ఇప్పుడింక ఒకటే దారి.

నేను బాగా చిన్న శరీరంతో రాత్రిపూటనే ఈ నగరమంతా తిరగాలి, అనుకుంటూండగా సూర్యుడు అస్తమించాడు.

హనుమంతుడు పిల్లిపిల్ల అంత అయాడు. లంకా నగరం వైపు సాగుతున్నాడు.

రజత కాంతులు
సువర్ణ శోభలు
మాణిక్య దీప్తులు.

వీటితో అలరారే ఏడెనిమిది అంతస్థుల భవనాలు. రంగురంగు కాంతులీనే నవరత్నాల జాలరులతో గవాక్షాలు.

ఊహకందని వైభవంతో ఉన్న ఆ నగరం అద్భుతంగా ఉంది.

అటువంటి లోకోత్తరమయిన నగరాన్ని చూచిన సంతోషం. రామపత్నిని, ఎలా చూడడం, ఎక్కడుంటుందా? అనే విచారం. అంతలో ఆయన యత్నానికి తోడుపడడానికో అన్నట్లు చంద్రుడు ఉదయించి పైకి వస్తున్నాడు. తామరతూడువంటి కాంతులు, పాల వెన్నెలలు, ధవళశంఖరోచులు.

సరోవరంలో విహరించే తెల్ల హంసలా ఉన్నాడు నీలాకాశంలో చంద్రుడు.

## లంకిణి

*తాం రత్న వసనోపేతాం*
*గోష్ఠాగారావతంసికాం*
*యంత్రాగార స్తనీ మృద్ధాం*
*ప్రమదా మివ భూషితాం*

మేఘం వలె వ్రేలాడుతూన్న శిఖరాలుకల లంబ పర్వతంమీదుగా లంకా నగరంలో అడుగుపెడుతున్నాడు ధీమంతుడయిన హనుమంతుడు.

అందమైన ఉద్యానవనాలు, స్వాదు జలపూరితా లయిన సరోవరాలు, శరత్కాల మేఘాల వలె భవనాలు. సముద్రపు చల్లనిగాలి. చక్కని

ద్వారతోరణాలు. ప్రాంగణాలలో మత్తేభాలు. సర్వరక్షితమయిన పాతాళలోక రాజధాని భోగవతిలా ఉంది లంకానగరం.

విద్యుల్లతలు నిండిన మేఘాలతో కాంతివంతమ్మై, చండమారుతంతో అలరారే అమరావతిలా ఉంది.

మయూరాలు, రాజహంసలు, క్రౌంచ మిథునాలు – వీటి కలస్వనాలకు తోడుగా నగర నర నారీ జనుల ఆభరణాల ధ్వనులు, భేరీ భాంకారాలు.

నగరం నలుమూలలా ఆయుధ ధారులయిన రాక్షస యోధుల పహరా!

చూస్తున్న హనుమంతుడు:

ఈ నగరంలో సామాన్యు డెవడూ అడుగు పెట్టలేడు. అంగద, సుషేణ, కుముద, మైంద, ద్వివిదులూ వీరితోపాటు కేతుమాల భల్లూకపతి, కుశపర్వ వానరయూధపతి, మా ప్రభువు సుగ్రీవుడు, తప్ప మరెవరూ యిటు చూడలేరు, అనుకున్నాడు.

ఆ సమయంలో రామ లక్ష్మణుల పరాక్రమం స్మృతికి వచ్చి హనుమంతునికి ఆనందం కలిగింది.

చూస్తున్నాడు హనుమంతుడు.

రత్నకాంతులే ఆచ్ఛాదన వస్త్రంగా, గోశాలలే భూషణాలుగా, యంత్రాగారాలే ఉన్నత వక్షోజాలుగా అలంకరించుకున్నట్లుంది లంకానగర నారీరత్నం.

నగర గృహాలలోని దీపకాంతులవల్ల లంకలో చీకటి అనేది లేకుండా పోయింది.

అప్పటికి లంకానగరాధిదేవత వికృతాకారంతో హనుమంతుని ఎదుట నిలిచి గర్జించి:

ఇక్కడి కెందుకు వచ్చావు? నీ పేరేమిటి? లంకలో అడుగుపెట్టడం నీ తరం కాదు. ముందు నీ ప్రాణాలు పోయేలోగా నీ వ్యవహారం ఏమిటో చెప్పు, అంది.

హనుమ : ఈ వికృత నేత్రాలతో పురద్వారంలోనే ఉన్న నువ్వెవరవు? ఎందుకింత అట్టహాసం చేసి భయపెడుతున్నావు! నీ కథేమిటి?

లంకిణి : మహాత్ము డయిన ఈ రాక్షసేశ్వరుని ఆజ్ఞానుసారం లంకానగర

రక్షణ చేస్తున్నాను. నన్ను కన్ను గప్పి లంకలో అడుగుపెట్టడం ఎవరితరం కాదు. సిద్ధంగా ఉండు, నీ ప్రాణాలు హరిస్తున్నాను.

హనుమ : ఈ విశాల ప్రాకార, ద్వార, తోరణాలతో అలరారే లంకానగరాన్ని చూడాలనే కుతూహలంతో వచ్చాను. ఈ ఉద్యానవనాలు, చిన్ని చిన్ని అడవులు, పెద్ద పెద్ద భవనాలు చూచి పోవాలనిపించింది.

లంకిణి : ఓరి దుర్బుద్ధీ! వానరాధమా! నా అనుమతి లేకుండా ఈ నగరం చూడగలవా!

హనుమ : అమ్మాయీ, నగరం చూస్తాను. చూసి, వచ్చిన దారినే వెడతాను.

ఆ ధోరణి లంకిణికి నచ్చలేదు. తన అరచెయ్యి విప్పి గుండె మీద చరిచింది. ఆ పిడుగుదెబ్బకు హనుమంతుడు ఒక్క అరుపు అరిచాడు.

ఉత్తరక్షణంలోనే ఎడమ పిడికిలి బిగించి ఒక్కపోటు పొడిచాడు. ఆ పోటుకే లంకిణి అవయవాలు పట్లు తప్పి, కళ్ళు తేలవైచి నేలమీద వాలింది. ఆయనకు జాలి కలిగింది.

అంతలోనే లంకిణి గద్గద స్వరంతో:

ఓ మహాపరాక్రమ సంపన్నుడా! రక్షించు, రక్షించు. బలధైర్యాలు కలవారు నియమవ్రత పరాయణులని ఎరుగుదును. నేనీ లంకా నగరాధిదేవతను. నన్ను నువ్వు ఓడించావు. నీ కింక తిరుగులేదు. ఇది బ్రహ్మ వాక్కు.

ఒకానొక వానరుడు నిన్ను జయిస్తాడు. నాటితో లంకానగర వాసులకు భద్రం లేదని గుర్తుంచుకో, అన్నా డొకప్పుడు స్వయంభూ బ్రహ్మ. అది నిజం.

సీతాదేవి కారణంగా ఈ రాక్షస వంశానికి నాశనకాలం సమీపించింది. నువ్వు నిశ్చింతగా ఈ నగరంలో ప్రవేశించి కర్తవ్యం నిర్వర్తించుకు వెళ్ళు. స్వేచ్ఛగా సీతాన్వేషణం కొనసాగించు, అంది.

## నగరప్రవేశం

*''ప్రవిశ్య నగరీం లంకాం*
***కపిరాజ హితంకరః***
***చక్రేఽథ పాదం సవ్యం చ***
***శత్రూణాం సతు మూర్ధని''.***

కోట ద్వారాలవంక చూడకుండా ప్రాకారంమీది నుండి దిగుతూ శత్రువు శిరస్సుమీద పెట్టినట్టు ఎడమకాలు ముందు పెట్టాడు, నగరంలో.

రంగురంగుల పూలతో అలరారే రాజవీధులలో సాగుతున్నాడు. అటూ ఇటూ ఐరావతాలవంటి భవనాలు. వాటినుండి నవ్వుల రువ్వులు. భేరీ భాంకారాలు. తెల్లని మేఘాలవలె పద్మాకారంతో కొన్ని, స్వస్తికాకృతితో కొన్ని భవనాలు కన్పించాయి.

కాలి అందెల చప్పుళ్ళు, మువ్వల వడ్డాణాల ధ్వనులు. అప్సరసల అందాన్ని అపహసించే రమణీమణులు తార, మంద్ర, మధ్యమ స్థాయి భేదాలతో మధురంగా గానం చేస్తున్నారు.

ఒక్కో భవనం నుండి ఇంకో భవనానికి వెడుతున్నాడు. సింహగర్జనలతో జెబ్బలు చరుచుకుంటూన్న వీరులు. ఉదాత్తానుదాత్త స్వరిత స్వర సంపన్నులయి మంత్రపాఠం చేసే వేదవేత్తలు.

గొంతెత్తి రావణస్తోత్రాలు వినిపించేవారు.

రాజవీధులనిండా ఆయుధధారులయిన రాక్షస వీరులు.

కోటలోని మధ్యప్రాకారంలో చారచర్య నెరిగిన మేధావులు.

వృషభ చర్మాలు ధరించిన యజ్ఞదీక్షితులు, జటాజూటధారులు, ముండిత శిరస్కులు, దర్భాయుధదారులు, అగ్నిగుండాలే ఆయుధాలుగా కలవారు, దండ, ముద్గరాది ఆయుధాలతో అలరారేవారు, ఏకాక్షులు, ఏకకర్ణులు, లంబోదరులు, భీకరాకారులు, వంగిన ముఖాలవారు, వికృత దేహులు, పొట్టివారు, కత్తులు, ధనుస్సులు, శతఘ్నులు, పరిఘలు పట్టి తిరిగే కవచ ధారులు, పొట్టీ పొడుగూకాని, అంతలావూ, మరీ సన్నం కానివారు.

రూపవంతులు, తేజస్వంతులు, పతాకశోభితధ్వజదండధారులు, పాశహస్తులు, పట్టిస, అశని, శక్తి, వృక్షాది ఆయుధపాణులు.

సాగుతున్నాడు హనుమంతుడు.

మంచిగంధం పూసుకుని, సువాసనలీనే పూలమాలలు వేసుకుని, రత్నాభరణ భూషితులై విహరించేవారు, గోచరించారు.

అంతఃపురం సమీపిస్తున్నాడు.

వందల యోధులు పహరా యిస్తున్నారు. పర్వత శిఖరం మీద ఉన్న ఆ గృహద్వార తోరణం బంగారంతో నిర్మించారు. దాని చుట్టూ ప్రాకారాలు. వాటిలో పద్మ సరోవరాలు.

మత్తగజాలు, ఉత్తమ జాతి అశ్వాలు, రథాలు, విమానాలు, మృగాలు, పక్షులు.

రత్నమాణిక్యకాంతులలతో గోడలు.

అంతటా అగరుగంధ సువాసం. అందులో అడుగుపెట్టాడు హనుమంతుడు.

## చంద్రదర్శనం

వెన్నెలలు విరజిమ్ముతూ, ఆకాశ మధ్యానికి చేరాడు చంద్రుడు. గోశాలలో వృషభంలా వున్నాడు. సర్వభూతకోటినీ ప్రకాశింపజేస్తూ, లోకాం పాపాలు నశింపజేస్తూ, సముద్రాన్ని ఉప్పొంగిస్తూ, భూలోకంలో శోభామయమయిన మందరగిరివలె, ప్రదోషవేళ సాగరంవలె, సరోవరంలో వికసించిన పద్మంలా కనిపించాడు.

చూస్తున్నాడు హనుమంతుడు.
వెండి పంజరంలో హంస వలె,
మందరగిరి గుహలో సింహం వలె
మత్తేభంమీద వున్న మహావీరుని వలె-
గగన మధ్యంలో చంద్రుడు వెలుగుతున్నాడు.
మొనదేరిన వాడికొమ్ముల ఆబోతులా,
ఆకాశానికి పొడుచుకు వచ్చిన శిఖరాలుగల పర్వతంలా,
బంగారు పూతపూసిన దంతాలుకల గజరాజులా వున్నాడు.
రాతిబండ నెక్కిన మృగేంద్రం.
రణమధ్యంలో నిలిచిన గజేంద్రం,
రాజ్యసుఖం పొందిన నరేంద్రునివలె వున్నాడు చంద్రుడు.
చీకటి తొలగి, కాంతి వెల్లివిరిసింది.
రాక్షసుల మాంసభక్షణ వాంఛ పెరిగింది.
ప్రేయసీ ప్రియులకు కోపాలు వైదొలగాయి.
వీణానాదాలు వీనులవిందు చేస్తున్నాయి.
నారీమణులు తమ ప్రియుల గాఢ పరిష్వంగంలో నిద్రిస్తున్నారు.
నక్తంచర ప్రాణికోటి రౌద్రరూపంతో విహరిస్తున్నది.

ప్రయాణ యోగ్యమయిన రథాలు, అశ్వాలూ, వాటికితోడు భద్రమయిన ఆసనాలూ కల ఆ భవనాలలో మదిరాపానమత్తులు యధేచ్ఛా విహారం చేస్తున్నారు.

ఆ రాక్షస జనంలో పరిహాస ప్రసంగాలు, భుజాస్ఫాలనాలు. ఒకరిపై ఒకరు విసురులు.................ఓహ్! కోలాహలంగా ఉంది.

మరీ మత్తులో ఉన్న కొందరు ఎదురుగా ఉన్న అందకత్తెల మీద వాలుతున్నారు.

స్త్రీ జనంలో

కొందరు సుఖంగా నవ్వుతూ, మధురమధురంగా పలుకుతున్నారు. కొందరు అలకతో దీర్ఘంగా నిట్టూరుస్తున్నారు. మరి కొందరు హాయిగా నిద్రపోతున్నారు.

గజ ఘీంకారాలు, మహావీర విశ్వాసాలు, పడగలు విప్పిన సర్పాల బుసబుసలతో నిండిన మహాహ్రదంలా కనిపించింది.

సజ్జన సత్కారాలు కూడా ఉన్నా యక్కడ.

ఆ రాక్షసగణంలో ధీమంతులూ, కార్యకుశలులూ. శ్రద్ధాళువులూ ఉన్నారు.

రూప, గుణసంపన్నులయిన పురుషులూ వారికి యోగ్యులయిన పరిశుద్ధ హృదయులయిన వారి ప్రియురాండ్రనూ చూశాడు.

సిగ్గు తెరలో వెలిగే భామలు కొందరు.

భర్తృపరిష్వంగంలో పరవశించేవారు కొందరు.

ప్రియుల అంకసీమలో అంగనలు.

మేడల పై భాగాలలో విహరించే భామామణులు.

మదనమంత్ర పరాయణలు కొందరు.

ధర్మాచరణ మర్మమెరిగిన మహిళ లెందరో!

మేలిముసుగు జారగా బంగారు శోభతో కొందరు.

కొలిమిలో కరుగుతూన్న బంగారు కాంతి శరీరాలు కొన్ని.

చంద్రకాంతితో మరెందరో!

వారిలో కొందరు విరహవ్యథలో ఉన్నారు.

అభిసారికలు, వాసవసజ్జికలు!

మెరపు తీగెల మాలల వలె ఉన్నా రందరూ.

అందరు కనిపించినా, సీతాదర్శనం కాలేదు. హనుమంతునికి.

సనాతన ధర్మశీల, పతివ్రతా శిరోమణి, రామహృదయేశ్వరి గోచరించ లేదు. రామవిరహంతో ఆ యిల్లాలు అస్పష్ట చంద్రరేఖవలె, ధూళిసోకిన బంగారు కణికలా, వాయుధూత మేఘశకలంవలె ఉంటుంది, అనుకుంటూ అన్వేషణ సాగిస్తున్నాడు.

కనిపించలేదు సీత.

శోకవశు డయాడు హనుమంతుడు.

## అన్వేషణ

సూర్యకాంతులీనే ప్రాకారంతోవున్న రావణభవనంవైపు అడుగుపెట్టాడు. సింహ రక్షితమయిన అరణ్యంలా ఉన్నదది.

ఏనుగుల మీద, గుర్రాలమీద, రథాలమీద మహాయోధులు కాపలా కాస్తున్నారు. ఆ రథాలు రజత, సువర్ణ, దంత వినిర్మితాలు. సింహ, శార్దూల చర్మాలంకృతాలు.

భవనం నిండా రంగురంగుల పక్షులు, మృగాలు, మణిఖచిత పాత్రలు, రత్న వినిర్మితాసనాలు, విచిత్రభూషణ శోభతో అలరారే యువతీ జనం.

శంఖ, భేరీ, మృదంగ నాద తరంగాలతో సముద్రంవలె ఉన్నది. పూజలు, హోమాలు సాగుతున్నాయి.

ఆ భవన పరిసరాలలోవున్న ప్రహస్త, మహాపార్శ్వ, మహోదర, విరూపాక్ష, విద్యుజ్జిహ్వ, విద్యున్మాలి, సుమాలి, జంబుమాలి, రశ్మికేతు, సూర్యశత్రు, వజ్రకాయ, వక్ర, శుకనాస, శఠ, వికట, హ్రస్వకర్ణ, రోమశ, దంష్ట్రాసుర, ధూమ్రాక్షాది మహాయోధుల భవనాలన్నీ తిరిగాడు.

రావణ భవనానికి అల్లంత దూరంలో కాలజీమూతంలా ఉన్న కుంభకర్ణుని మందిరం అంతా అన్వేషించి, విభీషణుని సౌధం కూడా శోధించాడు. ఇంద్రజిత్తు ఆవాసంకూడా తిరిగి, తిరిగి లంకేశ్వరుని సౌధంలో ప్రవేశించాడు.

ఆ భవన ప్రాంగణంలో ఐరావత సదృశాలయిన మత్తేభాలు వర్షకాల మేఘాలవలె వున్నాయి. వాటి ఘీంకారాలు మబ్బులు ఉరుము తున్నట్టున్నాయి.

శూల, ముద్గర, శక్తి, తోమరాయుధధారులై ఎందరో వికృతాకారులయిన రాక్షసులు అప్రమత్తంగా రక్షణభారం నిర్వహిస్తున్నారు.

సాగుతున్నాడు. హనుమంతుడు.

బంగారు తెరలతో, లేయెండ కాంతితో పాలకీలు, పొదరిళ్ళు, కుటీరాలు, క్రీడాగృహాలు, దారు వినిర్మిత పర్వతశ్రేణులు, వినోదమందిరం, మరొకవంక కేళీ విహార భవనం.

ఇంకా ముందుకు పోగా మయూర నర్తనాలతో మందరగిరి సదృశంగా ఉన్న సౌధం.

ధైర్యశాలురు బలికర్మలు నిర్వర్తించిన పరమశివ భవనంలా ఉన్నదది. ఆ భవనంలోని మణి రత్నకాంతులు సూర్యకిరణాలవలె వెలుగు లీనుతున్నాయి.

బంగారు ఆసనాలు, మంచాలు, పాత్రలు. అంతటా మధువు, మద్యం నింపిన మాణిక్య కలశాలు; చూడగా అది కుబేర భవనంలా ఉంది.

విశాల ప్రాంగణాలు.

బంగారు వడ్డాణాలు, అందెలు గలగలలాడే నారీ రత్నాలు, అంతటా శ్రవఃపేయంగా మృదంగ నిస్వనాలు.

సాగుతున్నాడు హనుమంతుడు.

## పుష్పక విమానం

***మహీకృతా పర్వతరాజి పూర్ణా***
***శైలాః కృతా వృక్షవితాన పూర్ణాః***
***వృక్షాః కృతాః పుష్పవితాన పూర్ణాః***
***పుష్పం కృతం కేసరపత్ర పూర్ణమ్॥***

సువర్ణ, వైడూర్యకాంతు లీనే రావణుని భవనం మెరుపులతో, రంగు రంగుల పక్షులతో అలరారే ప్రావృట్కాల మేఘమండలంలా ఉంది. వాటిలో ఆయుధశాలలు. ధనురాగారాలు, శంఖశ్రేణులు.

విశాలములూ మనోహరములూ అయిన గిరిశిఖరాలమీద చంద్రశాలలూ, దోషరహితాలూ, రాక్షస, దేవతాపూజార్హాలూ, సువర్ణ శోభితాలూ, మయశిల్పి నిర్మితాలూ అయిన గృహరాజాలు గోచరించాయి.

మహామేఘంలా ఉన్న సువిశాల భవనంలో రాక్షసేంద్రుని ప్రధాన సేనాబలం ఉన్నది. దానికి సాటివచ్చే భవనం మరొకటి లేదు. భూమికి దిగిన స్వర్గంలా ఉంది. రత్నశోభ లీనుతున్నది.

కేసరాలు నిండిన పూలతో మునిగిన వృక్షాలతో అలరారే గిరిశిఖరంలా ఉంది. ఆ భవనంలో నారీరత్నాలు మేఘాలలో మెరుపులవలె ఉన్నారు. ఆకాశంలో విహరించే పుణ్యపురుషుల విమానంలా ఉంది. రాజహంసలే వాహనాలుగా ఉన్నట్లుంది.

అది పుష్పకం.

రంగు రంగుల శిలలతో శోభించే పర్వత శిఖరంవలె రత్నఖచితమై, గ్రహపరివేష్టిత చంద్రమండల సదృశమై, విచిత్ర మేఘాలయమై గోచరించింది.

ఆ ప్రాంతపు భూప్రదేశం పర్వత సమూహంతో, పర్వతాలు తరు సముదాయంతో, తరువులు పూలగుత్తులతో, పూలు పరాగ సముదాయంతో ఉన్నాయి.

సౌధాలు సుధాధవళములు.

సరోవరాలు, పద్మసంభరితాలు. పద్మాలు కేసరపూర్ణాలు. చిత్ర చిత్రంగా ఉన్నాయి.

భవనాలన్నిటికంటె ఉన్నతంగా రత్నద్యుతులతో అలరారుతున్నది పుష్పకవిమానం.

కొన్ని పక్షలు వైడూర్యమణిమయహాలు. మరికొన్ని రజితఖచితాలు. ప్రవాళ, స్వర్ణ నిర్మితాలు కొన్ని. సర్వమూ స్వర్ణమయం. సర్పాలు, జాత్యశ్వాలు అన్నీ చక్కగా చెక్కివుంచారు.

పగడాలతో, బంగారుతో పూవులు చెక్కిన రెక్కలు కొన్నింటికి, వయారంగా వంగిన రెక్కలతో కొన్ని, మదనుని సమక్షంలో ఉన్న పక్షులవలె ఉన్నాయన్నీ. కేసరాలు వీడని కలువలు పట్టిన తొండాలతో గజరాజులు. పద్మహస్తయైన లక్ష్మీదేవి స్వరూపం. వసంతకాలంలో వికసించిన తరు శోభతో నిండిన పర్వతరాజులా వున్నదది.

రావణుని పూజలతో, రక్షణతో అలరారే లంకానగరంలో తిరిగి తిరిగి సీత జాడ దొరకక విచారిస్తున్నాడు హనుమంతుడు.

సుగుణ సంపదతో రాముని ప్రియురాలయిన జానకిదేవిని అన్వేషిస్తూ పరి పరి విధాల ఆలోచనలు సాగిస్తూ సాగుతున్నాడు ధీమంతుడయిన హనుమంతుడు.

రావణ భవన మధ్యంలో రత్న శోభితమూ సువర్ణగవాక్ష సంభరితమూ, గగన సంచారయోగ్యమూ అప్రతిమానమూ అయిన పుష్పకాన్ని చూస్తున్నాడు.

ఏకాగ్రమయిన తపోదీక్షతో కాని దాన్ని నిర్మించలేరు అది మన మనస[illegible]ని ఊహననుసరించి సాగిపోగలశక్తి కలది. వాయువేగంతో ప్రయాణం చెయ[illegible]దు.

[illegible]వర్త[illegible]లూ, మహాత్ములూ, శ్రీ యశో విరాజితులూ అయిన దేవతల భవనంలా కనిపిస్తున్నది.

శరత్కాలచంద్రునివలె ఉన్నది. దర్శన మాత్రంచేత మనస్సుకి అహ్లాదం కలిగిస్తుంది. చిన్న చిన్న శిఖరాలతో నిండిన గిరిశిఖరంలా వుంది.

మాంచి తిండిపుష్టీ, తీవ్రగమనమూ, విశాలనేత్రాలూ కల గగన చారులయిన రాక్షసులు దాన్ని పరిరక్షిస్తున్నారు.

వసంతసుమశోభతో, వాసంతాధిక మనోహరంగా ఉన్నదది

ఇవి 2, 3, 4, 5, 6, 7, 8, సర్గలు.

## అంతఃపురం

సాగి సాగి హనుమంతుడు రావణుని రాణివాసం వుండే అంతఃపుర భవనం సమీపించాడు. యోజనం పొడవు, అర్ధయోజనం వెడల్పు వున్న ప్రాకారం చుట్టూ నాలుగు దంతాలు కల ఏనుగులు రక్షణ కార్యంలో వున్నాయి. ఆయుధపాణు లయిన యోధులు అప్రమత్తంగా తిరుగుతున్నారు. మకర, తిమింగల, మహాసర్ప సమృద్ధమయిన సాగరంలా ఉన్నదది. యమ, వరుణ, కుబేర, దేవేంద్ర భవనాలను అధఃకరిస్తున్నది.

రావణుని భార్యలందరూ అక్కడ వున్నారు. ఆ లంకేశ్వరుడు పరాక్రమం ప్రదర్శించి తెచ్చిన నారీజనం కూడా ఆ భవనంలో స్వేచ్ఛగా విహరిస్తున్నారు.

విశ్వకర్మ ఈ పుష్పక విమానాన్ని చతుర్ముఖ ప్రజాపతి కోసం నిర్మించాడు. యక్షేశుడయిన కుబేరుడు తీవ్ర తపస్సుచేసి బ్రహ్మను సంతుష్టుని చేసి ఆ విమానాన్ని వరంగా పొందాడు. కుబేరుని ఓడించి రావణుడు దీనిని సాధించాడు.

మేరు మందర గిరిశిఖర సదృశమయిన గోపుర సమూహాలతో అలరారుతోంది. బంగారు సోపానాలు, మణిరత్న వేదికలు. స్ఫటికమణులతో రూపొందించిన గవాక్షాలు. పగడాలు, మణులు, ముత్యాలతో నిండి అక్కడి నేల అంతా కాంతు లీనుతున్నది. రక్త చందనాలేపనంతో లేతసూర్య కాంతితో వెలుగుతోంది, రకరకాల పానీయాలు, భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యాలతో నిండి ఉంది. వాటి వాసనలు మత్తెక్కిస్తున్నాయి. ఆప్త బంధువుకి విందుకోసం చేసినట్లున్నాయి.

ఆ భవనం రావణుని హృదయానికి ఆహ్లాదం కలిగించే కాంతారత్నంలా ఉంది. ఉన్నత స్తంభాలతో అది రెక్కలు విప్పి ఆకాశానికి లేస్తున్నట్టుంది.

గ్రామ, నగర, సౌధ చిత్రా లలంకరించిన తివాసీ పరచి ఉంది.

ఆ భవనంలో తెల్లని రాజహంసలవలె అగరు ధూమం వ్యాపించి శోభావహంగా ఉంది. సర్వేంద్రియ తర్పణం కలిగించే ఆ భవనం పిల్లలను సాకే మాతృమూర్తిలా ఉంది.

చూడగా చూడగా అది దేవేంద్ర రాజధానిలా, స్వర్గలోకంలా ఉంది. అక్కడి బంగారు దీపకళికలను తదేకంగా చూశాడు.

చూసి లోపలకు సాగుతున్నాడు హనుమంతుడు.

రంగు రంగుల చీరలతో వివిధ విధాలయిన ఆభరణాలతో అలరారే నారీమణులు అర్థరాత్రివరకూ ఆసవాలు సేవించి, నిద్రకు ఉపక్రమించారు. నిశ్శబ్దంగా ఉన్న తుమ్మెదల గుంపులతో, హంస జంటలతో వున్న సరోవరంలా వున్నది. ఆ వారిజాక్షుల వదనాలు పద్మగంధ భరితాలు. వికసించిన పద్మాలమీద పరిభ్రమించే భ్రమరాలు ఈ ముఖపద్మాలచుట్టూ భ్రమిస్తాయి.

తాము చేసిన పుణ్యఫలం పూర్తి చేసుకుని నేలకుజారిన తారాగణాల వలె వున్నారువారు.

సడలిన కేశబంధాలు, చెదరిన అంగభూషణాలు, జారిన పూలమాలలు, అస్తవ్యస్తంగా పడిన హారాలు, చిరుచెమటకు కరగిన తిలకాలు.

పాన వ్యాయామ సమయంలో తెగిన ముత్తెపుసరులు. జారిన వసనాలు, పట్టు సడలిన వడ్డాణాలు, తెగిపోయి ఊడిపడి పగిలిన కుండలాలు.

ఏనుగులు నలగత్రొక్కిన లతామతల్లులవలె ఉన్నారు. చంద్రకిరణ శోభ లీనే ముత్యాలహారాల కిరివంకలా ఉన్నత వక్షోజాలు చూడగా నిద్రపోయే హంసలు గోచరించాయి.

వారి అలంకారాలలో వైడూర్యమణులు రాజహంసలవలె, బంగారు హారాలు చక్రవాకాలవలె కనిపిస్తూంటే, హంసలూ చక్రవాకాలూ విహరించే నదులవలె ఉన్నారు. వారి కటిస్థలాలు ఇసుక తిన్నెలను తలపింపజేస్తున్నాయి.

వారి ఆభరణాలకు పొదిగిన చిరుగంటలే మొగ్గలుగా, వదనాలే వికసిత కమలాలుగా, శృంగారక్రియలే మకరాలుగా, తనుద్యుతులే తటాలుగా వారందరూ నదీ దేవతల్లా వున్నారు.

కొందరి చూచుకాల మీద అలంకార రేఖారచనయే భూషణభ్రమ గొలుపుతోంది. కొందరి నిట్టూర్పులకే వారి చేలాంచలాలు ముఖంమీద ఆడుతున్నాయి. అవి రంగు రంగుల పతాకాలవలె ఉన్నాయి.

ఆ గాలిసోకి కొందరి కర్ణకుండలాలు నెమ్మది నెమ్మదిగా చలిస్తున్నాయి. ఆ మహిళల కాంతిగంధానికి తోడు మధుపానగంధం కలిసివచ్చే వాయువులు రావణునికి హాయిగా సేవ చేస్తున్నాయి.

మద్యపాన వివశలయిన ఆ రావణ ప్రియకాంతలు తమ ప్రక్కనున్న యువతి వదనమే రావణ ముఖంగా వాసన చూసి తృప్తి పడుతూంటే, ఆ సుఖాన్నే ఎదుటివారు కూడా అనుభవిస్తున్నారు.

మేలి వసనాలే తలగడలుగా కొందరు, బాహువులే ఉపధానాలుగా కొందరు, ఎదుటి ఆమె వక్షస్థలం మీద తలవుంచి ఒకతె, దాని ఒడిలో తలపెట్టి యింకొకతె, తొడలమీద, పిరుదులమీద అలా ఒకరికి తెలియని మైకంలో ఒకరు హాయిగా నిద్రాముద్రలో వున్నారు. ఆ స్పర్శలోనే పరవశిస్తున్నారు.

తుమ్మెదల దారంతో కట్టిన పూలమాలవలె వారు ఒకరి భుజం ఒకరు మెలవేసి పడుకున్నవారు నారీమణిహారంలా ఉన్నారు.

వసంత వాయువుకు కదలియాడే లతలు, పూవులు, ఒకదానితో ఒకటి పెనవేసుకున్నట్టు వారందరూ ఒకరి నొకరి బంధించుకున్నారు.

ఎవరి అవయవాలు ఏవో, ఎవరి అలంకారాలు ఏవో, ఎవరి కేశాలంకారం యేదో తెలియకుండా ఉంది. బంగారు దీపాలవలె వున్నారు.

ఇందరినీ రావణుడు తన పరాక్రమంతోనే తెచ్చాడు. కొందరు మాత్రం రావణ సౌందర్యాన్ని మోహించి వచ్చారు. వివాహితులనెవరినీ తీసికొని రాలేదు. ఇతరుల యందు అనురాగం వున్న ఆడదాన్నీ తేలేదు.

వారిలో గుణ, రూప, కుల, శీలాలలో ఎవరినీ తక్కువ అంచనా వేయలేం.

అందరినీ చూస్తూ హనుమంతు డనుకున్నాడు.

వీరందరూ తమ భర్త అయిన రావణ సమక్షంలో ఉన్నట్టు జానకీ దేవి కూడా రామచంద్రుని దగ్గరే ఉండి ఉంటే వీని జన్మ చరితార్థమయేది. ఎంతటివాడయినా సీతాపహరణంతో తుచ్ఛుడయాడు రావణుడు.

## పట్టమహిషి : శయనాగారం

సాగి సాగి హనుమంతుడు

ఏనుగు దంతాలతో, పదారు వన్నెల బంగారు కాంతితో, స్ఫటిక, వైడూర్య, రత్నాలతో అలంకృతమయిన శయ్యను చూశాడు. ఒకవంక చంద్రకాంతితో తెల్లని గొడుగు. మరొక వంక సూర్యకాంతితో, అశోక పుష్పమాలలతో అలరారే ఆసనం. శయ్యమీద అజిన చర్మం.

అగరు ధూపాలు, సుగంధ ధూమ వాసనలు. తెల్లని వింజామరలతో అందగత్తెలు.

ఆ శయ్యమీద మేఘసన్నిభుడైన మహావీరుని చూశాడు. పొడుగాటి బాహువులు, భుజాలకు తాకుతూ వెలుగులీనే కర్ణకుండలాలు, చీనాంబరం, శరీరమంతా మంచిగంధపుపూత. సంధ్యాకాలంలో ఎరుపెక్కిన ఆకాశం మీద మెరుపు కాంతుల మేఘంలా వున్నాడు.

లతా, తరుశోభితమయిన మందరగిరిలా ఉన్నాడు. హాయిగా మధుపానం చేసి, మదవతీ పరిరంభసుఖం అనుభవించి విశ్రాంతి తీసుకున్నట్టు ఉన్నాడు.

కొంచెం దగ్గరగా వెళ్ళాడు హనుమంతుడు.

బుస కొడుతున్న కోడెత్రాచులా వున్నాడు.

ఆ ఆకారం చూసి కొద్దిగా జంకి వెనుకడుగు వేసి, మరొక వేదిక మీదకు నడిచి చూశాడు.

మత్తేభం అధివసించిన ప్రస్రవణగిరిలా ఉంది, రావణుడు నిద్రిస్తున్న ఆ శయ్య.

ఇంద్ర ధనుస్సులా వున్నాయి వాని బాహువులు.

దేవేంద్రుని ఐరావత దంతపు దెబ్బలు తిన్న ఆ బాహువులు, వజ్రాయుధాన్ని ఢీకొని గట్టి బొప్పికట్టి వున్నాయి. విష్ణుచక్రపు రాపిడికూడా అనుభవించాయి.

చక్కగా, బలిసి, మంచి కణుపులతో, సర్వలక్షణలక్షితములై అలరారుతున్న గోళ్ళతో, వ్రేళ్ళతో ఆ బాహువులు అయిదు పడగలపాములా ఉన్నాయి. వాటికి మంచిగంధపు పూతలున్నాయి. మందరగిరిమీద తీవ్ర క్రోధంతో నిద్రిస్తూన్న మహాసర్పాలవలె వున్నాయి.

అంతటా సురపాన్న సౌరభం, పొగడపూల పరిమళం. మధుర మదిరాగంధం - అది అంతా ఆ రావణుని నిశ్వాసవాయువే.

మణి, రత్నకాంతులీనే కిరీటం, రత్నకాంతులీనే కుండలాలు.

రక్త చందనాల కృతం, మణిహార భూషితం అయిన విశాల వక్షస్థలం పసుపురంగు పంచె. తెల్లని ఉత్తరీయం.

చూస్తున్నాడు హనుమంతుడు.

గంగానది ఒడ్డున విశ్రమించే ఏనుగులా వున్నాడు. మినుముల రాశిలా ఉన్నాడు. నలువంకలా వెలిగే దీపకాంతులలో మెరుపుల మధ్య మేఘంలా ఉన్నాడు.

ఆ రాక్షసేంద్రుని పాదసమీపంలో కొందరు భార్యలు. వారు చంద్రవదనలు, పుష్పమాలాలంకృతలు, నాట్య సంగీత కౌశలంగల వనితలు కొందరు అయన కటి ప్రాంతంలోనూ, భుజసీమ దగ్గరావున్నారు. వారందరితో గృహం తారాశోభితమయిన ఆకాశంవలె ఉన్నది.

అలసి, అలసి నిద్రిస్తున్నారు దొరికిన చోట, కొందరు.

ఒకతె నాట్యభంగిమలోనే నిద్ర సాగిస్తున్నది.

నదిలో తరంగాలతో కదలిపోయి నావ చాటున చేరిన కమలం వలె, ఒక కమలముఖి వీణను కౌగలించుకుని ఉంది.

పసిపాపను చంకలో ఉంచుకున్నట్టు మృదంగాన్ని పట్టుకుని మరొక మదవతి.

చిరకాలానికి తిరిగి వచ్చిన ప్రియుని గాఢంగా ఆలింగనం చేసుకున్నట్టు ఒక మదిరాక్షి భేరీవాద్యాన్ని చుట్టుకుని పడుకుంది.

ఏకాంతంలో ప్రియుని ఆలింగనంతో పరవశిస్తున్నట్టు ఒక కాంతామణి చేతిలోని వేణువునే గుండెలకు హత్తుకుంది.

మరొకతె మద్దెల నానుకుని నిద్రించింది.

భుజముల మధ్య మృదంగం ఉంచుకుని ఒకతె:

కొంచెం వయసు వచ్చిన కొడుకుని దగ్గరగా తీసుకున్నట్టుంది, భేరీ వాద్యాలింగనంతో, ఒకతె;

వసంతవేళ నీటితో తడిపిన పూలమాలలా ఉన్న దొక పూబోణి పగలకొట్టిన కుండనీటిలో తడిసి.

సువర్ణ కలశాల వంటి వక్షోజాలను బిగించుకుని నిద్రించే ప్రౌఢ ఒకతె-

ఒక చంద్రానన మరొక సుశ్రోణిని కౌగలించుకుని పరవశంతో నిద్రిస్తున్నది.

కామ తీవ్రతగల కామినీజనం తమ ప్రియులను ఉత్తుంగ కుచాలతో కుమ్ముతున్నట్టు పెద్ద పెద్ద భేరీవాద్యాలను ఆలింగనం చేసుకున్నారు.

ఆ రమణీయ రమణీగణంలో అందరికంటె విశిష్టంగా, అత్యంత సౌందర్యంతో, మణి రత్న ముక్తాహారాలతో అంతఃపురానికే అలంకారంగా, సువర్ణకాంతి దేహంతో నిద్రించే రమణిని చూసి జానకీదేవి ఈమెయే అనుకున్నాడు.

అనుకున్న క్షణంలో ఆయన కపిప్రకృతి విజృంభించింది.

తోక నేలకు కొట్టాడు.

తోకను ముద్దుపెట్టుకున్నాడు.

గంతులు వేశాడు, గానం చేశాడు, సంతోషంగా నవ్వుతూ స్తంభాల మీద దూకడం ఆరంభించాడు.

ఇది 9, 10 సర్గలు

## పానశాల

మరుక్షణంలో ఆ మహామహుని బుద్ధి పనిచేయడం మొదలు పెట్టింది.

రామ వియోగంలో ఉన్న సీత అన్న పానాలు ముట్టదు; అలంకారాలూ, నిద్రా ఆమె దరి జేరవు.

దేవేంద్రుడయినా సరే, ఆమె వానిని కన్నెత్తి చూడదు. ముల్లోకాలలో రామునివంటి పురుషు డుండనప్పుడు సీతాదేవి పరపురుషునివైపు ఎందుకు చూస్తుంది, అని విచారించి అంతఃపురం విడిచి పానశాల చేరాడు.

అక్కడ

ఆటలాడి, పాటలు పాడి, నాట్యం చేసి, తెగ(తాగి అలసిన నారీజనం కొందరు మద్దెళ్ళమీద, మరికొందరు పీటలమీద, మరెందరో తివాసీలమీద పడి ని(ద్రిస్తున్నారు.

అందరూ అందకత్తెలే. చక్కని అలంకారాలతో, నాట్యశాస్త్ర మర్యాద లెరిగినవారే. హాయిగా సంయోగసుఖంతో అలసి సుఖంగా ని(ద్రిస్తున్నారు.

ఇందరు స్త్రీల నడుమ, గోగణమధ్యంలో వృషభరాజులా ఉన్నాడు, రావణుడు. ఆడ ఏనుగుల మధ్య గజేం(దుని వలె ఉన్నాడు.

పానశాల ప్రక్కకు చూశాడు హనుమంతుడు.

దున్నపోతుల, అడవిపందుల, లేళ్ళ మాంశాలు పోగులు పోగులుగా ఉన్నాయి, వెండి పా(త్రలలో, బంగారు గిన్నెలలో తింటూ తింటూ విడిచిన నెమళ్ళ, కోడిపెట్టల మాంసాలున్నాయి. సగం సగం అరగించిన చకోరాలు, చేపలు, మేకలు.

షడ్రసోపేతమయిన వంటకాలు, పువ్వులు. పళ్ళు...... రకరకాల మద్యాలు, బంగారు కమండలువులలో ఉన్నాయి. మణులు పొదిగిన వెండి చెంబులు, బంగారు పాన పా(త్రలు.

కొన్ని పా(త్రలలో సగం (తాగిన మద్యం, కొన్ని పూర్తిగా అరగించినవి, కొన్ని యింకా ముట్టకుండా నిండుగా తొణికిసలాడుతున్నవి.

(తాగుతూ మత్తులో బోర్లగిల పడవైచిన కుండలు, కమండలాలు. వాటికి యెడంగా వండిన దుంపలు, పండిన పళ్ళు, పూలమాలలు.

మళ్ళీ వెనుదిరిగాడు.

అక్కడ స్త్రీలు ఒకరి చీర లొకరు చుట్టబెట్టుకున్నవారు, వస్త్రాలే లేనివారు, ఒకరి నొకరు దగ్గరగా కౌగలించుకుని ని(ద్రిస్తున్నారు.

మధురమయిన మద్యపు వాసనతో, మంచి గంధపు వాసనలు మేళవించి ఆ భవనం అంతా వ్యాపిస్తున్నాయి.

స్త్రీలలో కొందరు నీలిరంగువారు, కొందరు నలుపు, కొందరు బంగారు ఛాయ మేనివారు. అందరూ పద్మలతల్లా ఉన్నారు. అందరినీ చూశాడు; కాని, జానకీ దేవి కనపడలేదు.

ఆ దశలో వున్న స్త్రీలను చూసిన హనుమంతుని మనస్సు పశ్చాత్తాపంతో నిండిపోయింది. అంతఃపురంలోని నారీజనం, పయిగా ఆచ్ఛాదనలు లేకుండా వున్నారు. పరస్త్రీని చూడడమే పాపం! కాగా ఈ స్థితిలో చూడడం మరెంత పాపం-

అయితే యిందరు సుందరాంగులను చూసినా నా మనస్సు ఎటువంటి వికారానికి లోనుకాలేదు. ఇంద్రియాలన్నిటిలో ప్రధానమయినది మనస్సు. అది నిశ్చలంగానే ఉంది.

పయిగా సీతాదేవిని స్త్రీ జన మధ్యంలో గాక ఎక్కడ వెదకాలి?

స్త్రీని వెదకడానికి అడవిలో లేడి గుంపు మధ్యకు వెడతామా! నా మనస్సు నిశ్చలంగా, నిర్మలంగా ఉంది కనక పాపభీతి లేదు.

దేవ, గంధర్వ, నాగకన్యలున్నారే తప్ప ఆ అంతఃపురంలో సీతాదేవి జాడలేదు. పానశాల విడిచి యీవలకు వచ్చాడు.

## మనస్తాపం

రావణ భవన మధ్యంలో చిత్ర విచిత్రమయిన లతాగృహాలు, నిశాసౌధాలు అన్నీ తిరిగాడు. జానకీదేవి జాడలేదు.

ఈ దుష్ట రాక్షసుని చేతులలో పడడం యిష్టంలేక జానకీదేవి ప్రాణ త్యాగం చేసి ఉండాలి. ఈ రాక్షస వికృతాకారాలు చూసి గుండె ఆగి మరణించిందేమో!

ఇప్పుడు సీతను చూడకుండా సుగ్రీవుని దగ్గరకు వెళ్ళడమెలా! ఆ కపిరాజు దండనీతి విషయంలో చాలా తీక్షణదృష్టి కలవాడు. అంతకు ముందుగా - వానరవీరులందరూ కనిపిస్తారు. వారికేం చెప్పాలి. సుగ్రీవుడు పెట్టిన గడువుదాటింది కనక వారంతా ప్రాయోపవేశం చేస్తారు. సముద్రం దాటివెళ్ళగానే అంగద, జాంబవంతులు ఎదురువస్తే వారికి ఏం చెప్పను, అని చింతించాడు.

అంతలో వివేకం తెచ్చుకుని-

సర్వ అనర్థాలకూ దుఃఖం మూలం. దుఃఖాన్ని విడిచి పరమ సంతోషంతో ఉడాలి. అదే శ్రేయస్కరం.

మరోసారి అంతటా వెదకుతాను, అనుకుని మళ్ళీ అన్ని వనాలూ, శాలలూ, భవనాలూ వెదుకుతున్నాడు.

రావణుడు బలాత్కరించి తెచ్చిన నాగకన్యాసమూహాన్ని చూశాడు. సీత జాడలేదు.

మళ్ళీ విచారంలో పడ్డాడు.

ఇందరు వానరుల శ్రమకూ ఏవిటి ఫలితం?

రామచంద్రునికి ప్రీతికరమయిన పని చేద్దామని బయలుదేరాను. లంకలో అంగుళం మేర విడవకుండా వెదకగలిగినా అమ్మవారిజాడలేదు.

గృధ్రరాజు సంపాతి చెప్పాడే - సీత లంకలో ఉన్నదని? ఎక్కడుంది ఆవిడ?

మిథిలాధీశుడయిన జనకుని పుత్రిక రావణుని స్వీకరిస్తుందా!

ఒకటి జరిగి ఉండవచ్చు-

రామబాణభీతితో వచ్చే రావణుడు తీవ్రవేగంలో సీతను సముద్రంలో విడిచి ఉండాలి. లేదా సీత స్వయంగానే సాగరమధ్యంలో పడిపోయిందేమో! ఈ దుష్టుడిబాధ పడలేక ప్రాణత్యాగం చేసి ఉండాలి. ఆవిడ శీలరక్షణ దీక్షకు విసిగి ఈ రావణుడే ఆ యిల్లాలిని తిని ఉంటాడా! కాకుంటే - ఈ రాక్షస స్త్రీలే ఆరగించి ఉండరుకదా! రామనామ జపంతో ఆవిడే తనువు చాలించిందా!

కాకుంటే ఆ రావణాంతఃపుర పంజరంలో చిలకలా నిరంతరం రామనామం జపిస్తూ ఉండదా!

ఇప్పుడు వెళ్ళి రామచంద్రునికి ఏం చెప్పాలి! వెళ్ళిన తరువాయి ఏదో ఒకటి చెప్పక తప్పదు. ఏది చెప్పినా ముప్పే.

అదీకాక - సీతను చూడకుండా వెడితే నేను ఏం సాధించినట్లు?

సీత కనబడలేదు, అని నేను చెప్పగానే రామచంద్రుడు ప్రాణాలు వదులుతాడు. అది చూచి లక్ష్మణుడు మిగలడు. ఈ వార్త విని ఆయోధ్యలో భరత, శత్రుఘ్నులు, వారి తల్లులు అందరూ మరణిస్తారు.

కృతజ్ఞతకు మారుపేరయిన సుగ్రీవుడు మాత్రం జీవిస్తాడా! ఆయనతో పాటు ఆయన భార్య రుమ, తార, అంగదుడు వీరందరూ దేహయాత్ర ముగిస్తారు.

ఈ దుఃఖంతో వానరులందరూ తలలు బ్రద్దలు కొట్టుకుంటారు! విషం మింగుతారు, ఉరిపోసుకుంటారు, అగ్నిగుండాలలో దూకుతారు,

ఉపవాసాలతో మరణిస్తారు. సీతను చూడకుండా నేను వెడితే అటు ఇక్ష్వాకువంశం, ఇటు సర్వవానరజాతి నాశనం తథ్యం.

అందుచేత నేనిక్కడే వానప్రస్థ జీవితం గడిపితే వారందరూ నేనింకా సీతాన్వేషణం చేస్తున్నాననే ఆశతో జీవిస్తారు.

ఏమయినా సరే నేను వెళ్ళక పోవడమే మంచిది. చితి పేర్చుకుని అందులో దూకుతాను. లేదా ఏ చెట్టు క్రిందనో ఉపవాస నియమంతో కూర్చుంటే కాకులూ, కుక్కలూ నా శరీరాన్ని అరగిస్తాయి. ఇదొక నిర్యాణ మార్గం.

సీతను చూడకుండా వెడితే నా కీర్తి ఏం కావాలి, అని కొంతసేపు విచారించి:

ఛీ! మరణం కంటె దోషం లేదు. బ్రతికి ఉంటేనే సుఖాలకు ఆస్కారం ఉంది; ఎన్నో శ్రేయస్సులు చూడవచ్చు, ఇప్పుడింక ఈ దశకంఠుని కడతేరుస్తాను. కాదు, వీణ్ణి బలిపశువులా తీసుకుపోయి రాముని ముందు పడేస్తాను.

అనుకుంటూ మళ్ళీ శోకసముద్రంలో మునిగి–

ఇంద్రియ నిగ్రహంతో, ఆహార నియమంతో యిక్కడే శేషజీవితం గడుపుతాను, అందువల్ల అయోధ్యలో వారూ కిష్కింధలో వీరూ సుఖంగా ఉంటారు, అనుకుని ముందుకు సాగాడు.

ఎదురుగా అశోకవనం కనిపించింది. ఇంతవరకూ ఈ వనం చూడలేదు, అనుకుంటూ, ఆదిత్య, వసు, రుద్ర, అశ్వనీ దేవతలకు నమస్కరించి:

తపస్వి జనానికి ఫలసిద్ధివలె ఇక్ష్వాకు కులవర్ధని అయిన సీతాదేవిని రామునికి అందించాలి, అనుకుని:

రామ లక్ష్మణులకు, జానకీదేవికి, ఇంద్ర, రుద్ర, వాయు, యమ దేవతలకు నమస్కారం. సూర్య, చంద్రులకు ప్రణామం. మా ప్రభువు సుగ్రీవునికి అభివాదం, అనుకుంటూ అశోకవనం వయిపుసాగుతూ:

ఈ వనాన్ని రాక్షసులు చక్కగా సంస్కరించి ఉంటారు, అనేకులు రక్షిస్తూ ఉండవచ్చు. వాయువుకూడా యిక్కడ తగు మాత్రంగా చలిస్తూంటాడు.

ఇప్పుడింక నా కార్యసాధనకు దేవతలూ, ఋషులూ సాయపడాలి. చతుర్ముఖ ప్రజాపతితో సర్వదేవగణాలూ, అగ్నిహోత్రుడూ, వాయువూ,

వజ్రధారి దేవేంద్రుడూ, పాశహస్తుడయిన వరుణుడూ, సూర్య, చంద్రులూ, త్రినేత్రధారి శివుడూ, అశ్వనీ దేవతలూ అందరూ నాకు కార్యసిద్ధి యివ్వాలి. సర్వభూతాలూ, భూతనాథులూ, నా యత్నానికి తోడుపడాలి. ప్రసన్న చంద్రబింబంవంటి మోముగల జానకీదేవి నాకు కనిపించాలి.

పరమదుష్టుడూ, నీచుడూ, క్రూరుడూ అయిన ఈ రావణునిచే అపహరింపబడిన జానకీదేవిని ఎలా చూడగలనో - అనుకుంటూ అశోకవనం వయిపు సాగుతున్నాడు.

ఇది 11, 12, 13 సర్గలు.

## అశోకం

రావణ భవనప్రాకారం వదలి అశోకవనంలో ప్రవేశిస్తున్నాడు. ఒక్కసారి శరీరమంతా పులకించింది. తెలయని సంతోషం ఆవహించింది.

వసంత ప్రారంభవేళ వికసించిన పూలతో నిండిన తరువులు, పొన్న, మామిడి, అశోక, సంపెంగవృక్షాలు గుంపులు గుంపులుగా వున్నాయి.

నారి సారించి విడచిన బాణంలా దూసుకుపోయాడు హనుమంతుడు. రంగు రంగుల పక్షులు, ఎన్నెన్నో రకాల మృగాలు, తుమ్మెదలు, కోకిలలు, నెమళ్ళు.

ఆయన గమనవేగానికి పక్షులన్నీ నిద్రలేచాయి. ఆ పక్షులు రెక్కలాడిస్తూంటే సాలవృక్షం మీది పూలు వానజల్లులా నేలకు రాలాయి. అవి శరీరం నిండా పడగా హనుమంతుడు పుష్పపర్వతంలా ఉన్నాడు.

పుష్పాలంకృతుడై విహరించే ఆయన వసంతునివలె ఉన్నాడు. పూలతో నిండిన ఆ వనభూమి రకరకాల ఆభరణాలతో అలరారే సుందరీమణిలా ఉంది.

ఆకులురాలిన కొమ్మలతో, పూలు, పండ్లులేని శాఖలతో ఆ వృక్షాలు వస్త్రాభరణాలుకూడా ఓడిన జూదరిలా ఉన్నాయి.

ఆయన తన వాలంతో, దీర్ఘబాహువులతో, పాదాలతో మర్దించిన వృక్షాలు-

శరీరంమీది గంధపుపూత రాలిపోయి, జుట్టు విరబోసుకుని, దంతక్షత, నఖక్షతాలతో నిండిన యువతిలా ఉన్నాయి.

వింధ్యగిరిమీద ఏర్పడే మేఘాలు ప్రచండవాయువుతో చెల్లా చెదరయినట్లు, హనుమంతుని విహారగమనతీవ్రతకు ఆ వనంలోని లతలన్నీ చెదరిపోతున్నాయి.

తిరుగుతూ చూస్తున్నాడు హనుమంతుడు.

సువర్ణ, మాణిక్య, రజత కాంతులీనే ప్రదేశాలు.

స్ఫటిక సోపానాలతో దిగుడుబావులు.

వాటినిండా కలువలు, కమలాలు.

హంసల, చక్రవాకాల, చాతకాల కలస్వనాలు. అమృతమధురంగా ఉండే జలాలు.

అందమయిన గిరిశిఖరాలు. వాటిమీద ఎన్నో వృక్షాలు. ఆ చుట్టూ శిలామండపాలు.

ప్రియుని ఒడినుండి దూకుతున్న ప్రియురాలివలె ఆ గిరిశిఖరం నుండి జారుతున్న సెలయేరు. దానిలోకి వంగిన కొమ్మలుగల వృక్షాలను చూస్తూంటే, ఎంత కోపం వచ్చినా ప్రియుని విడచి పోకూడదమ్మా, అని వారించే ఆత్మబంధువుల్లా వున్నాయి.

ఒక వంక దూకి, మలుపు తిరిగిన ఆ యేరు, కోపంవదలి ప్రసన్నురాలయి భర్తను చేరే ప్రేయసిలా ఉంది.

ఆ సమీపంలో రకరకాల విహంగాలు. ముత్యాలకాంతి యిసుకతో, మణిసోపానాలతో, చల్లని నీటితో అలరారే దిగుడుబావి.

ఆ పరిసరాలలో విశ్వకర్మ వినిర్మితమయిన క్రీడావన, భవనాలు. తెల్లని గొడుగులు, బంగారు వేదికలు, సెలయేళ్ళు, శింశుపావృక్షాలు.

అగ్నికాంతులీనే వృక్షాలమీద తిరిగే హనుమంతుడు మేరుపర్వత దీప్తులతో వెలిగే సూర్యునివలె ఉన్నాడు.

బంగరు కాంతుల తరువులను చూస్తూ, గాలి కదిలితే చిరుగంటల మ్రోతలీనే ధ్వనికల శింశుపావృక్షం అధిరోహించాడు. అది లేతచివుళ్ళతో, మొగ్గతొడిగి, వికసితముఖాలుకల పూలతో ఉంది.

ఇక్కడ జానకి ఉండవచ్చు. రామదర్శనకాంక్షతో ఆమె యీ పరిసరాలలో తిరుగుతూ ఉండాలి. ఈ చుట్టుప్రక్కల అంతా పొగడలు, సంపెంగలు, మంచిగంధపు తరువులు. జలపక్షి సమూహాలతో పద్మసరోవరం.

రామమనోహరి జానకి. వనశోభలెరిగిన ఆ రాఘవహృదయేశ్వరి, రామ విరహబాధతో తప్పకుండా యీ వనానికి వస్తుంది.

జనకరాజనందన, రామచంద్రుని అర్ధాంగి, వనవాసప్రియం, సంధ్యాసమయ విధ్యుక్త కార్యనిర్వహణకై యీ శుభప్రదమయిన జలాశయం దగ్గరకువచ్చి తీరుతుంది. ఆవిడ జీవించివుంటే యిక్కడకు రాకుండా ఉండదు, అనుకుంటూ శింశుపావృక్షం మీద నుండి అంతటా పరికిస్తున్నాడు హనుమంతుడు.

పదునాలుగవ సర్గ.

## సీతాసందర్శనం

శింశుపావృక్షంమీది నుండి చూస్తుంటే అశోకవనం అంతా స్పష్టంగా గోచరిస్తున్నది. ఋతుభేదం లేకుండా అన్నీ చివుళ్ళతో, మొగ్గలతో, పూలతో, పండ్లతో అలరారే లతా, తరువులే.

నిండుగా పూచిన అశోకాలతో ఆ వనం రాత్రిపూట కూడా ఉదయ సూర్యశోభతో ఉంది. విరగబూసిన పూలబరువుకి ఆగలేక కొండగోగు నేల మీదికి వంగింది. కొమ్మ, మ్రాను కనిపించకుండా విరిసింది అశోకం. అంగుళం ఖాళీ లేకుండా పూలు నిండిన వెూదుగ కాంతులు మిరుమిట్లు గొలుపుతున్నాయి.

పున్నాగం, ఏడాకుల అరటి, సంపెంగ విరగపూసి సువాసనల మత్తు జల్లుతున్నాయి. ఆ వనంలో అశోకాలు కొన్ని బంగారు రంగువి, కొన్ని అగ్నిశిఖా సదృశాలు, దట్టంగా పెరిగి కొన్ని కాటుకరాసిలా ఉన్నాయి.

ఇంద్రుని నందనవనంలా, కుబేరుని చైత్రరథ వనంలా దివ్యంగా వున్న ఆ వనం పూవులనే నక్షత్రాలతో, నీలాకాశంలా, రత్నాకరంలా, మనోహర పరిమళభరితమయిన గంధమాదనంలా వుంది.

ఎదురుగా ఒక ప్రాసాదం కనబడింది.

అది వేయిస్తంభాలతో కైలాసగిరిలా ఉంది.

పగడాల మెట్లతో బంగారువేదికలు.

ఆకాశాన్ని అంటే ఎత్తు.

చూస్తున్నాడు హనుమంతుడు.

నిశితంగా దృష్టిని కేంద్రీకరించాడు.

శుక్లపాడ్యమినాటి చంద్రరేఖవలె, ఉపవాసాలతో కృశించిన దీనవదనంతో, మలినవస్త్రధారిణియై, రాక్షసీజనపరివృతయై, పొగక్రమ్మిన అగ్ని జ్వాలవలె, కుజగ్రహ పీడితమయిన రోహిణీ నక్షత్రంలా, క్రూర మృగాలమధ్య ఆడులేడిలా, నల్లత్రాచువంటి జడతో, పచ్చనివస్త్రం ధరించి ఉన్న విశాలనయనను చూశాడు.

చూచి చూచి:

ఈవిడ సీత అయివుండాలి.

ఔను - నాడు రావణుడు తీసుకువచ్చేటప్పుడు తాము ఋశ్యమూకం నుండి చూచిన వనితారత్నం యిలానే ఉంది.

అదే చంద్రవదనం, అదే భ్రూమధ్యం, అదే దేహకాంతి. పద్మ దళనయన, బింబాధర, రతీదేవిలా ఉన్నది నియమనిష్ఠలతో ఉన్న తాపసి. భయకంపితయై రోజుతూన్న నాగరాజ పత్నిలా ఉంది.

సందిగ్ధమయిన స్మృతిలా క్షీణ సంపద వలె, ప్రతిహతమయిన ఆశలా, విఘ్నమయిన కార్యంలా, కలుషమయిన బుద్ధిలా, చెదరిన శ్రద్ధవలె, అపవాద దూషితమయిన కీర్తివలె ఉన్నది.

రావణుడు అపహరించాడనే బాధతో కృశించింది. రాక్షస స్త్రీలు పెట్టే బాధలు పడలేనట్లుంది. బెదరిన లేడిపిల్లలా చూస్తున్నది.

కన్నీటితో నిట్టూర్పులు విడుస్తూ, కారుమేఘాల మాటున చంద్రకాంతిలా, మననం లేక విస్మరించిన విద్యలా, వ్యాకరణసంస్కారం లేక అనర్థద్యోతకమయిన వాక్కులా ఉంది.

జానకీదేవి ఏఏ అలంకారాలు ధరించేదని రాముడు వివరించాడో వాటి గుర్తులు కనిపించాయి.

అవే కర్ణాభరణాలు, అవే కంకణాలు. అవిగో మాణిక్య దీప్తులు, పగడాల కాంతులు. కొంచెం తగ్గి నల్లబడ్డాయి.

ఋశ్యమూకం మీద పడవేయగా మిగిలిన నగలు కాబోలివి. ఆనాడు ఆ నగలమూటకు కట్టిన పట్టుచీర చెరగు, ఈ చీరదే, ఇంతకాలంగా కడుతున్నా నలిగినా, మాసినా పూర్తిగా రంగు మాయలేదు.

ఈ కనకాంగి నిశ్చయంగా రామపత్నియే. ఈమె మనస్సు ఆయన మీదనే ఉన్నట్టుంది.

రాముని కీమెయందు జాలి - అబల బలాత్కృతయై అపహరింపబడినదని.

ఈమె యందు ఆదరభావం - తననే నమ్ముకుని వచ్చి యిలా కష్టాలపాలయిందని.

దుఃఖం - ఇటువంటి యిల్లాలితో వియోగంవల్ల.

మదన తాపం - హృదయేశ్వరి దూరమయిందని.

ఇంక సందేహం లేదు.

ఈవిడే ఆయన భార్య.

వీరుభయుల మనస్సులూ ఒకరియందొకరికి లగ్నమయి ఉండడం వల్లనే యింకా జీవించి ఉన్నారు వీరు.

ఈవిడ దగ్గరలేని దుఃఖంతో ఆయన ఎలా జీవించగలుగుతున్నాడో!

ఎంత దుర్భరమయిన వ్యథ, అని సీతా సందర్శన సంతోషంతో నిండిన హనుమంతుని మనస్సు రామచంద్రుని అభినందించింది.

పదిహేనవసర్గ.

## ఆలోచన

చూస్తున్న హనుమంతుని కన్నుల నీరు నిండింది. ఉత్తములయిన కుల, గురు, వృద్ధుల శిక్షణలో పెరిగిన లక్ష్మణుని వంటివానికి పూజ్యుడూ, గురువూ అయిన రామచంద్రుని భార్యకు యిటువంటి క్లేశం కలిగిందంటే కాలం ఎంత బలీయమయినదో!

ఈవిడకు రామ లక్ష్మణుల ధీ ధీరశక్తులు పూర్తిగా తెలుసు కనుకనే అంతగా కలతపడడంలేదు. వర్షాకాలపు మేఘాలను చూచి గంగానది క్షోభిస్తుందా!

కుల రూప గుణ శీలాలలో యిద్దరూ సమానులే. అందువల్లనే ఈమెకు ఆయన, ఆయనకు ఈవిడ తగినవారు.

ఈ విశాలాక్షికోసం వాలిని నేలకూల్చాడు రాముడు.

రావణసముడయిన కబంధుణ్ణి హతమార్చాడు.

విరాధుడికీ అదే గతి పట్టింది. వాడేం తక్కువవాడా! శంబరాసురు నంతటివాడు.

భీకరాకారులయిన ఖర దూషణాదులతో వారి సేన పదునాలుగు వేలు జనస్థానంలో నామ రూపాలు లేకుండా పోయింది; యీవిడకోసం.

సర్వవానరేశ్వరు డయిన వాలిని నేలకూల్చి సుగ్రీవునికి పట్టాభిషేకం జరిపింది యీవిడ కోసమే.

నదీ నద సాగరాలు లంఘించి లంకానగరాన్ని నేను చూడగలిగానంటే ఈ యిల్లాలి వల్ల కాదా!

ఈవిడ కోసం రామచంద్రుడు ముల్లోకాలు తలక్రిందులు చేసినా ఆశ్చర్యంలేదు.

ఈ జనకరాజనందనతో చూస్తే త్రిలోకాధిపత్యం గడ్డిపరక. దర్మపరుడైన జనకుని పుత్రిక, పతివ్రతా శిరోమణి.

విదేహాధీశుడు యజ్ఞంకోసం నాగలిపట్టి దున్నుతున్నవేళ పద్మపరాగ సమధూళినుండి బైటపడ్డ దీవిడ.

పూజ్యుడూ, పరాక్రమోపేతుడూ అయిన దశరధుని యింటికి కీర్తిని తెచ్చిపెట్టిన పెద్దకోడలు.

ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, ఆత్మవేత్త అయిన రాముని ప్రియపత్ని.

అటువంటి నారీమతల్లి ఈ రాక్షసజన మధ్యంలో పడింది. సర్వరాజ భోగాలూ విడిచి భర్తృవాల్లభ్యంతో అరణ్యక్లేశా లనుభవించడానికి ఆయనతో వచ్చిన ఉత్తమురాలు.

కందమూలఫలాలు తింటూ హాయిగా భర్తను సేవించుకున్నది. ఎన్నడూ క్లేశాలు ఎరుగనిది, ఈ నా డింతటి అవస్థ అనుభవిస్తున్నది.

శీలసంపన్నయైన యీవిడకోసం రాము డెదురు చూస్తున్నాడు. ఈవిడ దొరికితేచాలు భూ మండలమంతా సాధించిన సంతోషం కలుగుతుంది రామునికి.

ఇక్కడ బంధుజనం లేరు, భోగాలు లేవు. అయినా యీవిడ జీవించకలుగుతున్నదంటే రామసమాగమకాంక్ష కాక వేరేమున్నది.

ఈవిడ తన చుట్టూ వున్న రాక్షసగణాన్ని కాని, పూల తీవెలనుకాని చూస్తున్నట్లులేదు. రామదర్శనమందే ఏకాగ్రమై ఉన్నది, యీవిడ మనస్సు.

ఈ పద్మనయనను, సుఖబోగార్హను యీ దశలో చూస్తుంటే నా మనస్సు చింతామయి మవుతున్నది.

రామ లక్ష్మణుల రక్షణలో ఉండవలసిన యీ భూజాత యీ వికృతాకార జన మధ్యంలో ఉన్నది.

మంచు దెబ్బతిని వాడిన పద్మంలా దుఃఖపరంపరతో కృశించి ఉంది. ప్రియుడు దూరమయిన చక్రవాకిలా దీనంగా ఉంది.

పూలబరువుతో వంగిన కొమ్మలతో ఉన్న ఈ అశోకం కూడా యీవిడకు సంతోషాన్ని కలిగించడంలేదు. మంచుపొరల అడ్డంలేని శీతకిరణుడు కూడా యీమెకు సుఖం ప్రసాదించలేకపోతున్నాడు, అలా ఆలోచిస్తూ కూర్చున్నాడు హనుమంతుడు.

పదహారవ సర్గ.

## రాక్షసీగణం

నీలి నీలి కాంతుల జలాలున్న సరోవరంలో హంస ప్రవేశించినట్లు కలువపూగుత్తివంటి చంద్రుడు ఆకాశంలో దిగువకు వచ్చాడు. నిర్మల ప్రభలతో చల్లగా సోకుతూ హనుమంతునికి తోడుపడుతున్నాడు. ఆ సమయంలో శోకభారంతో ఉన్న సీతాదేవి బరువెక్కి నీట మునిగిన నావలా ఉంది.

చుట్టూ ఉన్న రాక్షస స్త్రీలవైపు ఆయన దృష్టి మరలింది. వారిలో-

ఒకే కన్ను కలది.

ఒకే చెవి గలది.

ఒకదానికి చెవులులేవు.

మరొకతెకు మేక చెవులు.

ఒకదాని ముక్కు శిరసువైపు తిరిగి ఉంది.

ఏనుగు తలకాయ, బారెడు పొడవైన కంఠం, తెగిన కేశాలు. కేశాలే లేనిది, కంబళీజుట్టు, వ్రేలాడిపోయిన చెవులు, నుదురు, పొట్ట, వక్షోజాలు. పెదవులు, బుగ్గలు. అంతేకాదు ఒకతెకు మోకాళ్ళుకూడా వ్రేలాడుతున్నాయి.

పొట్టిది, బాగా పొడుగుది, గూనిది, మరుగుజ్జుది, వికటంగా ఉండేది, వంగిన ముఖం, పచ్చని కళ్ళు, వికృత ముఖం....... ఇంకా చూస్తున్నాడు-

కొందరు పచ్చరంగు, మరి కొందరు నల్లరంగు. కలహప్రీతితో కొందరు, క్రోధస్వభావంతో కొందరు, ఇనుప శూలాలూ, ముద్గరాలూ ధరించి కొందరు.

పంది ముఖాలు, లేడి తలకాయలు, పులిశీర్షాలు, నక్క మొహాలు, దున్నపోతు రూపాలు. ఏనుగు పాదాలు, గుఱ్ఱపు డెక్కకాళ్ళు, లొట్టిపిట్ట కాళ్ళు, లోపలకుపోయిన తలకాయలతో కొందరు. గాడిద, గుఱ్ఱం, ఆవు, ఏనుగు, సింహాల చెవులతో కొందరు.

ముక్కులేనివారు, అడ్డ ముక్కులవారు, పెద్ద ముక్కులు. కుంభకుచాలు, కుండ కడుపులు, అందరూ క్రోధంతోనే ఉన్నారు.

సురాపానం, మాంస భోజనం, నిరంతరం అదేపని వారికి. అటువంటి వారి మధ్య సీతాదేవి.

పుణ్యక్షయమై నేలకు జారిన నక్షత్రంలా ఉంది.

ఏ అలంకారమూ లేకున్నా భర్తృవాత్సల్యమే భూషణంగా కనిపిస్తున్నది.

సింహాల మధ్య ఆడు ఏనుగులా ఉంది.

శరత్కాల మేఘం వెనుక చంద్రకళలా, తీగలులేని వీణలా, ధూళి నిండిన తామరతూడులా వుంది. పాతివ్రత్యమే రక్షగా వుంది.

దుఃఖాల రాశిలా వుంది.

సీతాదర్శనంతో ఆయన మనస్సు క్లేశరహితమై రామచంద్రునికి అభివాదాలర్పించింది. లక్ష్మణస్వామికి కూడా అభివాదాలు చేసి ఆ చెట్టు కొమ్మలలో రహస్య ప్రదేశానికి చేరాడు, హనుమంతుడు.

ఇది పదిహేడవ సర్గ

## రావణప్రవేశం

తెల తెల వార నున్నది. ఆ సమయంలో

యజ్ఞకార్య నిర్వహణ సమర్థులయిన వేదవేత్తల వేదపఠనం వినిపించింది. దానిని అనుసరిస్తూ మంగళవాద్య ధ్వనులు వస్తున్నాయి. అప్పుడు నిద్రలేచిన దశకంఠుడు సీతాదేవి మీద కాంక్షతో శయ్య దిగాడు. జారిన ఆభరణాలూ, వస్త్రాలూ విడిచి, నూతనవస్త్రాభరణాలంకృతుడై అశోకవనానికి బయలుదేరాడు.

మణిఖచిత సువర్ణ తోరణాలతో అలరారే ఉద్యానవన వీధులను దాటి వస్తున్నాడు.

దేవేంద్రుని వెన్నంటివచ్చే అప్సరసల వలె నూరుగురు గంధర్వ భామినులు ఆయన వెనుక బయలుదేరారు.

కొందరి చేతులలో బంగారు కాగడాలు, కొందరి హస్తాలలో తెల్లని వింజామరలు, మరికొందరి కరాలలో తాళవృంతాలు. బంగారు కుండలలో పవిత్ర జలాలతో కొందరు, మరికొందరు రత్నపీఠాలతో, ఖడ్గపాణులై కొందరు.

రత్నమయ పాత్రలో ఆసవం నింపి ఒకతె.

చంద్రకాంతు లీనే వెండిగొడుగుతో మరొకతె.

అందరూ నిద్రమత్తుతో అలసిన కనులవారే.

వారందరూ మేఘాన్ని అనుసరించే మెరుపులవలె ఉన్నారు. చెదరిన కేశపాశాలు, అస్తవ్యస్తమయిన హారనూపురాలు, జారిన మంచి గంధపు పూతలు, చిరుచెమటలు నిండిన వదనాలు.

అందరూ రావణ ప్రియంభామలే; ఎంతో గౌరవంతో, కామంతో సేవించేవారే.

ఆయన మాత్రం సీతనే వాంఛిస్తున్నాడు. నెమ్మదిగా అడుగులు వేస్తున్నాడు.

వస్తూన్న వనితామణుల అందెల రవళులు, వడ్డాణపు గంటల ధ్వనులు హనుమంతుని చెవిని పడ్డాయి.

సువాసనాభరితమయిన తైలంతో తడిపిన వస్త్రాలు చుట్టిన కాగడాల కాంతులలో వన ప్రవేశద్వారం చేరాడు రావణుడు. మదనోద్దీప మదంతో ఎరుపెక్కిన విశాలనయనుడైన రావణుడు ఇక్షుశరాసనం చేతిలో లేని మన్మథుని వలె ఉన్నాడు.

అమృతమథన సమయంలో పుట్టిన నురుగువలె ఉన్న ఉత్తరీయం ఆయన భుజకీర్తులలో చిక్కుకుంటుంటే దాన్ని విలాసంగా సవరిస్తున్నాడు.

ఆయన ముందుకు వస్తూంటే హనుమంతుడు ఆకుల గుబురులలో చేరాడు.

రావణ ప్రియకాంతలు కనిపించారు.

అలంకార శోభితుడై, శంకుకర్ణకాంతితో అలరారే విశ్రవస నందనుడైన రావణుని చూచాడు, హనుమంతుడు.

నక్షత్ర మధ్యంలో చంద్రునివలె ఉన్నాడు, రావణుడు.

బాగా పరిశీలించి–

ఓహో! అంతఃపురంలో హంసతూలికా తల్పంమీద నిద్రిస్తున్న దీయనేనా! అనుకున్నాడు.

ఆ తేజస్సును చూచి ఒక్కమారు ఎగిరి గంతువేశాడు. మళ్ళీ గుబురులలో దాగి చూస్తున్నాడు.

పరమ సుందరాంగి అయిన జానకిని సమీపిస్తున్నాడు రావణుడు.

ఇది పద్దెనిమిదవ సర్గ.

## జానకీదేవి

ఉత్తమురాలయిన సీతాదేవి తన ఎదురుగా నిలిచిన రూపయౌవన సంపన్నుడూ, సర్వాలంకారభూషితుడూ అయిన రావణుని చూస్తూనే పెనుగాలిలో అరటిమొక్కలా కంపిస్తూ, కాళ్ళూ చేతులూ ముడుచుకుని కూర్చుంది.

విపరీత దుఃఖంతో ఉన్న ఆవిడ మహాసముద్రంలో మునిగిపోయిన నావలా ఉంది.

వ్రతనియమంతో, ఏ ఆస్తరణం లేకుండా నేలమీద కూర్చున్న ఆ యిల్లాలు చెట్టునుండి విరిగిపడిన కొమ్మలా ఉంది.

ధూళి ధూసరిత దేహంతో బురదనిండిన తామర తూడులా ఉంది.

తన మనస్సు ఎరిగిన రాముని దగ్గరకే ఆమె మనస్సు ప్రయాణం చేస్తున్నది. రామునిమీదనే సర్వమూ లగ్నం చేసుకున్నది. మంత్రబద్ధమయిన ఆడత్రాచులా ఉంది. దూమకేతువు ఆవరించిన రోహిణీ తారలా కనిపిస్తున్నది.

ఆచార కులశీల సంపన్నయ్యై ప్రభవించి అనాచారపీడితయ్యైనట్లుంది.

శిదిలమయే కీర్తిలా

అవమానిత శ్రద్ధవలె

క్షీణప్రజ్ఞలా, నెరవేరని ఆశలా

శూన్యమయిన భవిష్యత్తులా

ఎదురు తిరిగిన శాసనంలా, ప్రమాద సమయంలో మండే దిగంతంలా, దొంగిలింపబడిన పూజాద్రవ్యంలా,

నలగద్రొక్కిన తామరతూడులా

సర్వశూరులూ కూలిన సేనలా

చీకటి చుట్టుముట్టిన వెలుగులా

ఎండిన నదిలా

తుడిచిన వేదికలా

ఆరిన అగ్నిలా,

రాహువు నోట చంద్రునిలా

ఆకులూ, పూవులూ పెల్లగించిన ఏనుగు తొండంతో చెల్లాచెదరయిన మృణాళనాళంవలె

కృష్ణపక్షపు రాత్రిలా

ఎండవేడికి వడలిపోతున్న తామరతూడులా

గజరాజు బంధితుడు కాగా దుఃఖించే ఆడ ఏనుగులా,

మేఘాలు లేనిచోట వనంలా

ఉపవాస దుఃఖంతో కృశించి, దీనురాలై, అల్పాహారంతో, తపోధనంతో తన భర్తవల్ల ఈ దశకంతుడు పరాభూతుడు కావాలని అంజలిబంధంతో ప్రార్థిస్తున్నట్టుంది.

పవిత్ర చరిత్ర కల ఆ ధవళాయతనేత్రను సంహరించేటట్లు చూశాడు రావణుడు.

ఇది పందొమ్మిదవ సర్గ.

## రావణ ప్రణయం

తాపసిలా ఉన్న ఆ పతివ్రతను చూసి రావణుడు మధుర వాక్యాలతో తన ప్రణయ ప్రార్థన ప్రారంభించాడు:

ఓ సుందరీ! ఎందు కింత భయం? ఆ భయంతో నీ సౌందర్యం అంతా దాచుకుంటావు దేనికి. సర్వలోకాలనూ ఆకర్షించే నీ అందాన్ని నేను అర్థిస్తున్నాను. నన్ను ఆదరంతో ప్రేమించు.

ఇక్కడ మీ మానవప్రాణి లేదు. వీ రెవరూ కామరూపశక్తికలవారు కారు. నీలానే మాకు కూడా ధర్మభీతి చాలా ఉంది.

పరస్త్రీలను బలాత్కరించడం, అపహరించడం, వారితో భోగించడం - యిది రాక్షసజాతి ధర్మం. ఈ ధర్మనిర్వహణలో నేను అప్రమత్తంగా ఉంటాను. మరొక్క మాట.

నీ మనస్సు నన్ను కోరేవరకూ నేను నిన్ను ముట్టను. మదన తాపం నా మనస్సును ఎంత వేధించినా నీకు అంగీకారం అయే వరకూ నేను నిన్నేం చెయ్యను, అని నమ్ము. ఎందు కీ దుఃఖం. సుఖంగా నన్ను ప్రేమించు.

కటిక నేలమీద, మలిన వస్త్రంతో, ఏకవేణితో, నిష్కారణం
ఉపవాసాలతో, ఎందుకు దీర్ఘాలోచనతో కాలం గడుపుతావు.

హాయిగా నా మాట విని, నన్ను అంగీకరించు.

రత్నాభరణాలు, సుగంధ, సుమమాలలు, చీనాంబరాలు, మణిమయ పీఠాలు, రకరకాల పానీయాలు, గీత, నృత్యగోష్ఠులు, హంసతూలికా తల్పాలు అన్నీ అనుభవించు.

నదీ ప్రవాహం వెనుదిరిగిరానట్లే యౌవనం కూడా మళ్ళీరాదు.

నిన్ను చూస్తుంటే, ఆ సృష్టికర్త సర్వసౌందర్యరాశిగా నిన్ను సృష్టించి విశ్రాంతి తీసుకున్నాడా అనిపిస్తున్నది. పితామహుడయిన బ్రహ్మకు కూడా కన్ను చెదిరే అందం నీది.

నీ శరీరంలోని అణువణువూ అత్యంత మనోహరమై నా కన్నులకు బంధం వేస్తున్నది.

నా మాటవిని నన్ను భర్తగా గ్రహించు. నా రాణివాసానికి పట్టమహిషిగా ఉండదగిన దానవు.

దిగ్విజయయాత్రలో నేను తెచ్చిన రత్న మాణిక్యరాసులతో నా రాజ్యమూ నేనూ నీ అధీనంలో ఉంటాము.

సర్వనగరశోభితమయిన ఈ భూమండలం అంతా మీ తండ్రి జనకుడికి దానం చేయమన్నా చేస్తాను.

ఈ భువనభవనంలో నన్నెదిరించి నిలువగల వీరుడులేడు. సురాసురులలో నాకు శత్రువై బ్రతికే అర్హత కలవాడు లేడు.

ఈ ఆకారం విడిచి స్వేచ్ఛగా సర్వాలంకారభూషితవై యథేచ్ఛగా నాతోకూడి పానక్రీడలు సాగించు. నీ చిత్తం వచ్చినట్లు ధన, కనక, భూదానాలు చెయ్యి.

నా సంపదలు, నా యశస్సు చూశావుకదా! ఇటువంటి భోగాలు విడిచి నారబట్టలతో తిరిగే రాముడికోసం బాధపడతా వెందుకు!

వానికి – సంపదలేదు. విజయకాంక్ష లేదు. వనవాసం, కటికనేల మీద శయనం; అన్నిటినీ మించి అసలామనిషి బ్రతికివున్నాడో లేడో తెలియదు. కారుమేఘాల వెనుకనున్న చంద్రకాంతిని చూడలేనట్లే నిన్ను రాముడు చూడడానికి కూడా శక్యం కాదిప్పుడు.

ఇంద్రపాప్తగతమయిన కీర్తి హిరణ్యకశిపుడికి అందుతుందా! అలానే నా చేజిక్కిన నిన్ను రాము డందుకోలేడు.

ఓ చారునేత్రా! గరుత్మంతుడు వాడిగోళ్ళతో పామును పట్టినట్లు నీ అందంతో నన్ను హరిస్తున్నావు.

ఈ దశలో నిన్ను చూస్తూంటే నా మనస్సు వికలమై నా అనుగు భార్యలను కూడా ఆదరించలేకపోతున్నది.

సర్వగుణ లక్షణాలతో శోభించే నా అంతఃపుర స్త్రీలందరికీ నువ్వు యాజమాన్యం వహించు.

దేవలోకంలో అప్సరసలు లక్ష్మీదేవిని ఆరాధించే రీతిలో నా నారీజనం నిన్ను పూజిస్తారు.

నా సంపద కుబేరుని సంపదకు మించినది. అదంతా నీకు ధారపోస్తాను.

తపో బల పరాక్రమాలలో, యశస్తేజస్సులలో సంపదలో రాముడు నా గోటికి పోలడు.

ఓ లలనా! హాయిగా ఆసవపానం చెయ్యి, స్వేచ్ఛా విహారంతో క్రీడాభోగాలనుభవించు. ఈ రాజ్యశ్రీ అంతా నీది. నీతోపాటు నీ బంధు కోటి కంతకూ యీభోగాలు అనుభవించే అదృష్టం కలిగించు.

వికసించి సువాసనలీనే పూలతోటలలో, సముద్రతీరవనాలలో హాయిగా సర్వాలంకారభూషితవై నాతో సుఖంగా అనుభవించు, అన్నాడు రావణుడు.

ఇది ఇరువదవ సర్గ.

## తృణప్రాయం

రావణుని ప్రలోభపూరిత మయిన కామప్రసంగం విన్న సీత, ఎదురుగా వున్న గడ్డిపరకతీసి రావణుని ముందుంచి, భయకంపితయై దీనస్వరంతో,

నీ మనస్సు మార్చుకుని నీ నారీజనం మీద నిలుపుకో. పాపికి సత్ఫలితాలు దొరకవు. అలానే నీకు నేను అందను.

నా పుట్టినిల్లు, మెట్టినిల్లు పరమపవిత్రమయినవి నేను యీ అకార్యం చెయ్యను, అంటూ ముఖం ప్రక్కకు త్రిప్పి;

సజ్జనధర్మాన్ని, వారి నియమాలనూ విస్మరించకు. నేను పతివ్రతా ధర్మశీలను, పరస్త్రీని, అటువంటి నన్ను భార్యగా భావించడం నీకు తగదు.

నీ భార్యలతో నువ్వు సుఖంగా ఉండు; వారి రక్షణ నీకెంత ముఖ్యమో నా రక్షణ నా బర్త కంత ప్రదానం.

కట్టుకున్న భార్యతో తృప్తిపడని వానిని చపలచిత్తునిగా, ఇంద్రియ నిగ్రహంలేని వానిగా బావించి పరాభవిస్తారు, పరస్త్రీలు.

ఈ లంకానగరంలో సత్పురుషులే లేరా! ఉన్నా వారి మాట నీ చెవి కెక్కడంలేదా! సదాచారవిరుద్ధంగా నీ బుద్ధి యింతటి విపరీతానికి ఒడిగట్టిందేం! ఆత్మజ్ఞానశూన్యుడై, దురాచారపరుడైన రాజువల్ల రాజ్యం సర్వనాశనమవుతుందని ఎరుగవా!

సర్వసంపదలతో అలరారే ఈ లంకానగరం నీ ఒక్కడి దురాచారాల వల్ల త్వరలోనే నశిస్తుంది. దూరదృష్టి కుండా నువ్వు చేసే పాపకర్మలు నిన్ను బలిగొన్నరోజున సర్వభూతకోటీ స షిస్తుంది. ఈనాడు నీ దుర్మార్గాలకు తలవంచిన వారందరూ నిన్ను ఆ ...కునే రోజు రాకపోదు. ఆనాడు దైవం తమను అనుగ్రహించి నిన్ను కడ ందని సంతోషిస్తారు.

నీ సిరి సంపదలు నన్ను ...ంచించవు. సూర్యుని వీడని కాంతిలా రాముని వెన్నంటి నేనుంటాను. ...ర్వలోకనాథుడయిన శ్రీరామచంద్రుని భుజసీమ ఆధారంగా శయనించె నేను మరొకరిని తాకను. ఆత్మజ్ఞానియైన విప్రునికి లభించే వేదవిద్యవలె నేను రాముని సంపదను. ఈ దుఃఖసాగరం నుండి నన్ను ఉద్ధరించి రాముని దగ్గరకు పంపు.

నీకు జీవితంమీద ఆశవుంటే నేను చెప్పినట్లు చెయ్యి. రామునితో స్నేహం చేసుకో. ఆయన ధర్మాత్ముడు, శరణాగత వత్సలుడు ఇంద్రియ దౌర్బల్యాలకు లొంగకు. నన్ను నా భర్త దగ్గరకు పంపితే నీకు శ్రేయస్సు కలుగుతుంది, లేదా నీ మరణం తథ్యం.

ఇంద్రుని వజ్రాయుధాన్ని తప్పించుకోవచ్చు.

యమపాశాన్ని వదిలించుకోవచ్చు.

కాని రామబాణానికి తిరుగులేదు.

అగ్నిశిఖలు జిమ్మే మహాసర్పముఖాలవలె, రామ, లక్ష్మణుల నిశితబాణాలు యిక్కడపడక తప్పదు. ఈ నగరంనిండా రాబందులు చేరి నీ రాక్షసజనాన్ని పీక్కుతింటాయి. రామగరుత్మంతుడు రాక్షస సర్పాలను తనవాడిగోళ్ళ బాణాలతో చీల్చి చెండాడుతాడు.

రాక్షసలక్ష్మిని మూడడుగుల వామనుడు హరించినట్లు శత్రునాశన సమర్థుడయిన రాముడు ఈ రాక్షసశక్తిని నశింపజేసి నన్ను తీసుకువెడతాడు.

జనస్థానంలో నీ రాక్షసబలాన్ని ఆయన సర్వనాశనం చేసినప్పుడు ఎదుర్కోలేని అసమర్థుడవు; వారు ఆశ్రమంలో లేనప్పుడు వచ్చావుకనక యీపని చెయ్యగలిగావు.

వారి కంటబడితే పెద్దపులులముందు కుక్కలా అయేవాడవు. వృత్రాసురుడు ఇంద్రుని నిగ్రహించలేనట్లే నువ్వు రామలక్ష్మణులను ఎదుర్కొనలేవు. సూర్యరశ్మి జలాశయాలను ఆవిరిచేసేటట్లు రామలక్ష్మణులు నిన్ను ప్రాణహీనుని చేస్తారు.

కుబేరనిలయంలో దాగినా, వరుణాలయంలో శరణుపొందినా, పిడుగుపడిన చెట్టువలె నీకు శ్రీరామబాణంతో చావు తప్పదు, అంటున్నది సీత.

ఇది ఇరువది ఒకటవ సర్గ.

**అకామాం కామయానస్య**
**శరీర ముపతప్యతే**
**ఇచ్ఛంతీం కామయానస్య**
**ప్రీతి ర్భవతి శోభనా**

★ ★ ★ ★

## రావణుని క్రోధం

జానకి పలుకులలో పారుష్యం భరించలేక రావణుడు:

నెమ్మదిగా మాట్లాడి వశం చేసుకుందా మనుకుంటుంటే నన్నే వంచుతున్నావు. ప్రేమగా మాట్లాడుతుంటే పరాభవిస్తున్నావు.

నీ మీది అనురాగం నా క్రోధతీవ్రతను హరిస్తున్నది. కాముకుడికి దయ, ప్రేమ ఎక్కువగా ఉంటాయి. అందువల్లనే నిన్ను ఏమీ చెయ్యకుండా వదలవలసి వస్తున్నది. లేకుంటే ఎప్పుడో నిన్ను కడతేర్చి ఉందును.

ఇంకా నీకు రెండు మాసాల గడువుంది. ఈలోపున నువ్వు నా శయనమందిరం చేరి, నన్ను భర్తగా గ్రహించావా, మేలు.

కాదంటే – నిన్ను ఉదయపు ఫలహారానికి వండించేస్తాను. అంటూంటే రావణుని వెంట వచ్చిన దేవ, గంధర్వ కన్యలు దుఃఖంతో సీతను చూస్తూ, అటువంటి ప్రమాదం రాదని హస్త, నేత్ర సంజ్ఞలతో జానకికి ధైర్యం కలిగించారు.

గుండె దిటవు చేసుకుని సీతాదేవి:

రావణా! ఈ అకార్యం నుంచి నిన్ను సత్క్రమ మార్గాన నడిపించే వాడు ఒక్కడూ ఈ లంకలోలేడు, అంటే నీ పరిజనులందరూ నీ నాశనాన్నే కోరుతున్నారు. ఇంద్రునికి శచీదేవివలె నేను రాముని ధర్మపత్నిని. అటువంటి నన్ను వాంఛించేవాడు ముల్లోకాలలో ఉండడు. నీకే పుట్టింది ఈ దుర్బుద్ధి.

అయన క్రోధాగ్ని నుంచి నువ్వు తప్పించుకోలేవు.

నువ్వెరుగుదువో, ఎరగవో!

ఆయన మత్తేభం,

నువ్వు చెవులపిల్లివి.

ఈ క్షణం వరకూ నువ్వు ఆయన కంటబడలేదు కనుక సిగ్గులేకుండా తిరుగుతున్నావు నిర్భయంగా.

నావంటి పతివ్రతను దుష్టబుద్ధితో చూచిన క్షణంలోనే నీ కళ్ళు నేల రాలవలసింది, ఈ దుర్భాషలాడే నీ నాలుక ఈపాటికే ఊడిపోవలసింది.

రామాజ్ఞ లేదు కనుక, పాతివ్రత్య నియమానుసారం నేను నిన్ను బూడిద చెయ్యకుండా వదలిపెట్టాను.

ఇంతకూ నీ చావుకోసమే నన్ను అపహరించి తెచ్చావు. యక్షేశుడయిన కుబేరుని సోదరుడవు.

మహాశూరుడవు కదా! ఇలా వంచనతో పర దారాపహరణ నీచకార్యం ఎందుకు చేశావు? అని ఉంటుండే రావణుడు తన అరుణ నయనాలు మరింత ఎరుపెక్కించాడు. జిహ్వాగ్రం కూడా మండుతున్నట్టుంది.

ఉత్తుంగ భుజద్వయంతో రెండు శిఖరాలతో అలరారే మందరగిరిలా ఉన్నాడు.

సర్వాంగాలంకృతుడై వసంతునిలా ఉన్నా ఆ తీవ్రక్రోధంతో శ్మశాన చైత్యంలా ఉన్నాడు. కుపిత భుజంగం బుసకొడుతూన్నట్టు నిట్టూర్పులు విడుస్తూ సూర్యకాంతి సంధ్యాతిమిరాన్ని చెదరగొట్టేట్లు నిన్ను భస్మం చేసేస్తాను, అని అక్కడి రాక్షస స్త్రీజనాన్ని సాభిప్రాయంగాచూస్తూ:

ఎలా అయినా యీ సీత మనసు మార్చండి. సామ, దాన, భేదాలకు లొంగకపోతే దండోపాయం సాగించండి.

అని భయంకరాకారంతో సీతవైపు తిరిగాడు.

అప్పుడు ధాన్యమాలిని అనే నారీమణి చకచక రావణునిచేరి, గాఢంగా కౌగలించుకుని:

నాథా! కృశించి, దీనంగా పడివున్న యీ మానవప్రాణితో నీ కేమిటయ్యా. నాతో భోగించు. దీనికి నీ భోగాలు అనుభవించేయోగం లేదు.

మనమీద యిష్టంలేని వారితో వెడితే. శరీరతాపమే తప్ప సుఖంలేదు.

నిన్ను కోరేవారితో భోగం తృప్తినిస్తుంది, అని పొగుడుతూంటే, రావణుడు అట్టహాసం చేసి వెనుదిరిగాడు. అయనతో వచ్చిన వారందరూ అనుసరించి వెళ్ళారు.

ధర్మనిష్ఠురాలయిన జానకీదేవి

గజ గజ వణుకుతూ ఉండిపోయింది.

ఇది ఇరువదిరెండవ సర్గ.

## రాక్షస ప్రవృత్తి

రావణుడు అంతఃపురం చేరాడు.

అశోకవనంలోని రాక్షస స్త్రీ లందరూ సీతను చుట్టుముట్టి క్రోధంతో:

మా ప్రభువు రావణుడంటే ఎవరనుకుంటున్నావో, పులస్త్యవంశంలో ప్రభవించిన మహామహుడు అటువంటి ఉత్తమపురుషుని వరించడానికి బాధపడతావేమే! అని గర్జించిందొకతె

**ఏకజట:** ప్రజాపతులు ఆరుగురు. వీరందరూ బ్రహ్మమానసపుత్రులు వారిలో నాలుగవవాడు పులస్త్యుడు. ఆయన కుమారుడు విశ్రవసువు, మహాతేజశ్శాలి, మహర్షి. వీరి కుమారుడు మా ప్రభువు, రావణుడు. ఆయనను వరించడం నీ అదృష్టం.

**హరిజట:** దేవతా శ్రేష్ఠులను జయించిన మా రాక్షస ప్రభువే నీకు యోగ్యుడయిన భర్త.

**ప్రఘస:** మహావీరుడు, శూరుడు. యుద్ధరంగంలో వెన్ను చూపని మహాయోధుడయిన మా మహారాజును వరించడానికి సంకోచం దేనికీ? ఆయన తన ప్రియురాండ్రందరను విడిచి నిన్నే దగ్గరకు తీసుకుంటాడు. వేలసంఖ్యలో ఉన్నారు ఆయనకు భార్యలు. వారినీ, మణి, రత్న, శోభితమయిన అంతఃపురాన్నీ విడిచి నిన్నే ఆరాదిస్తాడాయన.

**వికట:** దేవ, నాగ, గంధర్వ, రాక్షసవీరులను మన్ను కరిపించిన మా మహారాజు నీ కోసం ఎదురు చూస్తున్నాడు. అటువంటి శ్రీమంతునితో ఉండడానికి ఎందుకంగీకరించవు?

**దుర్ముఖి:** తెలుసా నీకు; ఆయనకు భయపడి సూర్యుడు విజృంభించలేడు.

వాయువు ప్రచండంగా చలించలేడు.

లతలు, తరువులు పూలవానలు కురుస్తూంటాయి.

అవసరానికి మించి లంకలో మేఘాలు వర్షించవు.

అంతటివాడు మా ప్రభువు. నా మాటవిని ఆయనను వరించు. లేదా నీ ప్రాణాలుండవు.

సర్వప్రాణికోటికీ ఆహ్లాదం కలిగించే రీతిలో సర్వభోగాలతో ఉంటుంది ఆయన అంతఃపురం. అక్కడకు వెళ్ళి హాయిగా వుండు.

నువ్వు మానవస్త్రీవి కనుక మానవుడి భార్యవయావు. బావుంది. కాని యిప్పుడింక మనసు మార్చుకో.

త్రిలోకాలలో వుండే సంపదలతో వెలిగే మా రాక్షస ప్రభువుతో స్వేచ్ఛగా చరించు.

రాజ్యహీనుడు, ఎందుకూ కొరగానివాడు అయిన రామునికోసం బాధపడకు, అని ఒక్కొక్కరే బెదరిస్తూ బోధిస్తుంటే కన్నీట తడిసి సీత:

మీ మాటలు సర్వలోకాలకూ అసహ్యమయినవి. ఈ పాపకార్యానికి నా మనస్సులో చోటు లేదు. మీరందరూ కలిసి నన్ను కాల్చుకు తిన్నా నేను మీ మాట వినను.

దీనుడయినా, రాజ్య హీనుడయినా రాముడే నా భర్త. ఇంద్రుని వెంట శచీదేవి, వశిష్ఠులతో అరుంధతి, చంద్రుని కూడి రోహిణి, అగస్త్యులవారితో లోపాముద్ర, చ్యవనునితో సుకన్య.

సావిత్రి - సత్యవంతులూ, శ్రీమతి - కపిలుడు, మదయన్తీ - సౌదానులు, కేశినీ - నగరులు, నల - దమయంతులు, అలానే నేను రామునితో ఉంటాను, అని నిశ్చలంగా చెప్పింది.

రాక్షస వనితలకు క్రోధం రేగింది. పరిపరి విధాల పరుష భాషలతో వేధిస్తున్నారు.

శింశుపావృక్షశాఖలలో ఉండి చూస్తున్నాడు హనుమంతుడు.

ఆ క్రూరరూపిణులు పళ్ళుకొరికి, పెదవు లాడిస్తూ, గండ్రగొడ్డళ్ళు పైకెత్తి:

ఇది మన ప్రభువుకు తగదు, అని గర్జించారు.

వారిలో వినత;

సీతా! ఇంతవరకూ చూపిన పతిభక్తిచాలు, సంతోషించాం. దేనికయినా అతి పనికిరాదు. నా హితవు ఆలకించు. దీనదశలోవున్న మానవ భర్తను విడిచి, ఇంద్రసమపరాక్రముడయిన మా రాక్షసేశ్వరుని వరించు. దివ్యభోగాలతో మహారాణిగా వెలుగుతావు. రాముడికెప్పుడో ఆయువు చెల్లిపోయింది. అటువంటి వాడికోసం బాధపడకు. నామాట వినవో, నిన్ను చీల్చుకు తినెయ్యగలం.

వికట: ఓసి దుష్టురాలా! ఇంతవరకూ నీ పాడుమాటలు వింటూ కనికరంతో వదిలిపెట్టాం. నువ్వెక్కడున్నావో తెలుసా? ఏ ప్రాణీ దాటిరాలేని సముద్రానికి ఈవలి ఒడ్డున ఉన్నావు.

రావణుని అంతఃపురంలో వున్నావు. ఇప్పుడు నిన్ను దేవేంద్రుడు కూడా రక్షించలేడు. ఎందుకేడుస్తావు! నా మాటవిను. సుఖంగా ఉంటావు. మా మహారాజును వరించు.

నవ నవలాడే ఈ యౌవనం స్థిరంగా శాశ్వతంగా వుండదు. అది పోకుండానే సుఖసంతోషాలలో తేలియాడాలి.

చూశావా! ఉద్యానవనాలు, పర్వత, కాననాలు, మా ప్రభువు
కనుసన్నలలో మెలిగే ఏడువేలమంది కామినీ జనులు
అన్నీ నీ కోసం యిస్తాడాయన
వినిపిస్తున్నదా నా మాట! వినకపోతే నీ గుండె చీల్చి తినేస్తా..

చండోదరి: ఇదిగో యీ శూలం చూశావా! నిన్ను చూసిననాటినుండి నీ గుండె చీల్చి ప్రేగులు చుట్టబెట్టి, తల పగలగొట్టి తినాలని నాలుక ఊరుతున్నది

ప్రఘస· ఓ సీతా! ఇంక నేను అలస్యం సహించలేను. నీ గొంతు నులిమేస్తాను. నువ్వు చచ్చిపోయావని మా మహారాజుకి చెపితే, హాయిగా ఆరగించండి అని ·జ్ఞాపిస్తాడు మా ప్రభువు

అజాముఖి· దీన్ని చంపి సమంగా పంచుకు తినాలి ఈలోగా నంజుడికి మంచి పచ్చళ్ళూ, త్రాగడానికి కల్లూ కావాలి

శూర్పణఖ : నీ మాట సబబుగా ఉంది అలా కానియ్యి, సర్వదుఃఖాలకూ విరుగుడయిన కల్లు తెప్పించండి త్వరగా సుఖంగా త్రాగి దీని మాంసం తిని నికుంభిలాదేవి దగ్గరనాట్యం చేద్దాం

ఇలా ఎవరికి తోచినట్లు వారు గర్జనలు సాగిస్తుంటే బెదరిన హృదయంతో శోకసాగరంలో మునిగింది జానకి

ఇవి ఇరువది మూడు,
ఇరువది నాలుగు సర్గలు

## విషాదం

భయంకర రూపాలు కల ఆ క్రూర రాక్షస స్త్రీల పరుష వాక్కులు వినలేక జానకీదేవి దుఃఖ సంతప్తహృదయంతో:

మీ రందరూ కలిసి నన్ను తినవచ్చు నేను మాత్రం మీ ప్రభువును వరించను అని మరింత బయంతో అశోకవృక్షం కొమ్మను గట్టిగా పట్టుకుని బొటబొట కన్నీరు విడుస్తున్నది

పెనుగాలికి ఊగిసలాడే లేత అరటి మొవ్వులా వణుకుతూ ఉన్న సీతాదేవి కేశపాశం ఆడు పాములా విలవిలలాడుతున్నది

రామా! లక్ష్మణా!

అత్తయ్యా కౌసల్యాదేవీ! సుమిత్రాదేవీ!

అని విచారిస్తూ, ఎంతటి వారికయినా కాలం చెల్లితే కాని మృత్యువు ప్రాప్తించదు. కాకుంటే నేనింతకాలం రామ విరహంతో యీ దుష్టరాక్షసీజన మధ్యంలో జీవించగలిగేదానినా!

ఇంతటి కారణం నేను చేసిన పుణ్యకర్మలు బహుకొద్దివయి ఉండాలి. అవి కూడా పూర్తి కానున్నాయి కాబోలు, కాగానే, గాలి దెబ్బకు సముద్రంలో మునిగే పడవలా అవుతుంది నా జీవితం. ఇప్పటికే యీ జీవితం వరద నీటి దెబ్బతిన్న నది ఒడ్డులా ఉంది.

కృతజ్ఞతా స్వరూపుడు, ప్రియవాదీ, సింహపరాక్రమ సంపన్నుడు, సర్వజనమనోహరుడు అయిన నా భర్తను ధర్మాత్ములే దర్శించగలరు.

రామునికి దూరమయిన నా బ్రతుకు విషస్పర్శ తగిలిన దేహంలా ఉంది. ఏనాడు చేసిన పాపకర్మమో యిలా బాధిస్తున్నది. ఇక యీ జీవితం వదిలెయ్యడం మంచిది. రాముడు వస్తాడనే ఆశ కనిపించడం లేదు అని విచారిస్తూ....

ఇష్టం వచ్చినప్పుడు జీవితం విడువలేని ఈ మానవదేహంకంటె నీచమయినది లేదు. ఎంత పరాధీనం ఈ దైన్యజీవితం, అని పరిపరివిధాల శోకిస్తూ, ధూళిలో దొర్లుతూ:

నా భర్త ఆశ్రమం దగ్గర లేనప్పుడు ఈ రాక్షసుడు కామరూపంతో నన్ను వంచించి తీసుకురాగలిగాడు. ఇప్పుడీ రాక్షస స్త్రీల మధ్యలో ఈ బాధలు పడుతూ బ్రతకడం కష్టం.

రాముడు వినా నాకేమీ అవసరం లేదు. ఇంత దుఃఖంలో కూడా నా గుండె నిలిచి ఉన్నదంటే దీన్ని రాతితో నిర్మించి ఉంటాడు బ్రహ్మ. బహుశః నాకు వార్ధక్యం, మరణంలేవేమో!

ఏమయినా నా ఎడమకాలి గోటితో కూడా ఈ రావణుని శరీరాన్ని తాకను. నా తిరస్కారంకూడా వీడికి తెలియడంలేదు. నన్ను చీల్చి ముక్కలు చేసి నిప్పులో పడవేసినా నేను రావణునివైపు కన్నెత్తి చూడను.

సర్వజ్ఞుడు, సత్ప్రవర్తనపరుడు, దయాహృదయుడు అయిన రాముడు ఎందుకింకా నా గురించి ఆలోచించడంలేదో తెలియదు.

జనస్థానంలో పదునాలుగువేలమంది రాక్షసులను ఒంటరిగా నేల కూల్చినవాడు, విరాధునివంటి మహాబలిష్ఠుడయిన రాక్షసుని హతమార్చిన

వాడు, రావణుని సంహరించగల శక్తి సంపన్నుడు, తన బాణ ప్రయోగంతో ఈ లంకానగరాన్ని స్వాధీనం చేసుకోగల సామర్థ్యం కలవాడు ఎందుకింత అలస్యం చేస్తున్నాడో!

అయితే నేనిక్కడ ఉన్నట్లు ఆయన ఎరగడేమో! ఎరిగ ఉంటే యిలా ఉపేక్షించేవాడేనా?

రామునికి వార్త చెప్పగల జటాయువును కూడా నా దురదృష్టంకొద్దీ ఈ రావణుడు సంహరించేశాడే!

ఏం చెయ్యను! నన్ను రాక్షస రావణుడు అపహరించినట్లు తెలిస్తే రాముడు తన శరపరంపరతో సర్వరాక్షస సంహారం చేసి తీరుతాడు. సముద్రాన్ని యింకించి, లంకను నాశనం చేసి, ఈ రావణుని పేరు ప్రతిష్ఠలన్నీ మంట గలపగలడు.

ఈనాడు నేను శోకిస్తున్నట్లే, ఈ రాక్షస స్త్రీలందరూ గోలు గోలున విలపిస్తారు.

రాముని కంటబడేవరకే వీడు ఊపిరితో జీవించేది. ఆయన కంటబడిన ఉత్తరక్షణంలో యీ లంకానగరంనిండా చితాగ్ని ధూమం; గ్రద్దల ఆహారం.

పూర్తిగా శ్మశానం అయితీరుతుంది.

నిస్సందేహంగా వీరందరూ నశిస్తారు. నా కోరిక నెరవేరి తీరుతుంది. రావణసంహారంతో యీ లంకా నగరం ధైర్యహీన అయిన స్త్రీవలె పిచ్చెక్కి తిరుగుతుంది.

తప్పదు, ఈ రాక్షస నగరంలో యింటింటా ఆర్తనాదాలు తప్పవు. రామబాణాగ్నిలో యిదంతా తగులబడితీరుతుంది. రాక్షస యోధాగ్రేసరు లందరూ నేల పాలవుతారు.

నేనిక్కడ ఉన్నట్లు తెలిసిన క్షణంలో రాముడు యీపనిచేసి తీరతాడు.

అయితే, రావణుడు నాకిచ్చిన గడువులో యింక రెండు మాసాలే మిగిలాయి. ఈలోగా ఆ మృత్యువు వీడికే రాకూడదా. మాంసభక్షకులయిన యీ రాక్షసులకు ధర్మపరిజ్ఞానంలేదు. గడువు దాటిందంటే వీడు నన్ను ఉదయం ఫలహారానికి వండించితీరతాడు.

అంతకంటే వీరెవరయినా కనికరించి యింతవిషం యిస్తే దానితో యమపురి చేరేదాన్ని.

ఇంతవరకూ రామలక్ష్మణులకు నేను జీవించి ఉన్నానోలేదో కూడా తెలీదు. నన్ను వీడిన దుఃఖంలో ఆయనే ప్రాణాలు విడిచి ఉంటాడేమో.

అసలు నాకీ దుర్దశ ఎందుకు ప్రాప్తించింది. మహాత్ముడు, సర్వశాస్త్రవ ...కుశలుడు, సదాచారపరుడు అయిన రాముడు లేని జీవితం ...కు! నా వియోగబాధతో ఆయన అస్త్రసన్యాసంచేసి ...పయాదా!.

కాక – ఈ రాక్షసుడు కపటోపాయంతో వారిని సంహరించి ఉంటాడా.

ఏమయినా యింతబాధలోనూ నాకు చావు వచ్చిపడదేం.

మనోనిగ్రహసంపన్నులు, రాగద్వేషాతీతులు, పాపరహితులు అయిన మహర్షులు ధన్యజీవులు.

ఆత్మవిదుడు, మనోహరుడు అయిన రాముని విడిచి ఈ క్రూర రావణుని చేతబడిన నేను జీవించి ఉండడంకంటె ప్రాణాలు విడవడం మేలు.

అంటూన్న సీతమాటలు వింటున్న రాక్షసస్త్రీలు కొందరు భయంతో ఆ విషయం నివేదించడానికి రావణుని దగ్గరకు పరుగుపెట్టారు.

ఇవి ఇరువది అయిదు – ఇరువది ఆరు సర్గలు

## త్రిజట స్వప్నం

ఓసి మూర్ఖురాలా! నువ్వు ఆత్మహత్యకు సిద్ధమయావంటే ఇప్పుడే నిన్ను చీల్చుకు తినగలం, అని కొందరు గర్జిస్తుంటే, వారిలో పెద్దదయిన త్రిజట అప్పుడే నిద్రలేచి:

ఓ పిచ్చినన్నాసులారా! జనకరాజసుతను, దశరథుల యింటి కోడలిని తినడం మీ తరంకాదు. మిమ్మల్ని మీరే కాల్చుకు తినాలి. ఈవిడభర్తకు విజయం, లంకకు వినాశనం కలిగే కాలం ఆసన్నమయినట్లు నా కిప్పుడే కలవచ్చింది; అనడంతో, మిగిలిన వారందరూ భయభీతలై ఆమె దగ్గరగా చేరి;

తెల్లవారుఝామున వచ్చిన కలలు జరిగితీరుతాయింటారు. నకు వచ్చిన కల వివరంగా చెప్పు, అన్నారు.

త్రిజట: స్వచ్ఛమైన ఏనుగుదంతాలతో నిర్మించిన పాలకీ. ఎన్నో హంసలు దాన్ని మోస్తున్నాయి. ఆ పాలకీ మీద ధవళవస్త్రాలతో

రామలక్ష్మణులు కనిపించారు. అంతలోనే సముద్రం ఒడ్డున ఉన్న తెల్లని పర్వతంమీద సీతాదేవి స్వచ్ఛవసన ధారియై రామునితో విహరిస్తున్నది.

**మరోకల:** పెద్ద పర్వతమంత ఏనుగు. దానికి నాలుగు దంతాలు. ఆ ఏనుగుమీద రామ లక్ష్మణులు, వారు సీతాదేవి దగ్గరకు వచ్చారు. ఆవిడ కూడా ఆ ఏనుగు ఎక్కింది. భర్తృసన్నిధానంలో ఆవిడ చేతులెత్తి సూర్యచంద్రులను అందుకుంటున్నది. ఆ ఏనుగు లంకానగరంవైపు వచ్చింది.

**మరోకల:** ఎనిమిది జతల తెల్లని వృషభాలు లాగే రథం మీద రాముడు సీతా సమేతం ఈ నగరానికి వచ్చాడు. అంతలో ఆయన సూర్యకాంతులీనే పుష్పకం మీద బయలుదేరి ఉత్తరాభిముఖంగా వెళ్ళాడు. అలా వెడుతున్న ఆ రామచంద్రుని చూచి ముల్లోకాలూ భయపడుతున్నట్టు అనిపించింది. ఆ తేజోమూర్తిని చూస్తుంటే ఈ పృథ్విలో ఆయనను జయించే వారుండరనే నమ్మకం కలిగింది. పాపాత్ములకు స్వర్గప్రవేశార్హత ఉండదుకదా!

**ఇంతలో మరోకల:**

మన రావణ ప్రభువు మత్తుగా త్రాగి, శరీరమంతా నూనెపూసుకుని, ఎర్రనిబట్టలతో, కరవీరపుష్పాలమాలతో, పుష్పకంమీద నుండి క్రిందపడ్డాడు. ఆయనను ఒక స్త్రీ (నల్లని వస్త్రాలు ధరించి, జుట్టులేనిది) యీడుస్తున్నది.

అంతలో నూనె త్రాగుతూ, గంతులువేస్తూ, నవ్వుతూ, ఇంద్రియాల పట్టుతప్పి తిరుగుతూ, గాడిదల రథం మీద బయలుదేరాడు. వెడుతూ వెడుతూ క్రిందపడ్డాడు. పడుతూనే భయంతో లేచి దిగంబరుడై పిచ్చిగా ప్రేలుతూ ఎదుటవున్న దుర్గంధభూయిష్టమయిన గోతిలో మునిగాడు.

అంతలో ఎర్రనిచీరతో, బురదశరీరంతో ఉండే నల్లనిస్త్రీ ఒకతె మన ప్రభువుకి ఉరిత్రాడుపోసి దక్షిణదిశగా ఈడ్చుకుపోయింది. అదేదశలో కుంభకర్ణుడూ కనిపించాడు.

రావణకుమారు లందరూ బుర్రగొరిగించుకుని, నూనె పూసుకున్నారు. రావణుడు వరాహంమీద, కుంభకర్ణుడు ఒంటెమీద, ఇంద్రజిత్తు మొసలిమీద దక్షిణంగా పోతున్నారు.

విభీషణుడు మాత్రం తెల్లనివస్త్రాలు, పువ్వులు ధరించి, శంఖ దుందుభి ధ్వానాలు సాగుతుంటే, నృత్య గీతాలతో నవ్వుతూ నాలుగుదంతాల ఏనుగు మీద తెల్లగొడుగునీడలో ఉన్నాడు. ఆయనతో వాని మంత్రులు నలుగురూ ఉన్నారు.

మన రాక్షసులందరూ ఎర్రని వస్త్రాలు, పూలు ధరించి, తప్పతాగి తిరుగుతున్నారు. ఈ లంకానగరం చతురంగబలసమేతం సాగరాభిముఖంగా పోయి మునిగింది.

మరో క్షణంలో,

ఈ నగరాన్ని రామదూతయైన వానరు డొకడు అగ్ని దగ్ధం చేసినట్లు.

రాక్షసనారీజనం తెగత్రాగి విపరీత ధ్వనులతో, పరుష భాషణాలతో, ఆడుతున్నట్లు,

కుంభకర్ణాదు లందరూ గోమయంతో నిండిన గుంటలో పడినట్లు నా కలలో చూశాను.

ఇదంతా చూస్తుంటే-

ఈ లంకకు ముప్పు వచ్చినట్లే. నిస్సందేహంగా రాముడు లంకా నగరాన్ని సర్వనాశనం చేసి తీరుతాడు.

అందుచేత మనమందరం ఈ సీతాదేవిని శరణువేడాలి. ఇంతకంటె మనకు దారిలేదు. ఈ జనకరాజ నందన మనలను కరుణతో కాపాడుతుంది. నా మాట విని మీరందరూ ఆవిడపాదాలమీద పడండి.

అదిగో చూశారా! ఆవిడ పద్మదళ విశాలనయనం ఎలా వికసిస్తున్నదో ఆమె ఎడమభుజం అదురుతున్నది చూడండి.

అది శుభసూచన.

రామచంద్రుడు ఎదురుగా వున్నట్లు ఆమె శరీరం అంతా పులకిస్తున్నది!

అదిగో, ఆ చెట్టు కొమ్మమీద పక్షికూత విన్నారా! ఎంత సంతోషంగా వినిపిస్తున్నదో! చుట్టాలు వచ్చి పలకరిస్తున్నట్లు లేదూ! అని త్రిజట అంటూంటే సీతాదేవి సంతోషభరిత వదనంతో-

నీ కల నిజమయితే మీ అందరికీ నేను అభయం యిస్తాను, అంది.

ఇది ఇరువది ఏడవ సర్గ.

## శుభసూచనలు

***తస్యాః శుభం వామ మరాళపక్ష్మ***
***రాజీవృతం కృష్ణ విశాల శుక్లం***
***ప్రాస్పందతైకం నయనం సుకేశ్యా***
***మీనాహతం పద్మ మివాభితామ్రం***

శ్రీమంతుని చుట్టూ చేరే సేవకులవలె సీతాదేవి శుభ శకునాలతో అలరారింది. సరోవరంలో చేపతోక తగిలిన కమలంవలె ఆమె విశాలమయిన ఎడమకన్ను, అత్యంత సుందరమయిన ఎడమ భుజం అదిరాయి.

ఆమె ధరించిన చీర కొద్దిగా జారింది.

అంతవరకూ ఎండకూ. పెనుగాలికీ దెబ్బతిన్న విత్తనం వాన చినుకులతో మొలకెత్తేశక్తి పొందినట్లు, శుభశకునాలతో సీతాదేవి సంతోషభరిత హృదయ అయింది. రాహువు నోటినుండి బయటపడిన చంద్రబింబంలా ఆమె వదనం వికసించింది.

శోకం తొలగింది.

తాపం వైదొలగింది.

సంతోషం పెల్లుబికింది.

శుక్లపక్ష శశాంకరోచు లీనింది – జానకీ ముఖకల్హారం.

అంతనూ చూస్తూ వింటూ అశోకంలో వున్న హనుమంతుడు, ఈవిడే సీత అనే నిశ్చయానికి వచ్చాడు.

ఇప్పుడింక యీవిడను ఓదార్చాలి. ఓదార్పు లేకపోతే యీవిడ ఏమవుతుందో తెలీదు. ప్రాణత్యాగం చేసినా ఆశ్చర్యం లేదు. ఈవిడతో మాట్లాడి ఆ మాటలు రామచంద్రునికి నివేదిస్తే అయన ఆశ్వాసన పొందుతాడు.

అయితే, ఈ రాక్షసీ మధ్యంలో యీవిడతో మాట్లాడడం ఎలా! మాట్లాడకుండా వెళ్ళి రామునికి ఏం చెప్పాలి, ఎలా అయినా ఈవిడతో మాట్లాడాలి.

నేను వానరుడను. ఏ భాషలో మాట్లాడాలి. మానవ వ్యవహారంలో వున్న సంస్కృతంలో మాట్లాడుతాను.

మరి - రావణుడు విప్రశ్రేష్ఠుడు కదా! వారి భాషా సంస్కృతమే, ఆ భాష పలికితే ఈవిడ నన్ను రావణుడే అనుకుంటే................

అనుకున్నాసరే ఈ భాష తప్ప దారిలేదు, ఆవిడకు అర్థం కావాలంటే.

కాని, నా రూపం నా మాట............వీటితో ఆవిడ నన్ను కామ రూపుడయిన రావణుడని శంకించి భయపడి, కేకలువేస్తే ఈ రాక్షసీజనం వారి ఆయుధాలతో నా మీద పడకుండా ఉంటారా! అప్పుడు నేను దీర్ఘకాయుడనై కొమ్మలమీదినుంచి దూకుతూంటే ఈ స్త్రీలు రాక్షసబలానికి తెలియజేస్తారు. వారు ఆయుధపాణులై వస్తారు. వీరితో పోరాడుతూ తిరిగి సముద్రం దాటడం సంభవమా! ఈలోగా వారు నన్ను బంధించినా బంధించవచ్చు లేదా ఈ క్రూరులు సీతాదేవిని హింసించవచ్చు. ఒకవేళ వీరు నన్ను నరికేస్తే రామునికి వర్తమానం అందదు కదా.

మళ్ళీ ఈ విశాలసాగరాన్ని దాటి ఎవడు రాగలడు. ఈ రాక్షసులతో పోరాడి వీరిని కడతేర్చగలిగినా నేను వెళ్ళడం సాధ్యమా. అదీకాక యుద్ధంలో జయాపజయాలు ముందుగా తేలవే. అటువంటప్పుడు పోరాటానికి దిగడం వివేకవంతుల లక్షణం కాదు.

సరే, యిప్పుడెంత ఆలోచించినా ఈవిడతో మాట్లాడకుండా వెళ్ళడం అవివేకం.

దూత అవివేకి అయితే సర్వకార్యాలూ నాశనమే.

అయితే యిప్పుడు నేనేం చెయ్యాలి. ఎలా ప్రవర్తిస్తే రామకార్యం సక్రమంగా కొనసాగుతుంది.

ఒకే దారి ఉన్నది. సీతాదేవికి పరమ ప్రీతికరుడైన రామచంద్రుని గుణ గణకీర్తనంతో నేను సంభాషణ మొదలుపెడితే ఆవిడ నిస్సంకోచంగా నిర్భయంగా నా మాటలు వింటుంది. అలా ధర్మార్థహితంగా ఆరంభిస్తాను. అని ఆ కొమ్మలలోనే దాగి మధుర గళంతో ఆరంభించాడు.

*రక్షితా స్వ స్వ వృత్తస్య*
*స్వజనస్య చ రక్షితా*
*రక్షితా జీవలోకస్య*
*ధర్మస్య చ పరంతపః*

దశరథుడనే అయోధ్యా ప్రభువు చతురంగబల సమన్వితుడు. సదాచార నిర్వహణతో ఘనయశస్సు పొందిన వా డాయన.

ఆయన రాజర్షిశ్రేష్ఠుడు.

ఇంద్ర సమ పరాక్రమ సంపన్నుడు. ఉత్తమ గుణాలతో, భూత దయాపరుడై ఇక్ష్వాకువంశ శ్రేష్ఠుడై, శ్రీమంతుడై, సర్వభోగాలు సర్వజనానికీ సమకూరుస్తూ, తాను సుఖంగా ఉంటూ భూగోళంలో ప్రఖ్యాతి పొందాడు.

ఆయన కుమారులలో జ్యేష్ఠుడు రాముడు. రాముడు సర్వ విషయవేత్త; చంద్రునివలె చల్లనివాడు. ధనుర్ధారులలో అంతటివాడులేడు.

ముందు తన నడవడి సక్రమంగా ధర్మబద్ధంగా సాగించి, సర్వ ప్రాణికోటినీ, తనవారినీ రక్షిస్తూ, ధర్మ రక్షణ తత్పరుడై జీవితం సాగిస్తున్నాడు.

అయన శత్రువులపాలిట యముడు.

సత్యవాక్పాలన నియమం కారణంగా, తన వృద్ధజనకుని మాట ప్రకారం భార్య సీతతో, తమ్ముడు లక్ష్మణునితో అరణ్యానికి వచ్చాడు.

ఆ మహారణ్యంలో క్రూరమృగాలనూ, దుష్ట రాక్షసులనూ సంహరిస్తూ జనస్థానంలో ఖర దూషణుల నాయకత్వంలో ఉన్న సర్వరాక్షసులనూ నేల కూల్చాడు.

ఆ వార్త విని రావణుడు క్రోధంతో జానకీదేవిని అపహరించాడు, రాముని వంచించి, పర్ణశాలకు దూరంగా పంపి.

రాముడు సీతను వెదకుతూ వెదకుతూ, వానరరాజయిన సుగ్రీవునితో స్నేహంచేసి, మహాబలశాలి అయిన వాలిని సంహరించి వానర రాజ్యానికి సుగ్రీవుని ప్రభువుగా చేశాడు.

వానరేశ్వరుని ఆజ్ఞానుసారం కామరూప శక్తిగల వానర వీరులు సీతాదేవిని వెదకడానికి నాలుగు దిక్కులకూ బయలుదేరారు.

వారిలో ఒకడను నేను, జటాయు సోదరుడయిన సంపాతి మాటను బట్టి యిక్కడకు వచ్చాను, సముద్రం దాటి.

సీతాదేవిని గురించి రాముడు ఏ వర్ణన చేశాడో అంతా అలానే ఉన్న దేవిని యిక్కడ చూశాను, అని మౌనం వహించాడు.

సీతాదేవి ఆశ్చర్యంతో, భయంతో తల పైకెత్తి చెట్టు మీదికి చూసింది. సీతకు సంతోషం కలిగింది.

అటూ యిటూ చూడగా చూడగా వాయునందనుడయిన హనుమంతుడు ఉదయసూర్య సమంగా కనిపించాడు.

28, 29, 30, 31 సర్గలు.

శింశుపా వృక్షంపైన కొమ్మల నడుమ తెల్లని వస్త్రంతో, మెరుపు తీగలవంటి ఎర్రని కాంతితో వెలిగే వానరుని చూచింది సీతాదేవి.

చూచీ చూడడంతో ఆవిడ గుండె దడదడ లాడింది. అంతలో ఆశ్చర్యం కలిగింది. వానరు డేమిటీ? ఇంత శరీరమేమిటి? అనిపించింది.

మరింత భయంతో విలపించింది. హా రామా! లక్ష్మణా! అంటూ కన్నీరు విడిచింది.

ఆ వానరుని మళ్ళీ చూడగా వినయువంతునివలె గోచరించాడు. ఇంతకూ ఇది స్వప్నమా? నేను మేలుకుని ఉన్నానా? మళ్ళీ చూసింది. బాగా వంకర తిరిగిన మూతితో కనిపించాడు. మళ్ళీ భయం కలిగింది. కన్నులు మూసుకుంది.

అంతా కల అనిపించింది.

కలలో కోతిని చూడడం కీడుకి సూచన, అనిపించగానే రామ లక్ష్మణులకు శుభమగుగాక, నా తండ్రి జనకునికి శ్రేయస్సు కలుగుగాక, అనుకున్నాక యిది కల కాదనిపించింది.

నిరంతర శోకంతో వున్న నాకు నిద్ర కూడా పడుతుందా! పూర్ణచంద్ర వదను డయిన రాముడు దగ్గరలేని నాకు సుఖం లేదే! సుఖంలేనిదే నిద్ర ఎలా పడుతుంది? నా మనస్సు ఆయనను గురించే ఆలోచిస్తున్నది.

ఆయననే ధ్యానించే నాకు ఆ రూపాలే కనిపిస్తాయి. ఆ విషయాలే వినిపిస్తాయి. బహుశః ఆ కోరిక నెరవేరి ఉండాలి. అయినా విశ్వాసం కలగడం లేదు. అయితే యిది మనస్సుకి కనిపించిందా?

కాదు-

స్పష్టంగా కంటికి కనిపిస్తున్నాడు, వానరుడు.

శబ్దం వినిపిస్తున్నది, అని చేతులు జోడించి:

సర్వేశ్వరుడయిన ఇంద్రునికీ, దేవగురువు బృహస్పతికీ, ప్రజాపతి బ్రహ్మకూ, అగ్నిహోత్రునికీ నమస్కరిస్తున్నాను.

నేను చూసినదీ, విన్నదీ నిజమే కావాలి, అనుకుంటూండగా హనుమంతుడు చెట్టు దిగి, వినయ వినమితుడై ఆమె ఎదుట నిలబడ్డాడు.

చేతులు జోడించి శిరసున పెట్టుకున్నాడు.

అమ్మా! ఉత్తమురాలవయిన నీవు నలిగిన పట్టుచీరతో ఈ చెట్టు మొదట నిలబడి ఎందుకు దుఃఖిస్తున్నావు? దేవ, దానవ, నాగ, గంధర్వ, యక్ష, కిన్నర గణాలలో ఏ జాతికి చెందినదానవు? వసు, రుద్ర, మరుత్తులలో

ఎవరి బిడ్డవు? నాకు దేవతామూర్తిలా కన్పిస్తున్నావు. చంద్రునికి దూరమై ఆకాశాన్ని వీడివచ్చిన రోహిణీతారవా?

మాంగళ్యరూపిణీ! వశిష్ఠులవారిమీద కోపంతోనో, మరే అనుమానంతోనో ఆయనను విడిచి వచ్చిన అరుంధతీదేవివి కావు గదా! నీ సోదరుడుకాని, తండ్రికాని, పుత్రుడుకాని, పరలోకగతులైతే వారికోసం శోకిస్తున్నావా?

నీ కన్నీరు, నిట్టూర్పులు!

వీటికితోడు నీ పాదాలు భూమిని తాకుతున్నాయి - వీటిని బట్టి నువ్వు దేవకాంతవు కావనుకుంటున్నాను. నీలో రాచరికపు ఛాయలున్నాయి.

ఆలోచించగా నువ్వు ఏ మహారాజు భార్యవో అయి వుంటావనిపిస్తున్నది. రావణుడు జనస్థానం నుంచి అపహరించి తెచ్చిన జానకీ దేవివి అయి వుండాలి. తపస్విజనోచితవేషంతో సౌందర్యరాశిలా వున్న నువ్వు రాముని భార్యవే అనుకుంటాను.

ఆ మాటలు వింటున్న సీతాదేవి రామనామ శ్రవణంతో :

ఆత్మవేత్త, శత్రుసంహార సమర్థుడు, రాజసింహుడు అయిన దశరథులవారి కోడలిని.

మహాత్ముడు, విదేహాధీశుడు అయిన జనక మహారాజు అనుంగుపుత్రిని.

నన్ను 'సీత' అని పిలుస్తారు. ధీమంతుడైన రాముని భార్యను నేను. అయోధ్యలో ఆయనతో పన్నెండు సంవత్సరాలు సర్వరాజభోగాలూ అనుభవించాను.

ఆ తరువాయి మా మామగారు మావారి పట్టాభిషేకం నిశ్చయించారు. గురువులు ముహూర్తం పెట్టారు. అదే రోజున ఆ వార్త విన్న కైకేయి;

రామపట్టాభిషేకం జరిగితే-

నేను పచ్చి మంచినీళ్ళు త్రాగను.

గుప్పెడు మెతుకులు కతకను,

నా బ్రతుకంతా యింతే; అంది.

**న పిబేయం న ఖాదేయం**
**ప్రత్యహం మమ భోజనం**
**ఏష మే జీవితస్యాంతో**
**రామో యద్యభిషిచ్యతే**

ఇంతకాలంగా నా మీద చూపిన ప్రేమ నిజమే అయితే రాముడు అరణ్యానికి పోవాలి, అంది.

ఆ మాటలు వింటూ దశరథులవారు మూర్ఛపోయారు. సత్య ధర్మపరుడు కనుక, ఆవిడ వరం ప్రకారం జరిపించాడు. రామచంద్రుడు రాజ్యంకంటె తండ్రి మాటనే అధికంగా భావించాడు.

సత్యపరాక్రముడైన రామచంద్రుడు తమ ప్రాణాలయినా వదులు తాడు కాని ఎదుటివారికి కష్టం కలిగే మాటకూడా మాట్లాడడు.

అందువల్లనే మనసా రాజ్యాన్ని విడిచి, ఉత్తరీయాన్ని చేతులతో వదిలి తల్లి దగ్గరకు, వచ్చి నన్ను ఆవిడకు అప్పగించబోయాడు.

ఆయన లేని దేవలోకం కూడా నాకు అవసరంలేదు. అందుచేత ఆయనకంటె ముందే నేను అడవిదారి పట్టాను. మాకంటె ముందుగా మా లక్ష్మణుడు నారచీరలు ధరించి వచ్చాడు.

అలా మేము ముగ్గురం మా మహారాజు మాట ప్రకారం ఘోరాటవులకు వచ్చాం.

అక్కడ దండకారణ్యంలో వుండగా దుష్టరావణుడు నన్ను అపహరించి యిక్కడకు తెచ్చాడు. వాడిచ్చిన గడువు యింక రెండు మాసాలుంది. అది గడిస్తే ప్రాణత్యాగం తప్పదు, అని జానకి చెపుతూంటే:

దేవీ! నేను రామదూతను. ఆయన కుశలంగా వున్నాడు. నీ క్షేమ సమాచారం తెలుసుకు రమ్మని నన్ను పంపాడు, అని హనువంతుడు ఆరంభించాడు.

అమ్మా! వేద వేదాంగవేత్త, బ్రహ్మాస్త్ర కోవిదుడు అయిన దశరథ నందనుడు నీ క్షేమం కోరుతున్నాడు. మహా తేజశ్శాలి అయిన మీ లక్ష్మణుడు శోక దీన వదనంతో మీకు నమస్కరిస్తున్నాడు, అనగా విని సీత, సంతోష పులకితగ్రాతంతో:

మానవుడు బ్రతికివుంటే నూరేళ్ళకయినా సుఖసంతోషాలు పొందుతాడనే పెద్దల మాట నిజమేనని నాకు నమ్మకం కలిగింది, అంది.

అనంతరం వారుభయులూ ఒకరికొకరు ఆశ్వాసన చెప్పుకున్నారు. హనుమంతుడు నెమ్మదిగా సీతదగ్గరకు అడుగులు వేస్తున్నాడు. అదిచూచే సీతకు ఈ వ్యక్తి రావణుడేమో అనే శంక బయలుదేరి:

ఛీ! ఛీ! ఎంత పొరపాటు చేశాను! నా విషయం అంతా చెప్పడంవల్ల

వీడికి సర్వం తెలిసిపోయింది. నిజంగా వీడు కామరూపంతో వచ్చిన రావణుడే, అనుకుంటూ నేలమీద కూలబడింది.

అది చూసి హనుమంతుడు చేతులు జోడించాడు. సీత యిటు చూడడంలేదు. వేడి నిట్టూర్పు విడిచి:

ఓ మాయావీ! ఎందుకిలా నన్ను బాధించి వేదిస్తావు. అనాడు జనస్థానానికి మాయసన్యాసిలా వచ్చావు. ఇక్కడ నేను ఉపవాసాలతో కృశించి శోకంతో ఉంటే యింకా సంతాపం కలిగిస్తున్నావు. అని క్షణం ఆగి.

నిన్ను చూస్తూంటే నా మనస్సుకి సంతోషం కలుగుతున్నది. అంటే నువ్వు రావణుడవు కాదేమో అనుకుంటున్నాను.

నిజంగా నువ్వు రామదూతవే అయితే నిన్ను ఆశీర్వదిస్తున్నాను. నాకు రామగుణగానంకంటె ప్రీతి కలిగించేది లేదు. అందుచేత ఆయన విషయాలు చెప్పు, అని లోలోపల తన భర్త పంపిన ఈదూత నా హృదయానికి అహ్లాదం కలిగిస్తున్నాడు. కలలో అయినా రామ లక్ష్మణులను చూచే అదృష్టం నాకు లేదు. అసలు నాకు స్వప్నం వచ్చే అవకాశం లేదే, ఇది కలే అయి, కలలో నేను కోతిని చూచి ఉంటే కీడు జరగాలి గాని మనస్సుకి సంతోషం కలగకూడదు కదా!

కాక–

భ్రాంతిలో పడ్డానా! వాత ఉన్మాద ప్రకోపమా! ఏదీకాక యిదంతా మృగతృష్ణయా.

కాదు. ఇది పిచ్చికాదు. నా మనస్సు నా వశంలో ఉంది. ఎదుటివాడు వానరుడని గ్రహిస్తున్నది, అయితే వీడు కామరూపం ధరించిన రావణుడేనా, అని వెనుదిరిగింది.

ఆవిడ తలత్రిప్పి, తనను చూడకుండా ఉండడంతో హనుమంతుడు ఆవిడ శంకను గ్రహించి:

అమ్మా!

రామచంద్రుడు సూర్యసమతేజస్వి. చంద్రసదృశ శీతల హృదయుడు. సర్వలోక ప్రభువయిన కుబేరునివలె భూమండలాధిపతి. విష్ణుసన్నిభ పరాక్రముడు, దేవగురువయిన బృహస్పతివలె మధురభాషి, సత్యవాది. సౌందర్య శోభితుడు. మన్మథాకారుడు, అనవసరంగా ఆగ్రహించడు. ఆగ్రహించాడో ప్రతీకారం తప్పదు.

ఆయన మహారథికుడు. ఆయన భుజబలచ్ఛాయలో ఈలోకం నిశ్చింతగా, విశ్రాంతి తీసుకుంటుంది.

ఆనాడు మాయలేడిని పంపి, రామచంద్రుని సుదూరానికి పంపి, ఏకాంతంలో ఉన్న నిన్ను అపహరించిన రాక్షసుడికి జరిగే ప్రాయశ్చిత్తం నువ్వు చూస్తావు.

యుద్ధభూమిలో రాముడు పరాక్రమాగ్నితో వదిలే బాణాలు రావణుని సర్వనాశనం చేసి తీరతాయి. అటువంటి రాముడు విరహాతురుడై పంపగా వచ్చిన దూతనమ్మా!.

సుమిత్రానందవర్ధనుడు లక్ష్మణస్వామి నీ క్షేమాన్నే కాంక్షిస్తున్నాడమ్మా. రామచంద్రుని ప్రియమిత్రుడైన మా వానర ప్రభువు సుగ్రీవుడు నీ కుశలవార్త వినాలని ఉన్నాడు. అమ్మా! వారు నిత్యం నిన్నే స్మరిస్తున్నారు.

ఈ క్రూరరాక్షసీజన మధ్యంలో పడి కూడా నువ్వు జీవించి వుండడం మా అదృష్టం.

అత్యల్పకాలంలోనే రామలక్ష్మణులు శతసహస్రసంఖ్యాకమయిన వానరసేనా పరివృతుడైన సుగ్రీవునితో కలిసి యిక్కడకు వస్తారు.

నేను ఆ వానరేశ్వరుని మంత్రిని. హనుమంతుడంటారు నన్ను. దుష్టుడయిన రావణుని తలదన్ని, నిన్ను దర్శించడానికి సముద్రందాటి వచ్చానమ్మా!

నన్ను విశ్వసించు. నువ్వు శంకించే రాక్షసుణ్ణి కాను, తల్లీ, అన్నాడు.

## విశ్వాసం

ఆ మాటలు విన్న సీత మనస్సు తృప్తిపడింది. హనుమంతుని వైపు తిరిగి:

అయితే నర వానరులకు సఖ్యం ఎలా కలిగింది? నువ్వు రాముణ్ణి ఎక్కడ చూశావు? లక్ష్మణుని గురించి నీకేం తెలుసు? వారి ఆకార స్వభావాలేమిటి? ఆయన అవయవ నిర్మాణం అంతా కళ్ళకు కట్టేలా చెప్పు, అని ప్రశ్నించింది.

హనుమ : అమ్మా!

రామ లక్ష్మణుల ఆకార విశేషాలు వివరిస్తాను. రామభద్రుడు పద్మదళ విశాలనయనాలతో సర్వలోక మనోహరంగా ఉంటాడు. దయా హృదయుడు. సూర్యసమతేజస్వి. పృథ్వికున్నంత ఓరిమి ఉంది. ధీశక్తిలో బృహస్పతి. కీర్తికి ఇంద్రుడు.

సర్వభూతరక్షణతో తన పరిజనరక్షణ కూడా చూసుకునే వాడు. ముందు తన జీవనధర్మాన్ని నిర్వహిస్తూ లోకధర్మ రక్షణ చేస్తాడు లోక మర్యాద వీడకుండా సర్వవర్ణాలనూ ధర్మపదాన నిలబెడతాడు. బ్రహ్మచర్య నియమంతో, సజ్జనులకు సాయపడుతూ, ఇహ పరాలను చూసుకుంటూ ఉంటాడు

రాజనీతి నిపుణుడు, విద్వాంసులను నిరంతరం ఆరాధిస్తాడు. వినయ, విద్యాసంపన్నుడు. శత్రుసంతాపకుడు. యజుర్వేదం అధ్యయనం చేసినవాడు. ధనుర్వేదం కరతలామలకం. వేదవేత్తల పూజలు పొందేవాడు.

ఇక ఆయన అవయవాల విశేషాలు–

విపులాంసుడు, దీర్ఘబాహుడు, శంఖకంఠుడు, అరుణారుణ నయనుడు. ఆయన కంఠం దుందుభిస్వనంలా ఉంటుంది. శరీరం అంతా తీర్చిదిద్ది హెచ్చుతగ్గులు లేకుండా ఉంటుంది. ఉరఃస్థలం, మణికట్టు, పిడికిలి చాలా దృఢంగా ఉంటాయి. ఆయన నడక, నాభి, మాట బహుగంభీరాలు. సింహ, శార్దూల, గజ, వృషభ గమనుడు.

దేశ కాల పాత్రాలు గ్రహించి సంగ్రహానుగ్రహాలు చేయగలవాడు. సర్వజన ప్రియంగా మాట్లాడగలవాడు.

ఆయన తమ్ముడు సర్వవిధాలా ఆయననే పోలి ఉంటాడు.

వారుభయులూ నిన్ను వెదకుతూ వెదకుతూ మా కిష్కింధలో సుగ్రీవుని చేరారు.

అన్నగారి భయంతో మా రాజు ఋశ్యమూకంపై ప్రవాసంలో ఉన్నాడు. మేమంతా సుగ్రీవ సేవలో ఉన్నాం.

అక్కడకు–

నార చీరలతో, ధనుర్బాణధరులై వచ్చిన వారిని చూసి మా ప్రభువు పరుగు ప్రారంభించాడు. కొంతసేపయాక నన్ను పిలిచి వారెవరో తెలుసుకురమ్మన్నాడు. వారితో విషయాలన్నీ వివరించి, వెంటబెట్టుకుని సుగ్రీవుని దగ్గరకు తీసుకువచ్చాను.

ఉభయులూ మాట్లాడుకున్నారు. లక్ష్మణస్వామి మీ కథ చెప్పాడు. అది వింటున్నవేళ మా సుగ్రీవుడు విషాదభర హృదయుడయాడు.

అనంతరం–

నిన్ను రావణుడు అపహరించుకు వెడుతుండగా నువ్వు విడిచిన నగల మూటను రాముని ముందుంచగా ఆయన వాటిని ఒడిలో ఉంచుకుని విలపించాడు. నీకోసం, కొంతసేపటికి ఆయనను ఆశ్వాసించగలిగాము.

అమ్మా!

విరహాగ్నితో ఆయన దేహం తపిస్తున్నది. భూకంపవేళ పర్వతంలా ఆయన హృదయం విచలితమవుతున్నది.

అత్యంత సుందరమయిన ఉద్యానవనాలు, మహానదీ ప్రవాహాలు, సెలయేరులు ఏవి కనిపించినా ఆయన మనస్సు నీ కోసమే పరితపిస్తున్నది.

అమ్మా! ఆ రాజశార్దూలుడు నిస్సంశయంగా ఈ రాక్షస రావణుని సర్వనాశనం చేసి నిన్ను స్వీకరిస్తాడు. అందుకు సుగ్రీవుడు కూడా ప్రతిన పూని ఉన్నాడు. చెప్పాను కదా, వాలిని హతమార్చాడు రాముడని.

అనంతరం వానరులందరూ అన్ని దిశలకూ నిన్ను అన్వేషించడానికి బయలుదేరారు. అందులో నేను లంకకు వచ్చి యిక్కడ నిన్ను చూడగలిగాను.

మా బలాధిపతి వాలిసుతుడు అంగదుడు. ఆయన నాయకత్వంలో మేము వింధ్య పర్వతంమీద ఎన్ని రోజులు గడిపామో, అప్పటికే సుగ్రీవుడు పెట్టిన గడువు దాటిపోయింది. తిరిగి వెడితే ఆయన మా ప్రాణాలు తీసి వేయడం తథ్యం, అని మేము ప్రాణత్యాగం చేయడానికి కొండ శిఖరం చేరాము.

అంగదుడు తీవ్రంగా రోదిస్తున్నాడు. అప్పుడక్కడకు భయం కరమయిన పెద్ద పక్షి వచ్చింది. జటాయువుకు సోదరుడయిన సంపాతి ఆ పక్షి. మా మాటలలో జటాయువు మరణవార్త విని:

'ఎవడురా నా సోదరుని చంపినవాడు.'

అని గర్జించాడు. అప్పుడు మేము రావణుని చేతులలో జటాయువు మరణించిన వార్త వినిపించగా, ఆ పక్షి యింతసేపు విచారించి, నీ వర్తమానం చెప్పాడు.

అప్పుడు మాకు ధైర్యం కలిగింది.

ఉత్సాహంతో సముద్ర తీరానికి బయలుదేరాం. విశాల సాగరాన్ని దాటడం సాధ్యమా అని మా వారందరూ శోకసాగరంలో మునిగారు. వారికి ధైర్యం చెప్పి నేను బయలుదేరాను.

రాత్రి అంతా లంకానగరం మూల మూలలా వెదికాను. రావణుని చూచాను. నిన్ను చూడగలిగాను. ఇది యింతవరకూ జరిగిన కథ. ఇప్పుడు నన్ను విశ్వసించగలవా తల్లీ!

ధనుర్వేద విదుడయిన రాముడు, ఆయన సేవకే జీవితాన్ని అంకితం చేసిన లక్ష్మణుడు కుశలంగా వున్నారు. వారి దూతగా నేనిక్కడకు వచ్చాను.

ఇప్పుడు నేను వెళ్ళి మా వానర వీరులకు నీ దర్శనభాగ్య విషయం చెపుతాను. అంతకంటె నాకు కీర్తికరం మరొకటి లేదు.

నా కథ కూడా చెపుతాను విను-

పర్వతాలలో శ్రేష్ఠమయిన మాల్యవంతం మీద మా తండ్రి కేసరి ఉండేవాడు. ఆయన దేవర్షుల ఆజ్ఞానుసారం సముద్రతీరాన గోకర్ణం వద్ద శంబసాదనుడనే రాక్షసుని కడతేర్చిన మహావీరుడు. ఆ కేసరి భార్యకు నేను వాయువువలన కలిగాను నన్ను హనుమంతుడంటారు ఇది నా విషయం.

ఇప్పటికి నీకు విశ్వాసం కలగాలి, అని చెపుతూంటే సీతాదేవికి ఆనంద బాష్పాలతో హృదయం సంతోష తరంగితం అయింది.

## అంగుళీయకం

అమ్మా! ఇప్పుడు నువ్వు ఏం చెయ్యమంటే అది చేస్తాను. వాయువు ఎంతశక్తిమంతుడో నేను కూడా అంతశక్తిశాలిని, అని వినయంగా:

ఇదిగో రామముద్రిక. ఈ అంగుళీయకం చూచి నన్ను పూర్తిగా విశ్వసించు. విచారాన్ని విడిచి సంతోషంగా ఉండు, అని ఉంగరం అందించాడు.

అ ఉంగరాన్ని చూచే సీతాదేవి వదనం రాహువునోటి నుండి వెలువడిన చంద్రబింబంలా ఉంది. ఎదురుగా రామచంద్రుడే వచ్చి నిలబడి నట్లనిపించింది. తన కంత సంతోషం కలిగించిన వాయునందనుని కొనియాడుతూ.

నువ్వు తప్ప ఈ పని చెయ్యగలవారు లేరయ్యా. ఈ రాక్షస రాజధానిలో అడుగు పెట్టడం ఎవరితరం! నూరు యోజనాల విస్తీర్ణమయిన మహాసాగరాన్ని గోపాదంలా దాటి రాగలిగిన నీ సాహ న పరాక్రమాలు మరెవరికుంటాయి. ఆత్మవేత్తయైన రామభద్రుడు పంపిన నీతో మాట్లాడడం నాకెంతో సంతోషంగా ఉంది.

ఆయన నా దగ్గరకు సామాన్యులను పంపడు. ఎంతో పరిశీలించి, పరీక్షించి పంపుతాడు. ధర్మ, సత్యపరుడయిన రాముడు, ఆయన సోదరుడు లక్ష్మణుడు క్షేమంగా ఉన్నారని విన్న నా గుండె తేలికపడింది.

నాకొక సందేహం కలుగుతున్నది. ఆయన కుశలంగా ఉంటే ఈ పాటికి ఈ లంకా నగరాన్ని భస్మంచేసి తీరాలి. దేవ గణాలను సైతం నిగ్రహి ంచగలిగిన వారుభయులూ మౌనంగా ఉన్నారంటే నా దురదృష్టమే కావాలి.

ఇంతకూ, బాధతో ఆయన నిశ్చలంగా కూర్చుని ఉండడం లేదు కదా! ఉత్తమ క్షత్రియ ధర్మాన్ని నిర్వహిస్తున్నాడా! ఆయన సామ, దాన, భేద, దండాలను సకాలంలో అనుసరిస్తున్నాడా!

ఆయనకు యోగ్యమిత్రులు చేకూరుతున్నారా! వారు ఆయన శ్రేయస్సు కోరి పని చేస్తున్నారా! గౌరవభావంతో చూస్తున్నారా. అదృష్టాన్ని గ్రహించి పురుషకారంతో దేవతానుగ్రహం కోసం యత్నం జరుపుతున్నాడా!

నా వియోగ బాధతో కృశించడం లేదు కదా! నన్ను ఈ రాక్షస పీడనుండి విముక్తంచేసే కృషిలో ఉన్నాడా! అయోధ్యలో వున్న మా అత్త కౌసల్య, ఆవిడతోపాటు సుమిత్ర ఆదిగాగల వారి క్షేమ సమాచారాలు అందుతున్నాయా!

సోదర ప్రేమగల భరతుడు నన్ను రక్షించడానికి చతురంగ బలాలు పంపుతాడా! వానరేశ్వరుడు సుగ్రీవుడు తన సర్వసేనా బలంతో నన్ను రక్షించడానికి రానున్నాడా! అస్త్రవిదుడయిన మా లక్ష్మణుడు రాక్షస సంహారానికి ఉత్సాహంతో ఉన్నాడా! రామభద్రుడు త్వరలో యిక్కడకు వచ్చి ఈ క్రూర రావణుని సంహరిస్తాడా!

నా వియోగంవల్ల ఆయన వేసవిలో నీరింకిన చెరువులో కమలంలా శుష్కించడం లేదు కదా!

ధర్మనిష్ఠతో రాజ్యసర్వస్వం వదలి ఆనందంగా అరణ్యానికి వచ్చిన ఆ మహాత్ముడు భార్యావియోగంతో శోకించడం లేదు కదా!

ఆయనకూ నాకూ వున్న స్నేహం తల్లిదండ్రులతో కూడా ఉండదు. ఆయన కుశలవార్త వినడానికే నేను జీవించి ఉన్నాను సుమా, అని ఆగింది.

అప్పుడు హనుమంతుడు.

అమ్మా! ఇంతవరకూ ఆయనకు మీరెక్కడ వున్నదీ తెలియదు. తెలిసిన క్షణంలో ఆయన మా వానర, భల్లూక సేనలతో బయలుదేరి సముద్రాన్ని స్తంభింపజేసి, అడ్డువచ్చినవారిని కడతేర్చి ఈ లంకానగరాన్ని సర్వరాక్షస సమేతం నాశనం చేసి తీరతాడు.

నీ వియోగంవల్ల ఆయన సింహపు పంజాదెబ్బతిన్న ఏనుగు వలె బాధపడుతున్నాడు. ఇంక ఆ బాధ ఉండదు. త్వరలోనే రామచంద్రుని పూర్ణచంద్రవదనం నీకు దర్శనమిస్తుంది.

స్వర్గంలో ఇంద్రుని వలె ప్రస్రవణగిరిమీద ఉన్న రామభద్రుని నువ్వు చూడగలవు. ఆయన నీ వియోగంలో, మధపానం మాంసభక్షణ వదిలేశాడు. ఆ బాధలో శరీరంమీద ప్రాలి బాధించే మశక, మక్షికాల స్పర్శకూడా తెలియడంలేదు.

నిరంతరం నిన్నే ధ్యానిస్తున్నాడు.

నీ నామస్మరణమే ఆయన కెప్పుడూ.

అందమయిన పువ్వు, మధురమయిన ఫలం, మరేదయినా సరే మనస్సును హరించేది కనిపిస్తే చాలు 'హా ప్రియా సీతా' అని విలపిస్తాడు.

నిన్ను దగ్గరకు తెచ్చుకోవడానికే ఆయన కృషి చేస్తున్నాడు,

అని చెపుతూంటే సీతాదేవి వదనం శరత్కాల మేఘాలతో నిండిన ఆకాశంలో చంద్రబింబంలా కనిపించింది.

## అనుచితం

*భర్తృ భక్తిం పురస్కృత్య*
*రామా దన్యస్య వానర*
*న స్పృశామి శరీరం తు*
*పుంసో వానర పుంగవ॥*

వాయునందనా! రాముడు శోకసాగరమగ్నుడై ఇతర విషయాల గురించి ఆలోచన చెయ్యడం లేదని నువ్వు చెపుతూన్న మాటలు విషంచుక్క పడిన అమృతంలా ఉన్నాయి.

అఖండ సంపదలు వచ్చిపడినా, దారుణక్లేశాలు నెత్తిమీద వున్నా, కాలపాశం ఎప్పుడూ మన కంఠానికి తగిలించి లాగుతూనే ఉంటాడు యముడు. విధిని తప్పించుకోవడం ఎవరితరమూ కాదు. రామలక్ష్మణులూ నేనూ క్లేశాలలో మునిగి వున్నాము.

సాగరమధ్యంలో విరిగిపోయిన నావనుండి నీటిలో పడి యీదుతూ అలసిన వానిదశలో వున్న రాముడు ఎప్పటికి ఒడ్డు చేరుతాడో! రాక్షసులందరినీ, రావణునీ సంహరించి ఎప్పటికి నా దగ్గరకు రాగలడో! ఈ రెండు మాసాలలోపలే ఆయన రావాలి. అది దాటితే ఈ క్రూరుడు నన్ను విడువడు.

ఆ రాక్షసుని సోదరుడయిన విభీషణుడు నన్ను విడిచిపెట్టమని చెపుతూనే వున్నా, రావణుని చెవి కెక్కడంలేదనీ, వానిని మృత్యువు వెన్నంటి

తరుముతున్నదనీ విభీషణుని పెద్దకూతురు అనల వచ్చి చెప్పింది, ఆ పిల్లను స్వయంగా ఆమె తల్లి పంపిందట.

రావణుని అనుచరులలో వృద్ధుడు, ధర్మపరుడు, ధీశాలి, విద్వాంసుడు అయిన అవింధ్యుడనే ఆయన కూడా రామునివల్ల రాక్షస నాశనం తప్పదని హెచ్చరించినా వాడు వినడం లేదట.

మారుతీ!

అన్నింటికంటె నా అంతరాత్మ పరిశుద్ధంగా ఉంది. నా భర్త సర్వసద్గుణరాశి. ఉత్సాహం, పరాక్రమం, మృదుహృదయం, సాహసం, సామర్థ్యం అన్నీ వున్నవాడాయన.

అలనాడు-

జనస్థానంలో మా లక్ష్మణుని అవసరం లేకుండా ఆయన ఒంటరిగా నిలబడి పదునాలుగువేలమంది రాక్షసులను నేల కూల్చినవాడు. ఇంక ఆయనకు ఎదురు నిలిచేవాడెవడు?

ఇంద్రుని ప్రతాప ప్రభావం శచీదేవికే తెలిసినట్లు మా వారి శక్తి నేనే ఎరుగుదును, అందరికంటె ఎక్కువగా.

ఈ రాక్షస శత్రుజలాన్ని రాముడనే సూర్యుడు తన బాణ కిరణాలతో ఎండబెట్టగలడు, అన్నది జానకి.

అమ్మా! సందేహం లేదు. నేను వెళ్ళి నీ వార్త చెప్పగానే ఆయన వానర భల్లూక సేనలతో వస్తాడు.

అంతవరుకూ ఎందుకమ్మా! నా వీపు మీద కూర్చుంటే యిప్పుడే నిన్ను తీసుకువెళ్ళి ఆయన ముందుంచుతాను. నిన్నేకాదు; రావణసమేతం ఈ లంకానగరాన్ని కదలించి తీసుకుపోగలను. హోమ ద్రవ్యాలను అగ్ని హోత్రుడు యింద్రుని ముందుంచేటట్లు నిన్ను నేను రాముని కర్పిస్తాను.

రావణవధోద్యుక్తులయిన రామలక్ష్మణులను నువ్వు యిప్పుడే చూడవచ్చు. మరే ఆలోచనా లేకుండా రావమ్మా. చంద్రుని సరసన రోహిణి వలె రామునిప్రక్క నువ్వు అలరారుతావు. ఈ లంక అంతా కలిసి వచ్చినా నన్ను ఆపలేరు. ఇక్కడకు వచ్చినంత అనాయాసంగా నిన్ను అక్కడకు తీసుకువెళ్ళగలను.

**జానకి:** హనుమా! చాలా సంతోషంగా వుంది నీ మాటలు వింటుంటే. కాని అంత దూరం నన్నెలా తీసుకుపోగలవు?

నీ వానరత్వం అలా పలికించింది, లేకుంటే ఇంత అల్ప శరీరంతో వున్న నువ్వు!

అని సీతాదేవి పరిహసించగా హనుమంతుడు పరాభవ దుఃఖాన్ని అణచుకుని తన దేహాన్ని సువిశాలం చేసి, మేరుగిరిలా నిలిచాడు ఆయన కన్నులు అగ్నిగోళాలవలె వెలుగుతున్నాయి. గోళ్ళు వజ్రకాంతులతో వున్నాయి.

హనుమ: తల్లీ ఇప్పుడు చూశావా నా శక్తి! యీ లంకానగరాన్ని, వన, భవన, ప్రాకార, పర్వత సమేతం దీని రాజయిన రావణునితో కలిపి తీసుకుపోగలను. నన్ను గురించి అనుమానం అనవసరం. నిన్ను తీసుకువెళ్ళి రామ లక్ష్మణులను దుఃఖసాగరం నుండి ఉద్ధరించడమే నా కర్తవ్యం.

జానకి: నీ శక్తి సామర్ధ్య బల గమనాలు నాకు తెలుసునయ్యా! నువ్వు అగ్ని వంటి తేజస్సు కలవాడవనీ ఎరుగుదును. అంతటి శక్తిలేని వాడెవడయినా యీ అంతులేని సముద్రాన్ని దాటి రాగలడా?

నువ్వు నన్ను తీసుకుపోగలవు. కాని నీ గమనవేగ తీవ్రతను నేను సహించలేక స్పృహతప్పి సముద్రంలో పడితే జల జంతువులు నన్ను ఆహారంగా గ్రహిస్తాయి. అందుచేత నేను రాను.

అదీకాక, ఈ వార్త విని రావణుడు మహాకాయులయిన రాక్షసులను వదులుతాడు. వారు శూల, ముద్గరాది ఆయుధాలతో నిన్ను ఎదుర్కోవడం తప్పదు. నిరాయుధుడవై నువ్వు వారితో యుద్ధం ఎలా చేస్తావు, ఒకవేళ నువ్వు చేసినా ఆ సమయంలో నేను భయంతో జారిపోవచ్చు. ఆ రాక్షసులు నన్ను తీసుకుపోయినా తీసుకుపోతారు. లేదంటే నరికిపారేయగలరు, లేదా లంకలో బహురహస్య ప్రదేశంలో దాచగలరు.

మరొక మాట –

నీ శక్తితో నువ్వు సర్వరాక్షస సంహారం చెయ్యవచ్చు, కాని, అది ప్రభువయిన రామునికి కీర్తికరం కాదే! అందుచేత నువ్వు ఆయనను తీసుకు రావడమే శ్రేయస్కరం.

నీ మాటవిని బయలుదేరితే, నేను చెప్పిన ప్రమాదం జరిగితే రామలక్ష్మణులతోపాటు మీ వానర భల్లూక పతులు కూడా ప్రాణాలు వదులుతారు.

అన్నిటికంటె ముఖ్యమయిన విషయం-

భర్తృభక్తిపరాయణురాలయిన నేను పరపురుషుని స్పర్శను కూడా సహించను.

మరి రావణుడు తెచ్చాడు కదా అనవచ్చు, నువ్వు.

అప్పుడు నా భర్త దూరంలో వున్నాడు. నా మనస్సు నా వశంలో లేదు. ఆ సమయంలో నేను చేయగల్గింది లేదు.

ఇక-

ఈ దశకంఠుని బంధుసమేతం సంహరించి నన్ను స్వీకరించడం రామచంద్రునికి కీర్తికరం.

దేవ నాగ గంధర్వులను నిగ్రహించగల ఆయన ధనుష్పాణియై నిలబడితే-

జ్వలితాగ్ని సదృశంగా మా లక్ష్మణుడు తోడుంటే వారివైపు కన్నెత్తి చూడగలవా డుండడు. కనక - లక్ష్మణ సమేతం మీ వానర భల్లూక సేనానులందరూ రాముని వెంట యిక్కడకు రావాలి. అదే నాకు సంతోషం కలిగించే పని. మరేదీ నాకు రుచించదు అంది.

37వ సర్గవరకూ.

## కాకాసురుడు

జానకి మాటలు విన్న హనుమంతుడు:

అమ్మా! పరమసాధ్వీమణీ నీ మాటలు నీ పాతివ్రత్యానికి నిదర్శనంగా ఉన్నాయి. నూరు యోజనాల సముద్రం దాటే నా వీపు మీద కూర్చోవడం నీకు భయంగానే ఉంటుంది, నువ్వు స్త్రీవి కనక.

మహాత్ముడయిన రామచంద్రుని ధర్మపత్నిగా నువ్వాడిన మాట ఉన్నదే!

పరపురుషస్పర్శ సహించనని-

అది నువ్వు మాత్రమే అనగల మాట. మరొక స్త్రీ ఆ పలుకుపలక లేదు.

నీ స్థితి, నువ్వు పలికిన ప్రతి అక్షరం అన్నీ యథాతథం ఆయనకు వినిపిస్తాను.

రామచంద్రునికి సాధ్యమయినంత త్వరలో సంతోషం కలిగించాలనే నా తాపత్రయం; అందుకే నిన్ను తీసుకువెడతానన్నాను. పయిగా ఆ సముద్రందాటి ఈ లంకలో అడుగుపెట్టడం ఎంత క్లేశమో తెలిసి మాట్లాడాను.

రాముని మీద నాకున్న స్నేహగౌరవాలు నన్ను అలా మాట్లాడించాయి తప్ప మరొక భావన నాకు లేదు.

ఇప్పుడింక నువ్వు రావు కనక ఆయనకు అనవాలు ఏదయినా యిస్తావా అని అడిగాడు.

సీతాదేవి బాష్పావృతనయనాలతో నెమ్మదిగా పలుకుతున్నది:

ఆయనకు ఒక కథ చెపుతాను గుర్తుగా; అది చెప్పు:

అప్పుడు మేము చిత్రకూట పర్వతం దగ్గర ఆశ్రమం నిర్మించుకుని వున్నాము. మా ఆశ్రమ పరిసరాలలో ఎందరో సిద్ధులు తపోదీక్షలో ఉండే వారు. ఆ కొండకు తూర్పునా, ఉత్తరంలోనూ స్వాదుజలాలూ, ఫలభరిత వృక్షాలూ ఉండేవి.

దగ్గరలోనే మందాకినీ నది.

ఆ ఏటిఒడ్డున సువాసనలీనే లతా, తరువులతో వనాలు.

ఒకనాడు ఆ వనంలో విహరించి, తరంగశీకరాలలో తడిసి ఆయన ఒడిలో విశ్రాంతి తీసుకుంటున్నాను.

అప్పుడొక కాకి మాంసప్రీతితో నన్ను పొడువ రాగా, దాన్ని చిన్న బెడ్డలతో తరుముతున్నాను. ఎంత వారిస్తున్నా అది నన్ను పొడవడానికి వస్తూనే ఉంది. ఒకసారి అది వచ్చి నా మొలనూలు పట్టి లాగినప్పుడు నా చీరకొంగు జారింది.

అదిచూసి ఆయన చిరునవ్వు నవ్వగా నాకు కోపం వచ్చి దూరంగా వెళ్ళాను. అయినా ఆ కాకి తన పట్టు వీడక నన్ను హింసించగా నేను తిరిగివచ్చి ఆయన ఒడిలో వాలాను. ఆయన నన్ను ఓదార్చారు.

అలసటలో వున్న నేను నిద్రపోయాను. కొంతసేపటికి ఆయన కూడా నిద్రించారు. మరికొంతసేపటికి నేను నిద్రలేచాను.

ఆ కాకి మళ్ళీ వచ్చి నన్ను తన ముక్కుతో పొడిచింది. అప్పుడు నా శరీరం నుంచి రక్తం కారింది. నేను రాముని లేపాను. లేస్తూనే ఆయన నా స్థితి చూసి:

నిన్ను హింసించడానికి సాహసించిన వాడెవడు?

అయిదు పడగల పాముతో చెరలాటమాడే సాహసం ఎవడికి వచ్చింది.

అంటూ ఎరుపెక్కిన కన్నులతో ఎదురుగా వున్న కాకిని చూశాడు.

ఆ కాకి ఇంద్రుని తనయుడట!

రాముడు తాను కూర్చున్న ఆసనం నుండి ఒక దర్భపుల్ల తీసి అభిమంత్రించి విడిచాడు.

అది బ్రహ్మాస్త్రం!

ప్రళయాగ్నిలా అది కాకిని వెన్నాడింది.

భయంతో అది లోకాలన్నీ తిరిగింది. ఎవరూ దానికి అభయం ఇవ్వలేకపోయారు.

దేవతలు, ఋషులు కూడా శరణు ఇవ్వలేమన్నారు.

శరణాగతరక్షకుడయిన రాముడే దానికి అభయం ఇచ్చి,

ఓ వాయసమా! బ్రహ్మాస్త్రం వ్యర్థం కాకూడదు.

దానికి లక్ష్యం చూపించు, అనగా అది తన కుడికన్ను చూపింది. అలా దానికి చావు తప్పి కన్ను లొట్ట అయింది. అప్పుడది తన ప్రాణ రక్షణ చేసిన రామునీ, వారి తండ్రి దశరథులవారినీ అభినందించి వెళ్ళింది.

అలా కాకిమీద బ్రహ్మాస్త్రం విడిచిన ఆయన నా కోసం ఈనాడు ఈ రాక్షస రావణుని విషయమై ఏం చెయ్యకుండా ఎందుకూరుకున్నాడు?

అంతటి శక్తిశాలి అయిన నాథుడుండి కూడా నేను అనాథలా వున్నాను.

దయను మించిన ధర్మంలేదని ఆయనే అనేవారు. ఉత్సాహబల, పరాక్రమ సంపన్నుడు.

శత్రుసంహారసమర్థుడు.

సాగర గంభీరుడు.

ఇంద్ర సదృశుడు.

సముద్ర పరీవృత భూమండలాధీశుడు.

వివిధాస్త్రకోవిదుడు.

దేవ, దానవ, నాగ, గంధర్వజాతులను నిర్జింగల శూరుడు. ఇంతటివాడై ఎందుకీ ఉపేక్ష చేస్తున్నాడాయన.

లక్ష్మణుడయినా అన్నగారి ఆజ్ఞతో ఎందుకు ముందుకురాడు.

అగ్ని, వాయుదేవులతో సమానులయిన ఆ అన్నదమ్ములింత ఉదాసీనంగా ఉన్నారంటే నా పాపకర్మ ఫలాలింకా పరిసమాప్తం కాలేదేమో. అంతే! వారు రాకపోవడానికి అదే కారణం, అని దుఃఖిస్తున్నది సీత.

హనుమ : అమ్మా! నీ వియోగదుఃఖంతో ఆయన ఏ పనీ చెయ్యలేక దుఃఖంతో ఉంటున్నాడు. ఆయన శోకం చూడలేక లక్ష్మణుడు పరితాపం చెందుతున్నాడు.

ఈ క్షణం వరకూ నీ జాడ తెలియదాయనకు. ఇప్పుడు నేను నిన్ను చూశాను. ఇంక నీ దుఃఖం సమాప్తమయింది. ఆ రాకుమారు లిద్దరూ నీ వార్త వింటూనే వచ్చి లంకను భస్మంచేసి నిన్ను చేరగలరు. ఈ క్రూరరాక్షసుని బంధుసమేతం సంహరించి రాముడు నిన్ను తీసుకువెడతాడు.

నేను తిరిగి వెళ్ళి రామచంద్రునికి చెప్పవలసిన మాటలేమిటి? అలానే లక్ష్మణునికీ, సుగ్రీవునికీ ఏం వివరించాలి, అని అడిగాడు.

**జానకి :** హనుమా! లోకనాథుడుగా కౌసల్యాదేవికి ప్రభవించిన రామచంద్రునికి శిరసా నమస్కరించి ఆయన కుశలం అడుగుతున్నానని చెప్పు.

తల్లిదండ్రులయందు అమితమయిన గౌరవం చూపుతూ, వారిని ఆరాధించుకునే మా లక్ష్మణస్వామి సుఖంగా సర్వభోగాలతో అలరారే రాజధానిని విడిచి మాతో వనవాసక్లేశం అనుభవించడానికి వచ్చాడు. అటువంటి బిడ్డను కని సుమిత్రాదేవి ధన్యురాలయింది. ఆ మహావీరుడు మాకు రక్షకుడుగా వచ్చాడు. ఆ మహాబాహుడు, సింహస్కంధుడు, ప్రియవాది నన్ను తల్లిగా, అన్నగారిని తండ్రిగా భావించి సేవించుకున్నా డింతవరకూ.

ఆనాడు

రాక్షసు డపహరించిన నాడు మా లక్ష్మణుడు ఆశ్రమంలో లేడు. ఉంటే యింత జరిగేది కాదు, మా లక్ష్మణుడు సర్వకార్య నిర్వహణదక్షుడు. ఆయనకు తమ్మునిమీదనే ప్రేమ ఎక్కువ. ఆ తమ్ముని తోడు చూసుకుని రాముడు పితృ మరణబాధ మరచి పోగలిగాడు.

అటువంటి మరది క్షేమంగా ఉన్నాడని నమ్ముతున్నానని చెప్పు – ఇంక నా భర్తతో యీ మాట చెప్పు.

నే నింక ఒక నెలకంటె జీవించను. ఈ పాపి నుండి నన్ను యీ లోపునే రక్షించుకోవాలి, ఈ చూడామణి ఆయనకు ఆనవాలుగా యిచ్చానని చెప్పు, అంటూ కొంగుముడినున్న చూడామణి హనుమంతునికి అందించింది. ఆ ఆభరణాన్ని ఉంగరంలా వ్రేలికి తొడుగుదామనుకున్నాడు కాని అది కుదరలేదు. దానిని చేతబ[illegible] సీతాదేవికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి, వినయంగా నిలబ

అప్పుడే ఆ వాయునందనుని మనస్సు రామమయం అయింది. తిరుగు ప్రయాణానికి సన్నద్ధుడవుతున్నాడు.

జానకి . హనుమా! ఈ చూడామణి చూడగానే ఆయనకు వారి తల్లి కౌసల్య మా మామగారు దశరథులు, నేను, ముగ్గురం మనసులో కనిపిస్తాం, అంది.

హనుమంతుడు తలవంచి నమస్కరించాడు.

ఆవిడ దుఃఖంతో కన్నీరు విడుస్తూ:

హనుమా! నువ్వు వెళ్ళగానే రామ లక్ష్మణ సుగ్రీవుల క్షేమం అడిగానని చెప్పు. ఇంకా మీ వానర వృద్ధులందరి కుశలం అడుగుతున్నానని చెప్పు.

అనుదినం నువ్వు రామునికి ఉత్సాహం కలిగిస్తూ నన్ను ఉద్ధరించే ప్రయత్నంలో ఉండేటట్లు చెయ్యి. నా మాట వినగానే ఆయన కార్యరంగంలో ప్రవేశిస్తాడని ఎరుగుదును.

హనుమ : రాముడు సర్వవానర, భల్లూక సేనా సమేతం ఇక్కడకు హుటాహుటిని వస్తాడు. ఆయన నారి సారించి బాణవర్షం కురిపిస్తుంటే ఎదురు నిలిచే వారుండరు. ఇంద్ర, యమ, సూర్యులే ఆయన ముందు నిలబడలేరు. నీవల్ల ఆయన విజయం సాధించగలడు. మరి నేను వెడతాను, అన్నాడు.

జానకి : నాయనా! ఈ రోజుకి ఎక్కడయినా రహస్యంగా విశ్రాంతి తీసుకుని రేపు బయలుదేరవచ్చు కదా! మరికొంతసేపు నువ్వుంటే నాకు ఆశ్వాసన. ఇంతకూ మీరందరూ వచ్చేవరకూ నా ప్రాణాలు ఉంటాయో ఉండవో!

ఒకవేళ మీరు రాదలచినా వానర భల్లూక సేనలు ఈ మహాసాగరాన్ని ఎలా దాటగలవు?

వాయుదేవుడూ, గరుత్మంతుడూ, నువ్వూ తప్ప ఇంత సముద్రం దాటగల ప్రాణి మరొకటి ఉండదు,

అయినా రాముడు స్వయంగా వచ్చి లంకా నగరాన్ని జయించి నన్ను తీసుకువెడితేనే మాకు కీర్తి. ఆ మహాకార్యం ఎలా సాధ్యం, అని ప్రశ్నించింది.

హనుమ : అమ్మా! ఈ సందేహం నీ కనవసరం. మా ప్రభువు సుగ్రీవుడు ఈ విషయంపైై ఎప్పుడో నిశ్చయించాడు. మా వానర భల్లూక వీరులందరూ ఆయన ఆజ్ఞానుసారం నడుచుకుంటారు. వారికి భూమ్యాకాశాలలో అడ్డంకిలేదు. వారు మహాతేజస్వులు. నదీ నద పర్వత కానన సాగర పరివృత భూమండలం అంతా వారికి కొట్టిన పిండి. మా వారిలో నన్ను మించిన వారూ, నా అంతటివారే అందరూ. నా కన్న తక్కువవాడు లేడక్కడ. దూతగా మహా మహులను పంపరు కదా! నా వంటి సామాన్యులను తప్ప; అంటే ఆలోచించవచ్చు మా వారి బల శక్తులు.

మా వానర బలాధిపులు ఒక్క అంగలో సముద్రం దాటి రాగలరు. రామ లక్ష్మణులంటావా! ఇద్దరినీ చెరొక భుజంమీద ఎక్కించుకుని నేను వస్తాను. వారు తమ బాణపరంపరతో ఈ లంకనం తమించుతారు. రావణుని సంహరించి నిన్ను తీసుకువెడతారు. ప్రజ్వలిగాగ్ని వదనుడయిన రామభద్రుడు అచిరకాలంలో యిక్కడ నీ[illegible] కనిపిస్తాడు. నిశ్చింతగా వుండు. నీకు శుభం కలుగుతుంది. ఈ [illegible]క్షస వంశం నేలకూలిన నాడు నువ్వు రోహిణివై రామచంద్రుని [illegible]ంతావు. మలయ పర్వత గుహలలో చరించే సింహ, శార్దూల [illegible] పరాక్రమ సంపన్నులయిన వానర భల్లూక పతులందరూ నీ[illegible]ం ఈ రాక్షస సంహారానికి వస్తారు.

నువ్వు విచారించకు. [illegible]యువూ, అగ్నివలె రామ లక్ష్మణులు విజృంభించి నీ రక్షణభార[illegible] చూసుకుంటారు. నేను వెళ్ళి చెప్పిన క్షణంలో వారు వచ్చి తీరు[illegible]ారు, అని ఓదార్పు పలికాడు.

## సందేశం

హనుమా! నీ మాటలు నా హృదయానికి అశ్వాసనం కలిగిస్తూ, పెరుగుతూన్న పంట చేనుకి సకాలంలో పడిన వాన చినుకుల్లా ఉన్నై. శూరశ్రేష్ఠుడయిన రామునికి నా స్పర్శ ఎంత చల్లదనం కలిగిస్తుందో అలానే నీ మాటలు అలరించాలి. ఇంతకు ముందు నీకు కాకాసురుడి కథ చెప్పాను.

మరొక గుర్తుంది.

ఒకనాడు నా బొట్టు జారిపోగా ప్రక్కనున్న మణిశిల తీసుకుని అరగదీసి దానితో నా బుగ్గన చుక్క ఉంచాడాయన. అది మరచిపోలేదని చెప్పు.

ఇంద్ర, వరుణ సమ పరాక్రమోపేతుడవైన నువ్వు నీ భార్యను ఎవడో అపహరిస్తే, రాక్షసమధ్యంలో క్లేశాలు పడుతుంటే ఎలా సహించ గలుగుతున్నావు? అని అడిగినానని చెప్పు.

నా సర్వసంపదలకూ ఆధారభూతమూ, ప్రాణప్రదమూ అయిన ఈ చూడామణిని చూచినప్పుడు ఆయనను చూచినంత సంతోషం కలుగుతుంది. ఇది పంపుతున్నానని చెప్పు.

ఈ బాధలూ, రాక్షస స్త్రీల హృదయవిదారక పరుష భాషణాలూ, ఆయన కోసమే భరిస్తున్నాను.

నెలలోగా ఆయన రాకపోతే నేను బ్రతకనని గట్టిగా చెప్పు. ఈ రావణ రాక్షసుని క్రూరదృష్టి నేను భరించలేను, అని శోకదీన వదనయై ఆగింది జానకీదేవి.

అప్పుడు హనుమంతుడు:

అమ్మా! ఆయన నీ కంటె దుఃఖంలో ఉన్నాడు.

లక్ష్మణుడూ అదే దశలో వున్నాడు. నీ వార్త నేను చెప్పగానే వారుభయులూ హుటాహుటి వచ్చి తన పరాక్రమంతో లంకానగరాన్ని భస్మం చేస్తారు. రావణుని సంహరించి నిన్ను తీసుకువెడతారు. మరేదయినా ఆయనకు విశ్వాసం కలిగించే ఆనవాలు ఇస్తావా? అని అడిగాడు.

జానకి : ఈ చూడామణి నా శిరోభూషణం. అంతకంటె ఉత్తమ మయిన ఆనవాలు లేదు, అంది.

హనుమంతుడు ప్రయాణ సన్నద్ధుడై శరీరం పెంచుతున్నాడు.

అప్పుడు జానకి;

హనుమా! రామ లక్ష్మణ సుగ్రీవుల క్షేమం అడిగానని చెప్పడం మరువకు. వారందరినీ యిక్కడకు తీసుకురాగల శక్తి నీకే ఉన్నది. నాస్థితి చూశావు కదా! ఈ విషయాలన్నీ వివరంగా ఆయనకు చెప్పాలి సుమా! నీకు శుభమగు గాక అంది.

హనుమంతుడు సంతోషంతో 'వచ్చినపని అయింది' కాని మరికొంత మిగిలినట్లు ఉంది, అని ఆలోచిస్తూ ఉత్తరదిశగా సాగాడు.

ఇవి 38, 39, 40 సర్గలు.

## అశోకవన విధ్వంసం

ఆలోచిస్తున్నాడు హనుమంతుడు.

ఈ రాక్షసులు క్రూరప్రవృత్తి కారణంగా సామమార్గాన లొంగిరారు. ఇంత సిరిసంపదలతో వున్నవారిని దానంతో దారికి తీసుకురాలేము. బలగర్వంతో నిండిన వీరు భేదోపాయానికి చిక్కరు.

ఇక మిగిలింది దండనీతియే. అంటే పరాక్రమ ప్రదర్శన తప్పదు.

అందుచేత ఈ రాక్షసయోధులను కొందరిని సంహరిస్తే ఆ భయంతో వారు దిగి రావచ్చు.

కార్యసాధకుడైన దూత ముందు వెనుకల భంగంకాని దారిని ముందడుగు వేయాలి. చిన్న చిన్న పనులు చేసేవాడు కార్యసాధకుడు అనిపించుకోడు. దానికి అనుబంధించిన యితర కార్యాలు కూడా పూర్తిచెయ్యాలి.

ఈ లంకలో విషయాలన్నీ తెలుసుకు వెడితే అప్పుడు నేను నా కర్తవ్యాన్ని సమగ్రంగా నిర్వర్తించినట్టవుతుంది.

ఈ రాక్షసులతో విపరీత శ్రమ లేకుండా యుద్ధం సాగించి నా శక్తిని రావణుడికి చూపాలి.

రావణుని మంత్రి, సేనానుల బలాబలాలు, వాని సర్వశక్తులూ గ్రహించి వెళ్ళాలి.

దానికి ఒకటే దారి కనిపిస్తున్నది.

నందన వనంలా ఉన్న ఈ ఉద్యానవనాన్ని ధ్వంసం చేస్తాను. దానితో రావణుడికి ఆగ్రహం వస్తుంది. అశ్వ, గజ, రథ బలాలను పంపుతాడు. వారందరినీ నేలకూల్చి అప్పుడు తిరుగుముఖం పడతాను, అని నిశ్చయించుకుని ఆ వనంలోని మహావృక్షాలను ధ్వంసం చేయడం మొదలు పెట్టాడు.

చెరువుల గట్లు తెగగొట్టేశాడు.

ఆ కల్లోలానికి పక్షుల ఆర్తనాదాలు ఆరంభమయాయి. క్షణాల వ్యవధిలో ఆ వనంలోని లతలు, నికుంజాలు, చిత్రగృహాలు ముక్కలు ముక్కలయాయి.

రావణునికి నిత్య సంతోషం కలిగించే అశోకవనం శోకవనంగా తయారయింది. రావణునికి హృదయక్షోభ కలిగించి, తన్మూలంగా ఆయన పంపే యోధులతో యుద్ధానికి సన్నద్ధుడై వన బహిర్ద్వారంలో నిలబడ్డాడు.

ఇది 41వ సర్గ.

## సేనా నాశనం

మహావృక్షాలు నేలకూలే ధ్వనులూ, పక్షుల ఆర్తనాదాలూ వింటూ లంకానగర వాసులు భయభీతులై లేచారు. వారికెన్నో అపశకునాలు గోచరించాయి.

రాక్షస స్త్రీలు తమ చుట్టూ వనం ధ్వంసం కావడం చూశారు. ఎదురుగా పర్వతాకారంతో మహావానరం కనిపించింది. వారందరికీ విపరీతమయిన భయం కలిగింది.

కొంతసేపటికి తేరుకుని సీతాదేవిని సమీపించి:

ఈ వానరు డెవడు? ఎక్కడ నుంచి వచ్చాడు? ఎందుకోసం వచ్చాడు? వాడితో మాట్లాడావా? నిజం చెప్పు. వాడితో ఏం మాట్లాడావు? అని అడిగారు.

**జానకి :** వాడెవడో ఎందుకు వచ్చాడో నాకేం తెలుసు. మీ రాక్షస మాయలు మీకే తెలియాలి. పాముడక పాముకే తెలిసేది. ఆ రూపం నాకూ భయంగానే ఉంది. కామరూపంతో రాక్షసుడెవడో వచ్చినట్టున్నాడు.

ఆ మాటలు వింటూ భయంతో కొందరు కొయ్యబారిపోగా, మరి కొందరు పరుగులు తీయగా, కొందరు ఈ వార్త చెప్పడానికి రావణుని దగ్గరకుపోయి:

ప్రభూ! అశోకవనంలోకి ఒక భయంకరమయిన కోతి వచ్చి సీతతో ఏదో మాట్లాడింది. దానికి చాలా బలం ఉన్నట్లుంది.ఆ కోతిని గురించి ఎంత అడిగినా సీత సమాధానం యివ్వడంలేదు.

దేవేంద్రుడో, కుబేరుడో, కాక రాముడో పంపిన దూతకావచ్చు ననుకుంటున్నాం. ఆ మహావానరం అశోకవనాన్ని ధ్వంసం చేసింది. సీత ఉన్న ప్రాంతం తప్ప మిగిలిన వనప్రదేశమంతా నాశనం అయింది. చూస్తేవాడు జానకీ రక్షణార్ధమే ఆ ప్రాంతాన్ని విడిచి పెట్టాడనుకోవాలి.

ఆ వానరానికి తగిన శిక్ష వేసితీరాలి. నీకత్యంత ప్రీతి పాత్రురాలయిన సీతతో మాట్లాడిన వానికి మరణమే శరణ్యం, అని వారంటూంటే రావణుని వదనం అగ్నిగుండం అయింది. ఆ వేడికి రెండు కన్నీటి బిందువులు రాలాయి. అవి మండుతున్న దీపం నుండి జారే నేతిబొట్లలా వున్నాయి.

తక్షణం తనతో సమానబలంగల కింకరగణాన్ని పంపించాడు.

వారు ఇనుప బరిసెలు, ముద్గరాలు తీసుకుని బయలుదేరారు. కోరలపళ్ళు, మహోదరాలు. భయంకరంగా ఉన్నారు. అందరూ మిడతల దండులా హనుమంతుని చుట్టుముట్టారు. చేతులలోని ఆయుధాలతో

మీదికి వచ్చే ఆ కింకరగణాన్ని చూసి, సింహగర్జనచేసి, తన దీర్ఘవాలాన్ని వేలమీద తాడించాడు. ఒక్కసారి జబ్బచరిచాడు. ఆ ధ్వని కొండగుహలలో ప్రతి ధ్వనించింది. ఆ చప్పుడుకు భయపడి పక్షలు నేలరాలాయి. వారిని చూస్తూ గొంతెత్తి.

జయ త్యతిబలో రామో
లక్ష్మణశ్చ మహాబలః।
రాజా జయతి సుగ్రీవో
రాఘవే ణాభిపాలితః॥

దాసో ఽహం కోసలేంద్రస్య
రామ స్యాక్లిష్ట కర్మణః।
హనుమాన్ శత్రు సైన్యానాం
నిహంతా మారుతాత్మజః॥

న రావణ సహస్రం మే
యుద్ధే ప్రతిబలం భవేత్।
శిలాభిస్తు ప్రహరతః
పాదపైశ్చ సహస్రశః॥

అర్దయిత్వా పురీం లంకాం
అభివాద్య చ మైథిలీమ్।
సమృద్ధార్థో గమిష్యామి
మిషతాం సర్వ రాక్షసామ్॥

అతిబల మహాబలులయిన రామ లక్ష్మణులకూ, వారి రక్షణలో ఉన్న మా ప్రభువు సుగ్రీవునకూ స్వస్తి.

అనాయాసంగా అద్భుత కార్యాలు సాధించే కోసల ప్రభువుల దాసుడనైన నేను శత్రుసేనా సమూహాలను చీల్చి చెండాడతాను. నేను వాయునందనుడను, హనుమంతుడను.

మహా వృక్షాలతో గండశిలలతో యుద్ధం సాగించే నా ముందు వేలమంది రావణులాగరు.

ఈ లంకానగరాన్ని విధ్వంసం చేసి, జానకీ దేవికి అభివాదాలర్పించి, కార్యసాఫల్యంతో మీ అందరూ అలా చూస్తూండగా హాయిగా తిరిగి వెడతాను, అని నినాదం చేశాడు.

ఆ కంఠధ్వనికి రాక్షసయోధులు కంపించారు.

సంధ్యాకాల మేఘ సదృశంగా ఉన్నాడు హనుమంతుడు.

అయినా ప్రభువు ఆజ్ఞ వారిని ముందుకు దూకించింది.

ఒక్కసారి అందరూ చుట్టుముట్టడంతో, తాను కూర్చున్న ద్వార తోరణంలోని ఇనుప దూలం లాగి వారిని తాడించడం మొదలుపెట్టాడు.

గరుత్మంతుని గోళ్ళలో చిక్కిన మహాసర్పంలా ఆడుతోంది ఆ దూలం. దాని తాకిడికి రాక్షసులందరూ నేలకూలారు. హతశేషులు పరుగు పరుగున రావణునికి నివేదించారు.

కింకరగణం పరాభూతం అయిందని విన్న రావణుని కన్నులు గిరగిర తిరిగాయి. పరాజయం ఎరుగని జంబుమాలిని పంపించాడు. వీడు రావణ మంత్రి ప్రహస్తుని కుమారుడు.

ఇది 42వ సర్గ.

## జంబుమాలివధ

ఈలోగా హనుమంతుడు తన కార్యక్రమంలో వన విధ్వంసంతోపాటు చైత్య, ప్రాసాదాలు కూడా నేల కూల్చాలని నిశ్చయించుకుని మహాచైత్యం మీదకు దుమికాడు.

మహోన్నతమయిన ఆ భవనంమీద రెండవ సూర్యునివలె వెలుగుతూ దాని పునాదులు కదలించి నేలమట్టం చేశాడు. చేస్తూనే ఒక్కసారి భుజాస్ఫాలనం చేశాడు. ఆ ధ్వనికి అక్కడి కాపలాజనం మూర్ఛపోయారు. మరొక్కమారు సింహగర్జన చేసి:

అస్త్రవి జ్జయతాం రామో
లక్ష్మణశ్చ మహాబలః

రామ లక్ష్మణులకు జయం. రాఘవ పాలితుడయిన మా ప్రభువుకి స్వస్తి. నేను రామదూతను. శత్రుసంహార సమర్థుడను. వాయుపుత్రుడనైన నా ముందు రావణులు వేలమంది ఆగరు.

ఈ లంకను ధ్వంసం చేసి, సీతాదేవికి ప్రణామాలర్పించి మీరందరూ చూస్తూండగా నిశ్చింతగా తిరిగి వెడతాను, అని గర్జిస్తుంటే కొందరు చైత్యపాలకులు ఆయుధధారులై హనుమంతుని హింసించడానికి రాగా, వారి మధ్య మారుతి గంగానదిలో పెద్ద సుడిగుండంలా కనిపించాడు.

వారిని దగ్గరగా రానిచ్చి, చైత్యస్తంభం ఒకటి అందుకున్నాడు. **ఆ వేగతీవ్రతకు నిప్పుపుట్టి భవనం ధ్వంసం అయింది.**

వజ్రపాణి అయిన దేవేంద్రునివలె స్తంభహస్తుడైన హనుమంతుడు గగనవీధిని నిలిచి:

ఓ రాక్షసులారా! మహాబలిష్ఠులయిన మా వానర వీరులెందరో సుగ్రీవుని ఆజ్ఞానుసారం భూమండలం అంతా తిరుగుతున్నారు.

ఆ మహావీరులలో కొందరు దశమత్తేభాలతో సమమయిన బలం గల వారు. కొందరి బలం వంద ఏనుగులు, మరికొందరు సహస్ర గజబలులు. వాయుబలం, ప్రవాహవేగబలం కలవారెందరో ఉన్నారు.

వాడిగోళ్ళు, సుడి తిరిగిన దంతాలు..... అవే ఆయుధాలుగా కల కోట్ల వానర వీరులతో మా సుగ్రీవ చ।కవర్తి మిమ్ము సంహరించడానికి వస్తున్నాడు.

మహాత్ముడైన ఇక్ష్వాకు వంశీయుడు రామునితో వైరం తెచ్చుకున్న మీకు ప్రాణాలు మిగులవు, ఈ లంక వుండదు. మీ రాజు అసలే వుండడు, అని గర్జించాడు.

ఆ సమయానికి జంబుమాలి వచ్చాడు.

వాడు మహా బలిష్ఠుడు. యుద్ధయోగ్యంగా ఎర్రవస్త్రాలు ధరించాడు. వస్తూనే నారి సారించి వదిలాడు. ఆ ధనుష్టంకారం కర్ణభేద్యంగా వుంది. దిక్కులు దద్దరిల్లేలా వుంది.

ఖర వాహన బద్ధమయిన రథంమీద వచ్చే వానిని చూచి హనుమ ఉత్సాహంతో గర్జించాడు. వాడు వస్తూనే బాణాలు విడిచాడు.

ఆ బాణ ఘాతాలతో శరత్కాలంలో సూర్యకిరణాలు సోకి వికసించిన అరుణకమలంలా వుంది హనుమంతుని వదనం.

ఆ దెబ్బ తిన్న మారుతి తన ప్రక్కనున్న గండశిల పెల్లగించగా దానిని పది బాణాలతో పొడి పొడి చేశాడు జంబుమాలి.

హనుమంతుడు మహావృక్షాన్ని పెల్లగించాడు. దాన్ని కూడా ముక్కలు ముక్కలు చేసి హనుమంతుని మీద బాణాలు వదులుతూంటే చేతికందిన పరిఘాయుధం అందుకుని గిర్రున త్రిప్పి విసిరాడు. అంతే!

జంబుమాలి అవయవాలన్నీ సంధులూడి జారిపోయాయి. రథం, ఆయుధాలు ముక్కలయ్యాయని విన్న రావణుడు మరికొందరు మంత్రి పుత్రులను పంపించాడు.

## మంత్రి పుత్రులు

అగ్ని సమతేజస్వులయిన రాక్షస మంత్రి నందనులు ఏడుగురూ సేనాసమేతులై, ధనుర్బాణాలు చేబూని, రథారూఢులై బయలుదేరారు. పరమ సంతోషంతో ధనుష్టంకారం చేస్తూ వారు వస్తున్నారు.

అంతకు ముందే కింకరగణం నిహతమయిందని విని వున్న నారీజనం వీరిని చూచి దుఃఖించింది.

ఆ కుమారులు నేరుగా వచ్చి ద్వార తోరణం మీద వున్న హనుమంతుని సమీపిస్తున్నారు. బాణవర్షంతో రాక్షసనందన మేఘాలు చుట్టుముట్టగా మబ్బు క్రమ్మిన మహాపర్వతం అయాడు మారుతి.

క్షణాల వ్యవధిలో నిర్మలాకాశంలో ప్రవేశించి వారి రథగమనాన్ని నిరోధించి, ఇంద్రధనుస్సుతో అలరారే మబ్బుల గుంపుతో క్రీడించే వాయువువలె కనిపించాడు.

ఆడుతూ ఆడుతూ కొందరిని పాదాలతో, కొందరిని అరికాళ్ళతో తన్ని నేలకూల్చి, మరికొందరిని పిడికిలి పోట్లతో, వాడిగోళ్ళతో హతమారుస్తూ, రొమ్ముతో తాడించి మరికొందరిని మట్టి కరిపించాడు.

నేల కూలినవారు కూలగా మిగిలిన సైనికులు భయభ్రాంతులై దిక్కులు పట్టిపోయారు.

హనుమంతుని ధాటికి తాళలేక ఏనుగులు రోధించాయి, గుర్రాలు విలవిల లాడాయి. రథాలు విరిగాయి, ధ్వజాలు ముక్కలయాయి. ఆ ప్రాణుల రక్తం నదీ ప్రవాహాన్ని తలపించింది.

లంకానగరం ఆర్తస్వరాలతో నిండింది.

హనుమంతుడు ప్రశాంతంగా తన ద్వారతోరణం మీద కూర్చుని రాబోయే రాక్షసులను నేల కూల్చడానికి ఎదురు చూస్తున్నాడు.

ఇవి 43, 44, 45, సర్గలు.

## సేనాపతులు

క్షణాల కాలంలో మంత్రిపుత్రులు కడతేరినట్టు విన్న రావణుడు తన సేనాపతులయిన విరూపాక్ష, యూపాక్ష, దుర్ధర, ప్రఘస, భాస కర్ణులను పంపుతూ:

"మీరు సేనాసమేతం వెళ్ళి ఉచితరీతిని ఆ వానరాన్ని శిక్షించండి ఇంతవరకూ జరిగిన విషయాలు చూస్తుంటే అది సామాన్య వానరం అనిపించడం లేదు. బలిష్ఠమయిన భూతంలా తోస్తున్నది

ఇంద్రుడు మనమీద ద్వేషంతో తీవ్ర తపస్సుచేసి ఈ భూతాన్ని సృష్టించాడనిపిస్తున్నది. యక్ష, నాగ, గంధర్వ, దానవ, అసురులను మనం పరాభూతులను చేసి వున్నాం. వారు ప్రతీకారంగా ఈ పనిచేసి వుంటారు అందుచేత అది సామాన్య వానరం అని భావించకుండా మీ సంగ్రామం సాగించాలి.

**దృష్టాహి హరయః పూర్వం**
**మయా విపుల విక్రమాః ।**
**వాలీ చ సహ సుగ్రీవో**
**జాంబవాంశ్చ మహాబలః ॥**

**నీలః సేనాపతి శ్చైవ**
**యే చాన్యే ద్వివి దాదయః**
**నైవం తేషాం గతి ర్భీమా**
**న తేజో న పరాక్రమః ॥**

**న మతి ర్నబలోత్సాహౌ**
**న రూప పరికల్పనమ్ ।**
**మహ త్సత్వ మిదం జ్ఞేయం**
**కపిరూపం వ్యవస్థితమ్ ॥**

మహాబలపరాక్రమవంతు లయిన వానరవీరులు వాలి సుగ్రీవ జాంబవంతులను ఎరుగుదును. వారి సేనాపతి నీలుడు, మరింకా ద్వివిదుడు వీరందరినీ చూశాను. వారిలో ఎవరూ ఇంత పరాక్రమ, తేజస్సంపన్నులు కారు. వారిలో ఈ ఉత్సాహం, ధీశక్తి, ఆకారం, ధీరత్వం ఎరగను. అందుచేత వానరాకృతిలో వచ్చిన మహా భూత మేదో అయి వుండాలి.

ముల్లోకాలలో సురాసుర మానవులను కంపింపజేసిన మీ ముందు ఏ భూతమూ ఆగదు. అయినా యుద్ధంలో జయాపజయ నిశ్చయం ముందుగా చెయ్యలేం కనక అప్రమత్తంగా ఆత్మరక్షణ చేసుకుంటూ అడుగువెయ్యాలి, అన్నాడు.

ఆ మాటలు విని వారు తీవ్రవేగంతో గజాశ్వ రథ బల సమేతం ఆయుధధారులై వచ్చి తోరణం మీద ఉదయసూర్య కాంతితో వెలిగే ...కుని చూశారు.

...స్తూనే, దుర్ధరుడు వాడిగల ఉక్కుబాణాలు అయిదు వదిలాడు. ... కలువలవలె వున్నాయి. మారుతి ఆ బాణ ఘాతాలతో ఒక్క గర్జన ... ఏధికి లేచాడు.

దుర్ధరుడు బాణవర్షం కురిపించాడు.

వార్షుకాభ్రాన్ని వాయువు నిరోధించినట్లు దుర్ధరుని ఎదుర్కొన్నాడు మారుతి. మెరుపుల పిడుగులు పర్వతం మీద పడినట్లు హనుమంతుడు వాని రథం మీదికి దూకాడు.

రథానికి కట్టిన గుర్రాలెనిమిదీ పిప్పి పిప్పి అయాయి. కాడితో ఇరుసు ముక్కలు ముక్కలయింది. దుర్ధరుడు ముద్దముద్దగా మట్టిలో పడ్డాడు.

విరూపాక్ష యూపాక్షులు ముందుకు వచ్చి ముద్గరాలతో హనుమంతుని ఉరఃస్థలం మీద కొట్టారు. హనుమంతుడు గరుడవేగంతో నేలకుదిగి సాలవృక్షాన్ని పెకలించి దానితో వారి శిరసులు వ్రక్కలు చేశాడు.

ప్రఘన, భాస కర్ణులు ఖడ్గ శూలాలు విసిరారు.

ఆ దెబ్బలకు రక్తం స్రవించి రోమాలన్నీ ఎరుపెక్కగా బాల సూర్యుని వలె కనిపిస్తూ సర్ప, మృగ, వృక్ష సమూహాలతో నిండిన పర్వత శిఖరాలు పెకలించి వారిని యమపురికి పంపాడు.

సేనాబలం మిగిలి వుండటంతో ఒక గుర్రాన్ని పట్టుకుని దాన్ని విసురుతూ మిగిలిన గుర్రాలనూ, ఏనుగుతో గజబలాన్నీ, భటులతో కాల్బలాన్నీ కడతేర్చాడు.

రథ, గజ, తురగ, పదాతుల, శవాలతో ఆ ప్రాంతం కాలుపెట్టడానికి వీలులేకుండా అయింది.

రాక్షస సంహార కుతూహలంతో వున్న యమునివలె హనుమంతుడు మళ్ళీ విశ్రాంతిగా ద్వారతోరణం అధివసించాడు.

46వ సర్గ.

## రావణ నందనుడు

హనుమంతుడు తన సేనాపతులను కూడా సంహరించినట్లు విన్న రావణుడు క్రోధోద్రిక్తుడై ఎదురుగా ఉన్న అక్ష కుమారునివైపు తిరిగాడు.

ఆ చూపులోనే తండ్రి మనసు గ్రహించి ధనుస్సు చేబూనిలేచాడు. మంత్రహుతమయిన ఆజ్యాహుతులతో ప్రజ్వలితమయిన అగ్నివలె వెలుగుతూ రథారూఢుడై బయలుదేరాడు. తపశ్శక్తితో సంపాదించిన ఆ స్యందనం బంగారు జాలరులతో రత్నఖచిత పతాకాలతో, మనోవేగంతో ఆకాశమార్గాన పోగలగిన, దానికి ఎనిమిది గుర్రాలు పూన్చి వుంచారు.

రథం బయలుదేరింది.

దాని వెంట చతురంగబలాలూ అనుసరించాయి. అంతవరకూ జరిగిన తమ సేనాసంహారంతో ఉద్రిక్తుడయిన అక్షకుమారుడు సింహనేత్రాలతో వున్నాడు.

ఆ సమయంలో అటు హనుమంతునీ యిటు అక్షకుమారునీ తిలకించే సర్వప్రాణికోటీ గజగజలాడింది.

సూర్యుని వేడి తగ్గింది. గాలి స్తంభించింది.

ఆకాశం దద్దరిల్లింది.

సముద్రం కల్లోలమయింది.

ధనుర్విద్యా విదుడయిన అక్షకుమారుడు వాడిగా మొనదేరిన మూడు బాణాలు వదిలాడు. విషభరిత సర్పాలవలె అవి హనుమంతుని శిరస్సున నాటుకున్నాయి.

ఆ బాణకిరణాలతో ఉదయసూర్యు డయాడు హనుమంతుడు.

అక్షకుమారుని వీర పరాక్రమాలకు సంతోషించి, మారుతి కన్నులెర్రజేశాడు. ఆ వేడికి రాక్షససేన భస్మమయేలా ఉంది.

వానరపర్వతంమీద బాణవర్షం కురిపించాడు, రావణనందనుడు.

సింహగర్జన చేశాడు హనుమంతుడు.

ఒక్కసారి కాళ్ళూ చేతులూ ముడిచి దూకాడు.

దూకుతున్న వానిమీదికి శరపరంపర నడిపాడు. ఆ బాణాలమధ్య నుండి గాలివలె తప్పించుకుంటూన్న సమయంలో భుజసంధులలో తగిలిన బాణఘాత తీవ్రతకు గట్టిగా అరచి:

వీడు వయసులో బాలుడైపోయాడు. వీణ్ణి చంపడానికి నాకు మనసు రావడంలేదు. అయితె విడు అగ్నిలా విజృంభిస్తున్నాడు. వీణ్ణి ఉపేక్షిస్తే నా

మీద పగ తీర్చుకుంటాడు, అని ఆలోచించి ఒక్కదూకులో గుర్రాలను తన్ని వదలగా అవి నేలకూలాయి. రథం భగ్నమయింది. అంతతో ఆ యువకుడు గగనవీధికి లేచాడు.

మహాసర్పాన్ని గరుత్మంతుడు కాలిగోళ్ళతో పట్టి ముక్కుతో చీల్చినట్లు అక్షకుమారుని కాళ్ళు రెండూ బిగబట్టి గిర్రున త్రిప్పి వదిలాడు హనుమంతుడు.

వాని అవయవాలు పట్లు తప్పి రక్తధారలతో ధూళిలో కలిశాయి. ఆ అద్భుతాన్ని తిలకించి సర్వప్రాణికోటీ ఆశ్చర్యచకితం అయింది.

మానవ మారణహోమంతో ఆనందించే యమునివలె హనుమంతుడు సంతోషంగా ద్వారతోరణంచేరి కూర్చున్నాడు.

47వ సర్గ.

## బ్రహ్మాస్త్రం

***హనూమతో వేద న రాక్షసోన్తరం***
***న మారుతి స్తస్య మహాత్మ నోన్తరమ్।***
***పరస్పరం నిర్విషహౌ బభూవతుః***
***సమేత్య తౌ దేవ సమాన విక్రమౌ॥***

అక్షకుమారుని మరణవార్త విన్న అనంతరం దేవేంద్ర సమ పరాక్రముడయిన ఇంద్రజిత్తును చూస్తూ రావణుడు:

నాయనా! నువ్వు శస్త్రవేత్తలలో, అస్త్ర విద్యావిదులలో శ్రేష్ఠుడవు. నీ వీరత్వాన్ని దేవతలూ, దేవనాయకులూ చవిచూశారు. చతుర్ముఖ ప్రజాపతిని ఆరాధించి బ్రహ్మాస్త్రం సాధించావు.

రణరంగంలో దేవ దానవకోటులు నీ పాదాక్రాంతం కాక తప్పదు. భుజబలం, తపోబలం కల నీ ధీశక్తి దేశకాలాలను పరిశీలించి సాగుతుంది.

నీ ఆలోచనకు ముల్లోకాలూ తలవంచాలి.

తపస్సులో పరాక్రమంలో నాతో సమానుడవు. నువ్వు రణభూమికి వెడితే నేను నిశ్చింతగా వుంటాను.

ఆ వానరుని చేతులలో కింకరగణం నేల కూలింది. మన జంబుమాలి పడిపోయాడు. చతురంగబలాలతో సేనాపతులు తిరిగి రాలేదు. అంతకు ముందే మన సచివతనయులు కన్నుమూశారు.

ఇంతకుముందే నీ సోదరుడు అక్షకుమారుడు అంతిమ శ్వాసవిడిచాడు. వీరందరూ నీ అంత బలపరాక్రమ సంపన్నులుకారు. నువ్వు బాగా యోచించి ఆ వానరుని పరాక్రమం పరిశీలించి కార్యరంగంలో ప్రవేశించాలి. నిన్ను చూస్తుండగానే ఆ వానరుడు నిర్వీణ్ణుడు కావాలి. వాడికి సేనాబలం లేదు, వజ్రధారి కాదు, అగ్నిహోత్రుడు కాడు. వాయుసుతుడు మాత్రమే. ఇవన్నీ తెలిశాక ఏం చెయ్యాలో నువ్వేరుగుదువు.

నిజానికి నిన్ను పంపడం ఉచితంకాదు, కాని రాజధర్మానుసారం ఇప్పుడు నువ్వే వెళ్ళాలి. యుద్ధభూమిలో ఆయుధబలం మాత్రమేచాలదు, అవసరానుకూలమయిన వివేచన కావాలి, అది విజయసాధనకు సహకరించాలి, అన్నాడు.

విన్నాడు ఇంద్రజిత్తు.

తండ్రికి ప్రదక్షిణం చేశాడు.

పొంగుతూన్న సముద్రంలా బయలుదేరాడు.

రథాన్ని అధిరోహించాడు.

ఆ సమయంలో మృగరోదనాలు బయలుదేరాయి.

వస్తున్న రథధ్వని, ధనుష్టంకారం విన్న హనుమంతునికి సంతోషం కలిగింది.

ఆ యుద్ధం చూడడానికి నాగ యక్ష సిద్ధులు గగన వీధిలో నిలిచారు.

హనుమంతుడు తన దేహాన్ని పెంచుతూ సింహనాదం చేశాడు.

వారుభయులూ సురాసుర ప్రభు తేజంతో వెలుగుతున్నారు. ఇంద్రజిత్తు వాడి మొనలుగల బంగారు రెక్కల బాణాలు వదులుతున్నాడు. హనుమంతుడు అవలీలగా తప్పించుకున్నాడు.

లక్ష్యశుద్ధిగల ఇంద్రజిత్తు విడిచే నిశితశరాలను అనాయాసంగా దూరం చేస్తున్నాడు మారుతి. కొంతసేపు గడిచింది.

హనుమంతుని శక్తి ఎంతటిదో అంతుచిక్కలేదు, ఇంద్రజిత్తుకు.

రాక్షసపుత్రుని సామర్థ్యం ఈయనకూ అందలేదు.

ఒకరికొకరు దుష్పహంగా వున్నారు.

ఏనాడూ గురి తప్పని తన విలువిద్య వ్యర్థం కావడంతో ఇంద్రజిత్తు ఆలోచనలో పడ్డాడు. ఆలోచించి ఆలోచించి, వీడు శస్త్రాస్త్రాలతో కడతేరడు అని నిశ్చయించి బ్రహ్మాస్త్రం సంధించి విడిచాడు.

హనుమంతుడు చైతన్య హీనుడై నేలమీదపడి క్షణంలో తెలివిరాగా;

ఈ రాక్షసుడు నన్ను బ్రహ్మాస్త్రంతో బంధించాడు. పితామహుని వరప్రభావంవల్ల ఏ అస్త్రమూ నన్ను వధించదు: ఈ అస్త్రబంధాన్ని విడిపించుకునే శక్తిలేదు. ఇంద్ర, వాయు, బ్రహ్మలు రక్షిస్తున్నారు, కనక భీతిలేదు, అనుకున్నాడు.

నేను రావణుని దగ్గరకుపోయి మాట్లాడే అవకాశం ఈ విధంగా కలిగింది. అని కదలకుండా వున్న ఆ వానరవీరుని చేరిన రాక్షసులు నారచీరలతో, చెట్లనారలతో గట్టిగా బంధించారు. అయినా కదలలేదు.

చూశాడు రావణి.

ఎంత మూర్ఖంగా చరించారు మా వీరులు.

ఒక అస్త్రం బంధించి వున్నప్పుడు మరో బంధనంచేస్తే ఆ అస్త్రబంధం విడిపోతుందని ఎరుగని వారయారు వీరు, అనుకుంటూ నడుస్తున్నాడు.

రాక్షసులు హనుమంతుని లాక్కుని వెడుతున్నారు.

బ్రహ్మాస్త్ర బంధం వదిలినట్టు తెలియ లేదాయనకు. ఉభయులూ లంకేశ్వరుని కొలువులో ప్రవేశించారు. బంధిత మత్తేభంలా ఉన్నాడు హనుమ.

అసలు వీడెవడు?

ఇక్కడ ఏం పని వీడికి?

ఎవరి బలం చూసుకుని వచ్చా డిక్కడికి?

అని రాక్షస ప్రముఖులు ఒకరితో ఒకరు గుసగుస లాడుకుంటున్నారు. నరకండి, నిప్పులో వుండించండి, హాయిగా విరుచుకు తినేయండి, అంటున్నారు మరికొందరు.

రత్న సింహాసనం మీది రావణుడు హనుమంతుని చూశాడు. తేజః పరాక్రమాలతో సూర్యకాంతితో ఉన్న రావణుని హనుమంతుడు తిలకించాడు.

రావణుని కన్నులు ఎర్రబడ్డాయి.

హనుమంతుని నేత్రాలలో చింతనిప్పులు పుడుతున్నాయి.

స్వర్ణ నిర్మితమూ ముక్తా జాలావృతమూ అయిన కిరీట శోభిత శీర్షంతో వజ్ర, మాణిక్య భూషణాలతో చీని చీనాంబరాలంకృతుడై, రక్తచందన లేపంతో అరుణారుణనయనుడై వెలుగుతున్నాడు. నీలగిరి సన్నిభదేహంతో తారహారాలంకృత వక్షంతో, బలాక పక్షులతో నిండిన మేఘంలా ఉన్నాడు. ఆ బాహువులు అయిదు పడగల పాముల్లా ఉన్నాయి.

రత్న, స్ఫటిక ఖచితమయిన ఆస్తరణం పరచిన సింహాసనం మీద వున్న చక్రవర్తికి ఇరుపార్శ్వాల వింజామరలతో అందగత్తెలున్నారు.

మంత్రాంగ కుశలులయిన మహాపార్శ్వ, దుర్ధర, ప్రహస్త నికుంభులు ఆయన కిరువంకలా ఆసీనులయారు. మిగిలిన సచివమండలి అటూ యిటూ వున్నారు. వారి మధ్య రావణుడు దేవతా పరివృతుడైన ఇంద్రుని వలె ఉన్నాడు.

స్వర్ణ సింహాసనం మీది రావణుడు మేరుగిరిపై నీలమేఘంలా వున్నాడు.

ఆ రాక్షసేశ్వరుని తిలకించే హనుమంతునికి ఆశ్చర్యం కలిగి:

***అహో రూప మహో ధైర్యం***
***అహో సత్వ మహో ధృతిః।***
***అహో రాక్షస రాజస్య***
***సర్వలక్షణ యుక్తతా॥***

*య ద్యధర్మో న బలవాన్*
*స్యాదయం రాక్షసేశ్వరః।*
*స్యాదయం సురలోకస్య*
*స శక్రస్యాపి రక్షితా॥*

ఈ రాక్షసేశ్వరుని సౌందర్యం, ధైర్యం, శక్తి, బలం ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. సర్వలక్షణ లక్షితుడైన ఈ ప్రభువు అధర్మానికి ఒడిగట్టకపోతే దేవలోకంతో పాటు దేవేంద్రుడు కూడా ఈయనకు పాదాక్రాంతుడు కావాలి.

ఈయన చేసే క్రూర, ఘాతుకాలు కారణంగా దేవ దానవ గణాలు వీనికి భయపడుతున్నాయి.

ఈ రావణుడు తలచుకుంటే లోకాన్ని జలప్రళయంలో ముంచెత్తగలడు, అని ఊహిస్తున్నాడు, హనుమంతుడు.

48, 49 సర్గలు.

## మీమాంస

లోక కంటకుడైన రావణుడు హనుమంతుని చూసి:

ఈ మహాతేజస్వంతుడైన వానరుడు ఎవడై ఉంటాడు, నాడు నేను కైలాసాన్ని చలింపజేసిననాడు నన్ను శపించిన నందీశ్వరుడా!

కాకుంటే–

బాణాసురుడా! అని ఆలోచిస్తూ ప్రహస్తుని వైపు తిరిగి:

వీడెవడో! ఎక్కడనుంచి వచ్చాడో, అశోకవనం ఎందుకు ధ్వంసం చేశాడో, రాక్షస జనాన్ని ఎందుకు భయపెట్టాడో! మన వారితో పోరాటానికి ఎందుకు తలపడ్డాడో వివరంగా అడుగు, అన్నాడు.

ప్రహస్తుడు: ఓ వానరా! నువ్వు భయపడకుండా నిజం చెప్పు. సత్యం పలికితే నీకు విముక్తి లభిస్తుంది.

దేవేంద్రుని దూతగా వచ్చావా! యమ, వరుణ, కుబేరులలో ఎవరయినా చారకృత్యానికి పంపారా! విజయకాంక్షతో విష్ణువే పంపించాడా? అకారంలో వానరత్వం వున్నా నీ తేజస్సు చాలా ఆశ్చర్యం కలిగిస్తున్నది.

ఈ లంకా నగరంలో ఎందుకు అడుగుపెట్టావో, నిజం చెపితే నిన్ను విడిచిపెడతాం, లేదా నీ ప్రాణాలు దక్కవు, అన్నాడు.

హనుమ: ఇంద్ర, యమ, వరుణ, కుబేరులతో నాకు ఏ సంబంధమూ లేదు. విష్ణు ప్రేరణతో నేను రాలేదు. నేను వానరుడను. ఆ వానర ప్రకృతితోనే ఇలా వచ్చాను. మీ రాజును దర్శించే కోరికతో ఈ వనం ధ్వంసం చేశాను. బలవంతులైన మీ రాక్షసులు నన్ను ఎదుర్కోబోతే ప్రాణరక్షణార్థం వారితో యుద్ధం చేశాను. దేవ, దానవులు నన్ను బంధించలేరు. శస్త్రాస్త్రాలు నన్ను బాధించవు. అది నాకు పితామహుడిచ్చిన వరం. మీ మహారాజును చూడాలనే కోరికతో నేను బంధితుడనైనట్లు నటించి ఇలా వచ్చాను, అని రావణుని వైపు తిరిగి:

లంకేశ్వరా! సుగ్రీవ సందేశంతో నీ దగ్గరకు వచ్చాను. ఆయన సోదరప్రేమతో నీ కుశలం అడగమన్నాడు. ఆయన చెప్పిన మాటలు సావధానంగా వింటే ఇహపరాలలో నీకు శ్రేయస్సు కలుగుతుంది.

## సందేశం

మా ప్రభువు ఏమన్నాడో వినిపిస్తాను.

రథ, గజ తురగ పదాతి బల సంపన్నుడు దశరథ మహారాజు.

ఆయన లోక ప్రజ లందరినీ పితృవాత్సల్యంతో చూసుకునేవాడు. ఇంద్రునితో సమమయిన తేజస్సు కల ఆ మహారాజు ఆజ్ఞానుసారం ఆయన పెద్దకొడుకు దండకారణ్యానికి వచ్చాడు.

ధర్మవర్తనుడూ, తీవ్ర బలపరాక్రమ సంపన్నుడూ, అయిన ఆ రామచంద్రుని వెంట తమ్ముడు లక్ష్మణుడూ, భార్య సీత వచ్చారు.

జనకరాజపుత్రి, పతివ్రత అయిన ఆ సీత ఒకనాడు దండకారణ్యంలో కనిపించలేదు. ఆమెను అన్వేషిస్తూ ఆ రాకుమారులు కిష్కింధచేరి ఋశ్యమూక పర్వతం మీద సుగ్రీవుని కలిశారు. సీతాన్వేషణ భారం వహించాడు మా ప్రభువు.

వానర రాజ్యం సుగ్రీవునకు ధారవోశాడు రాముడు.

మా కపిలోక ప్రభువు మహావీరుడు వాలి.

నువ్వెరుగని వాడుకాదు వాలి,

అటువంటి యోధుని ఒకే ఒక్క బాణంతో నేల కూల్చాడు రాముడు.

ఆడిన మాట ప్రకారం వానరసేనలను నాలుగు దిక్కులకూ పంపించాడు సుగ్రీవుడు.

మా వానర యోధులలో కొందరు వైనతేయులు, మరికొందరు వాయుదేవసములు, అందరూ తీవ్రగమనం కలవారే.

వారిలో నేను వాయువునకు ఔరసుడనయిన హనుమంతుడను. నూరుయోజనాల సముద్రం దాటి లంకలో సీతాదేవిని చూశాను.

నిన్ను చూశాను. నువ్వు కూడా ధర్మం ఎరిగినవాడవు తపస్వివి. ప్రాజ్ఞుడవు. అటువంటి నీకు పరభార్యాపహరణం ఉచితంకాదు. నీ వంటి ధీమంతులు ధర్మాన్ని అతిక్రమించి ప్రమాదాలు కొని తెచ్చుకోరు.

రామ లక్ష్మణులు ధనుర్బాణధరులై నిలబడితే దేవాసురులు వారికి ఎదురు నిలవలేరు. రాముని మనసుకు కష్టం కలిగించిన వాడెవడూ సుఖంగా ఊపిరి తీసుకోలేడు.

ఈ విషయాన్ని విస్మరించకుండా త్రికాలహితమూ, ధర్మార్థ సంయుతమూ అయిన నా మాట విని ఆయన భార్యను ఆయనకు అప్పగించు. ఆయనెవరనుకుంటున్నావో! మానవరూపం ధరించిన దైవం.

ఇక–

నేను సీత జాడ తెలుసుకున్నాను.

మిగిలిన పని అవలీలగా సాగిస్తాడాయన.

నువ్వు సీతను అపహరించడం అంటే అయిదు పడగల పాముతో చెలగాటమే. విషాన్ని తిని బ్రతికే వాడుండడు కదా! అలానే సీతను అపహరించడమూ.

తీవ్ర సాధనతో తపస్సు చేసినవాడవు, ధర్మపరుడవు.

కనక నీ ప్రాణాలు తీయడం అంత న్యాయం కాదు.

దేవాసురులకు నిన్ను చంపడం సాధ్యంకాదు కాని,మానవుడైన రాముడు, వానరుడయిన సుగ్రీవుడు వస్తున్నారు. అధర్మం మీద ధర్మం విజయం సాధించి తీరుతుంది.

నిన్నటివరకూ నువ్వు ధర్మకర్మల ఫలం అనుభవించావు. ఇప్పుడీ సీతాపహరణమనే అధర్మ ఫలాన్ని అనుభవించే సమయం ఆసన్నమయింది.

***జనస్థాన వధం బుద్ధ్వా***
***బుద్ధ్వా వాలి వధం తథా।***
***రామ సుగ్రీవ సఖ్యం చ***
***బుద్ధ్యస్వ హిత మాత్మనః॥***

జనస్థానంలో నీ యోధులందరూ రాముని చేతులలో నేల కూలిన విషయం విన్నావు.

మహావీరుడైన వాలి మరణించిన వార్త విన్నావు.

రామ సుగ్రీవ మైత్రి తెలిసింది. ఇప్పు డింక నీ శ్రేయోమార్గం తెలుసుకోవాలి.

ఇంత చెప్పడం దేనికంటావేమో!

నేనే నీ లంకా నగరాన్ని సర్వనాశనం చెయ్యగలను, కాని రాముడి కది అభిమతం కాదు.

సీతాపహరణం చేసిన వానిని తనే స్వయంగా హతమారుస్తానని శపథం చేశాడు. ఆయన మాట తప్పనివాడు.

పయిగా సీతాదేవి ఎవరో నీకు తెలిసినట్లు లేదు.

సర్వ లంకా నాశన రూపిణి అయిన కాళరాత్రి ఆవిడ.

కాలపాశాన్ని ఆవిడ రూపంలో నీ మెడకు తగిలించుకున్నావు.

రామ క్రోధాగ్ని

సీతా తేజోఒగ్ని......

ఈ రెండూ నీ లంకను సర్వనాశనం చేస్తూంటే చూడక తప్పదు నీకు.

నా మాట విను.

నీ సచివ, సామంత, బంధు మిత్రకోటిని రామ బాణాగ్నికి ఇంధనం చెయ్యకు.

ఈ సర్వభూతాలనూ ఉపసంహరించి మళ్ళీ యథాపూర్వం సృష్టించగలవాడు రాముడు.

విష్ణు సమ పరాక్రముడైన రాముని ఎదుట నిలవగలవాడు లేడు.

చతుర్ముఖుడు, త్రినేత్రుడు, సహస్రాక్షుడు వీరెవరూ రాముని ముందు నిలవరు. ఆయన తలచుకుంటే వీరెవ్వరూ అభయంకూడా యివ్వలేరు, అన్నాడు.

50, 51 సర్గలు.

## విభీషణుడు

హనుమంతుని మాటలు వినే రావణుని క్రోధం అంచులు దాటింది.

ఈ వానరునికి శిరశ్ఛేదం చేయండి, అన్నాడు.

అది విని విభీషణుడు:

రాక్షసేశ్వరా! ఆవేశాన్ని విడిచి క్షమా హృదయంతో ఈ విషయం పరిశీలించాలి. విచక్షణకల ప్రభువులు దూతకు శిరశ్ఛేదం చెయ్యరు. అది రాజనీతి విరుద్ధం. లోకం దానిని గర్హిస్తుంది.

నువ్వు ధర్మవిదుడవు. ముఖ్యంగా రాజనీతి నీకు కరతలామలకం. మంచి చెడ్డలు ఒకరు నీకు చెప్పనవసరము లేదు. నీ అంతటి వాడే రోషావేశాలకు లోబడితే ఇక విద్యా ప్రయోజనం ఏమిటి? సర్వశత్రు సంహార సమర్థుడవైన నువ్వు దూతను తగు రీతిని దండించాలే కాని ఇలా శిక్షించరాదు; అని చెపుతూంటే రావణుడు:

విభీషణా! పాపులను వధించడం పాపం కాదు. వీడు చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం శిరశ్ఛేదమే అన్నాడు.

లంకేశ్వరా! ధర్మార్థ యుక్తంగా చెపుతూన్న నా మాటను ప్రశాంత చిత్తంతో ఆలకించు. యుద్ధాలలో కూడా దూతను వధించరాదని పెద్దలు చెప్పారు. వీడు బాగా విఱ్ఱవీగుతున్న శత్రువని నేనూ అంగీకరిస్తాను. వీడు మనకు చాలా నష్టం కలిగించి, ఎంతో అపకారం చేశాడు. అయినా వీడు దూత.

కొరడాతో కొట్టడం.

బుర్ర గొరిగించడం.

కాలో, చెయ్యో విరిచేయడం - ఇవీ దూతకు విధించే శిక్షలు, అంతే తప్ప దూతను వధించినట్టు మనం వినలేదు, ఎప్పుడూ.

యుక్తా యుక్తా లెరిగి, వినీతుడవుగా ప్రఖ్యాతి పొందిన నువ్వే అవేశానికి లొంగితే ఏం కావాలి. నిగ్రహం వివేక లక్షణం. ధర్మనిర్ణయంలో నిన్ను మించినవారులేరు. శాస్త్ర జ్ఞానంతో లోక వ్యవహారం ఎరిగిన ధీమంతుడవు.

నీ పరాక్రమం దేవాసురుల తల వంచింది.

ఇంకొక్కమాట-

ఈ వానరుని చంపి మనం సాధించగలిగింది లేదు. వీడి ప్రభువును పట్టి చంపాలి. ఇప్పుడు వీనిని చంపితే ఈ విశాల సముద్రం దాటి మరొక చారుడు వచ్చే అవకాశం కనపడదు.

వీడు తిరిగి వెడితే తప్ప ఆ మానవ వానర ప్రభువులు లంకకు యుద్ధానికి రాలేరు.

పరాక్రమం, ఉత్సాహం, ధైర్యం కల నీకు యుద్ధ ప్రీతులయిన అనుచరులు కోట్ల సంఖ్యలో వున్నారు. వారిలో కొందరుపోయి ఆ మానవుడికి నీ శక్తి ఏమిటో వివరిస్తారు. మిగిలిన వ్యవహారం అప్పుడు తేలుతుంది. అందుచేత ఈ వానరుని సంహరించకుండా విడిచిపెట్టాలి, అన్నాడు.

విన్నాడు రావణుడు.

దేశ కాల యుక్తంగా కనపడింది, విభీషణుని మాట.

నువ్వు చెప్పినట్లు దూతవధ నింద్యమే. వీడికి శిక్ష వెయ్యాలి. వానరులకు తోక చాలా యిష్టమయినది, అది తగులబెట్టండి. అప్పుడు వీడి వికారాకృతి చూసి వీడి బంధుమిత్రులు ఆనందిస్తారు. తోక అంటించి శృంగాటకాలలో నిలబెట్టండి, అని ఆజ్ఞాపించాడు.

అది విన్న క్షణంలో రాక్షసులు తమ తమ గృహాలలోని పాతగుడ్డలు తెచ్చి హనుమంతుని వాలానికి చుట్టడం ఆరంభించారు. హనుమంతుడు శరీరాన్ని పెంచుతున్నాడు. వారు తాము చుట్టిన గుడ్డలు నూనెతో తడిపి నిప్పు అంటించారు.

లంకలోని అబాల గోపాలం హనుమంతుని చూడడానికివచ్చి సంతోషంగా చప్పట్లు కొడుతున్నారు.

తోక మండుతోంది. హనుమంతుడు ఆలోచించాడు.

ఈ లంకలో రాత్రి తిరగడంవల్ల వీరి దుర్గ రక్షణ విధానం తెలియలేదు. ఈ శిక్షతో వీరు నగరం అంతా తిప్పి నాకు మేలుచేస్తారు, అని సంతోషించాడు.

శంఖ, భేరీ ధ్వానాలతో నగరమంతా హనుమంతుని త్రిప్పుతున్నారు.

'వీడు గూఢచారి' అని అరుస్తున్నారు. వీధులన్నీ వేడుకగా హనుమంతుని చూచే రాక్షస స్త్రీలతో నిండాయి.

ఈ వార్త సీతాదేవికి చెప్పి సంతోషించారు, మరికొందరు స్త్రీలు. వింటూనే సీతాదేవి మనసా అగ్నిహోత్రుని ప్రార్థించింది.

***యద్యస్తి పతి శుశ్రూషా***
***యద్యస్తి చరితం తపః।***
***యదివా స్త్యేక పత్నీత్వం***
***శీతో భవ హనూమతః॥***

పతిశుశ్రూషలో, తపస్సులో నేను సాధించిన ఫలం, ఆయన ఏకపత్నీ వ్రతఫలం, హనుమంతునికి చల్లదనం కలిగించాలి. అగ్ని బాధించరాదు. ధీమంతుడైన రామునికి నామీద దయ ఉంటే, నా అదృష్టలేశం ఏమయినా మిగిలితే, నా మనస్సు సత్వరం రామ సమాగమకాంక్షతో ఉన్నదని ఆయన గ్రహిస్తే, సుగ్రీవుడు సత్య ప్రతిజ్ఞుడై నన్ను ఉద్ధరించే సంకల్పంతో ఉంటే అగ్నిజ్వాలలు హనుమంతునికి మలయ పవనాలు కావాలి, అని అనుకుంటున్నది.

ఆ ప్రార్థన ఆలకించి అగ్నిహోత్రుడు మంగళప్రదంగా ప్రదక్షిణం చేశాడు. వాయువు సైతం చల్లగా కదలి సీతాదేవికి సంతోషం కలిగించాడు.

కణకణలాడుతూ శిఖలు లేచే అగ్ని చల్లగా సోకుతూ మారుతికి ఆశ్చర్యం కలిగించింది.

వాలాగ్రం మీద మరీ చల్లగా ఉన్నది.

నిన్న సముద్రం దాటుతూంటే మైనాకుడు సాయపడటానికి వచ్చాడు, వాడే అలా వచ్చినపుడు రామకార్యార్థినైన నాయందు అగ్ని అనుగ్రహం చూపకుండా ఉంటాడా!

రాముని తేజస్సు, సీతాదేవి సౌశీల్యం, నా తండ్రి వాయువుతో ఉన్న సఖ్యం – ఈ కారణాలచేత అగ్నిహోత్రుడు నన్ను అనుగ్రహించి ఉండాలి, అని భావించి సింహగర్జన చేసి ఒక్క గంతులో నగరద్వారానికి ఎగిరాడు.

దేహాన్ని సంకుచితం చేశాడు.

అంతతో ఆయనకు కట్టిన త్రాళ్ళన్నీ జారిపోయాయి. మళ్ళీ పర్వత మంత పెంచాడు దేహాన్ని, ద్వారానికున్న దూలంలాగి ద్వారపాలకులను నేలకూల్చాడు.

ఒక్కసారి లంకానగరం అంతా కలయచూశాడు.

అగ్ని శిఖలతో నిండిన లాంగూలంతో హనుమంతుడు ఆదిత్య మండలంలా కనిపిస్తున్నాడు.

## లంకా దహనం

ఆలోచించాడు హనుమంతుడు.

ఈ వనం విధ్వంసం చేశాను.

రాక్షసయోధులు కొందరు నేలకూలారు.

ఇంక ఈ దుర్గం కూడా ధ్వంసం చేస్తే నేను వచ్చిన పని పూర్తి అవుతుంది.

అగ్నిహోత్రునికి తృప్తి కలిగేలా రాక్షస భవనాలు దహిస్తాను, అనుకుని ఒక్క అంగలో సేనాపతి ప్రహస్తుని భవనం నలువూలలా అంటించి, మహాపార్శ్వ, వజ్రదంష్ట్ర, శుక, సారణ, జంబుమాలి, ఇంద్రజిత్తు, రశ్మికేతు, మకరాక్ష, కుంభకర్ణ, కుంభ, నికుంభాది మహావీరుల భవనాలన్నీ అగ్నికి ఆహుతి చేశాడు.

విభీషణ సౌధం ఒక్కటే విడిచిపెట్టాడు.

రావణభవనం ముట్టించి ప్రళయవేళ మేఘపంక్తులు ఉరిమినట్లు గర్జించాడు.

ఆయన నిప్పు ముట్టిస్తుంటే వాయువు తీవ్ర వేగంతో చలిస్తున్నాడు. దానితో అగ్ని మరింతగా మండడం ఆరంభించాడు. లంక అంతా అగ్ని జ్వాలలే. పెటపెట ధ్వనులతో మహాభవనాలు నేల కూలుతున్నాయి. ఆర్తనాదాలతో రాక్షసులు వీధులలో పడ్డారు. పుణ్యక్షయం కాగా భూమికి జారే సిద్ధసౌధాలవలె వున్నాయవి.

పసిపిల్లలకు పాలిస్తూన్న తల్లులు తమ బిడ్డలను గట్టిగా పట్టుకుని వీధులవెంట పరుగులు తీస్తున్నారు. సౌధాగ్రాలమీది స్త్రీలు తమ బట్టల మంటలవేడి భరించలేక క్రిందికి దూకుతున్నారు. వేడికి కరిగి రత్న మాణిక్యాలు ప్రవహిస్తున్నాయి.

*క్వచి త్కింశుక సంకాశాః*
*క్వచిత్ శాల్మలీ సన్నిభాః।*
*క్వచిత్ కుంకుమ సంకాశాః*
***శిఖా వహ్నేశ్చ కాసిరే॥***

ఆ మంటలు

ఒకచోట నిండుగా విరిసిన మోదుగుపూలవలె, మరొకచోట బూరుగు పుష్పాలవలె, ఇంకొకచోట కుంకుమ కాంతితో వున్నాయి.

త్రిపుర దాహదృశ్యం గోచరించింది లంకాదహనవేళ. వాయు ప్రేరితమైన అగ్నిజ్వాలలు వలయాలు తిరుగుతున్నాయి. రాక్షసుల దేహాలే ఆజ్యధారలుగా అగ్ని మండుతున్నది. మంటలు ఆకాశం అంటుతున్నాయి. మండి మండి ఆరిన భవనాల నుండి ధూమం వల్ల కలువల తోరణంలా వున్నది. లంక అంతా ఆర్తనాదాలతో నిండింది.

వీడు వానరుడు కాడు.

వజ్రపాణియో, త్రినేత్రుడో, యముడో, వరుణుడో, రుద్రుడో, సూర్య, కుబేర, చంద్ర అగ్నులలో ఎవడో ఈ రూపంతో వచ్చి వుండాలి. కాకుంటే సాక్షాత్తూ చతుర్ముఖ ప్రజాపతికి కలిగిన ఆగ్రహం వానర రూపంతో లంకా నాశనానికి దిగి ఉంటుంది. లేకపోతే వైష్ణవతేజం అవతరించి వుండాలి అనుకున్నారు రాక్షసులు.

లంక అంతా అంటించి హనుమంతుడు త్రికూటగిరి శిఖరంమీద సింహంలా కూర్చున్నాడు. ఒక్కసారి రాముని స్మరించాడు.

హనుమంతుని ఈ అద్భుత కార్యం తిలకించిన దేవ, గంధర్వ, సిద్ధ, సాధ్య గణాలు హర్షంతో అభినందించాయి.

52, 53, 54 సర్గలు.

## ఆశ్చర్యం

*క్రుద్ధః పాపం న కుర్యాత్కః*
*క్రుద్ధో హన్యా ద్గురూ నపి।*
*క్రుద్ధః పరుషయా వాచా*
*నరః సాధూ నధిక్షిపేత్॥*

లంక ముట్టించి హనుమంతుడు సముద్రతీరం చేరి నీటిలో తోక తడుపుకుంటూ మంటలలో మాడే లంకా నగరాన్ని చూస్తున్నాడు.

ఒక వంక భయం, మరొకవంక అసహ్యం కలిగాయి. ఈ అకార్యం ఎందుకు చేశాను. ఆగ్రహం కలిగితే దానిని వివేకంతో అణచిపెట్టాలేకాని యింత అఘాయిత్యం చెయ్యడమా! కోపాన్ని నిగ్రహించుకోగలవారే ధీమంతులు.

కోపంలో చెయ్యని పాపం వుండదు. గురుహత్య, సజ్జనహింస వంటి పనులు కోపిష్ఠి అనాయాసంగా సాగిస్తాడు. ఎవరితో ఏం మాట్లాడాలో కూడా వాడికి తెలియదు. అందుచేతనే పాముకుబుసం విడిచేటట్లు ధీమంతులు క్రోధాన్ని విసర్జించాలి.

దుర్బుద్ధుడనై, లజ్జా విహీనతతో ఈ దహనకాండ సాగించాను. సీతాదేవి ఏమవుతుందో అనే ఆలోచనే లేదు నాకు. ఇప్పుడింక ఏం చెయ్యను. స్వామి ద్రోహం జరిగిపోయింది.

ఈ లంకాదహనంతో సీతాదేవికూడా తగుల బడివుంటే ఏం కావాలి? నా సర్వ ప్రయత్నం వ్యర్థం. రావణుడిమీద ఆగ్రహంతో సర్వనాశనం చేసుకున్నాను.

ఇప్పుడింక నేను అగ్నిగుండంలో దూకాలి. మహాసాగర బడబాగ్నికి ఆహుతి కావాలి. లేదా సముద్రంలో తిమింగలాలకు ఆహారం అవుతాను.

సుగ్రీవుని సమ్ముఖానికి ఎలా వెళ్ళగలను? రామ లక్ష్మణులను చూడగలనా ఈ దశలో. ఈ లంకాదహనంతో ముల్లోకాలూ కపి ప్రకృతిని పరిహసించి తీరతాయి. రాజసంతో ఎంత దారుణానికి ఒడిగట్టాను.

సీత మరణించిందని వినగానే రామ లక్ష్మణులు ప్రాణం విడిచిపెడతారు. అది చూచిన సుగ్రీవుడు బంధుకోటితో ప్రాణత్యాగం చేస్తాడు. అయోధ్యలో భరత శత్రుఘ్నులు మాత్రం జీవిస్తారా!

కోపం కారణంగా యింతపని చేసిన అదృష్టహీనుణ్ని, అని చింతించే, హనుమంతునికి కొన్ని శుభశకునాలు గోచరించగా:

మాంగళ్యదేవతయైన సీతను అగ్ని దహించదు. ఆవిడే అగ్ని రూపిణి. అగ్నిని అగ్ని బాధిస్తుందా! రాముని భార్యను, పతివ్రతా శిరోమణిని అగ్ని దరిజేరలేదు.

సీతా రాముల ప్రభావంచేత కాకపోతే అగ్ని నా లాంగులాన్ని మండించి నన్ను బాధించకుండా వుంటుందా! నా తోకను తగలబెట్టని అగ్ని సీతపై ప్రసరిస్తుందా!

అవసరమయితే జానకీదేవియే అగ్నిని దహిస్తుంది, కాని అగ్నికి ఆవిడను దహించే శక్తిలేదు,అనుకుంటూండగా, గగన చారులయిన చారణులు:

ఓహో! హనుమంతుడెంత భయంకర కృత్యం సాధించాడు. సర్వలంకానగరం భస్మమై ఆర్తనాదాలతో వున్నా, జానకీదేవి అచంచలంగా అశోకవనంలో యథాపూర్వం వున్నది.

ఆ మాటలు విన్నాడు. అతని హృదయం సంతోషతరంగిత మయింది. అయినా ఒక్కమారు తన కంటితో ఆమెను చూసి వెళ్ళాలని నిశ్చయించుకుని శింశుపా వృక్షం చేరి, ఆ ఛాయలో వసివాడకుండా వున్న సీతను చూసి:

అమ్మా! నేను అదృష్టవంతుడను, అని చేతులు జోడించాడు.

నాయనా! ఇంత సాహసం నీకే సాధ్యం. సత్కీర్తిని సాధించే బల పరాక్రమాలు నీకే ఉన్నాయి. ఒక్క విషయం, మరచిపోకు. రామచంద్రుడు లంకానగరాన్ని తన బాణాలతో చీకాకు పరచి నన్ను తీసుకువెళ్ళడం మంచిది. ఏది ఎలా చెయ్యాలనేది ఆయనకు మనం చెప్పనవసరంలేదు,అని జానకీదేవి అనగా హనుమంతుడు:

అమ్మా! త్వరలోనే రామచంద్రుడు వానర భల్లూక సేనా సమేతం వచ్చి అఖిల శత్రునాశనం చేసి నీ మనస్సుకి ఆనందం కలిగిస్తాడు! ఇక నాకు సెలవమ్మా, అని బయలుదేరి సముద్రతీరాన వున్న అరిష్ట పర్వతం అధిరోహించాడు.

మహోన్నతమైన ఆ గిరి శిఖరాల మీద మేఘాలు ఉత్తరీయాలవలె వున్నాయి. రాళ్ళమీద సూర్యకిరణాలు పడి కనులు మిలమిల లాడిస్తున్నట్టుంది. సెలయేటి మంద్రధ్వనులు వేదగానాన్ని తలపించాయి. ఆకాశాని కెదిగిన దేవదారు వృక్షాలు పర్వతుడు మహామహులు పైకెత్తినట్లు న్నాయి. గాలికి వూగిసలాడే రెల్లుతోటలతో అది కంపిస్తున్నట్టుంది. వాయుపూరితములయి వెదురువనాలు నిర్విరామంగా కూజిస్తున్నాయి. మహాసర్పాల వూపిరి పర్వతం విడిచే నిట్టూర్పులా, మంచునిండిన గండశిలలు ధ్యానసమాధులలో మునులవలె వున్నాయి.

వివిధ వర్ణశోభిత సుమరాజితో తరువులు.

ఆ పరిసరాలలో మహర్షి, యక్ష, కిన్నర, గంధర్వులు.

సింహాలతో గుహలు.

శార్దూలాల విహారాలు.

ఆ పర్వతం ఎక్కి ఒక్కమారు కలయజూసి దేహం పెంచి, కుప్పించి, గగనవీధికి లేచాడు.

ఆ పాదతాడనానికి పర్వతం ముక్కముక్క లయింది. పిడుగుపడి మోడువారి నట్లయాయి మహావృక్షాలు. విరిగిపడే గుహలలో సింహాల గర్జనలు దిక్కులు దద్దరిల్ల జేశాయి.

ఆ కొండమీది విద్యాధర స్త్రీలు భయభీతలై జారిన వస్త్రాలతో చెదరిన అలంకారాలతో గగన మార్గానికి లేచారు.

కాకోల విషసర్పాలు తలలు చుట్టుకుని, నడుములు విరిగి మరణించాయి. అంత ఎత్తయిన కొండ హనుమంతుని పాదపీడనంతో పాతాళానికి దిగి, అక్కడ ఒక కొండ వుండేదని గుర్తులేకుండా పోయింది. గగన వీధిని బయలుదేరాడు హనుమంతుడు.

## మిత్రసమాగమం

ఆకాశ సముద్రంలో-

చంద్రుడే కలువ

సూర్యుడు నీటి కోడి.

పుష్యమీ, శ్రవణ నక్షత్రాలు హంసలు.

పునర్వసు మహా మీనం.

అంగారకుడు మొసలి.

స్వాతి నక్షత్రం హంసపథం.

ఐరావతం ద్వీపం.

మేఘాలే శైవలిని.

చంద్రకిరణాలు వాయు విచలిత తరంగాలు.

పద్మాలు, నాగ, యక్ష, గంధర్వులు.

అటువంటి సాగరాకాశాన్ని వేగగమన నౌకతో దాటుతున్నాడు, హనుమంతుడు.

సూర్య, చంద్ర, తారామండలాలను మ్రింగుతున్నాడా అన్నట్టు సాగుతున్నాడు. మేఘమండలాలను లాక్కుంటూ వెడుతున్నాడు.

ఒక్కసారి వాటిలో దూరి, మరొకసారి పైకివచ్చి దోబూచులాడుతున్నాడు. మబ్బుల మాటున - ధవళ వస్త్రధారి హనుమంతుడు - చంద్రుని వలె వున్నాడు.

గరుత్మంతునివలె గోచరిస్తున్నాడు.

దారిలో మైనాకగిరిశిఖరాన్ని హస్తస్పర్శతో ఆనందింపజేసి ముందుకు సాగి మహేంద్రగిరిని సుదూరాన చూచి సింహనాదం చేశాడు. దీర్ఘవాలాన్ని ఆడిస్తూ ఆనందంతో చేసిన ఆ మహాధ్వనికి దిక్కులు దద్దరిల్లాయి. ఆకాశం బ్రద్ధలవుతుందా అన్నట్లుంది ఆ ధ్వని.

ఈవలి ఒడ్డున వున్న వానరవీరులు ఆ మహాగర్జన విని, అది ఏమా అని ఎదురు చూస్తున్నారు. వారిలో వృద్ధుడైన జాంబవంతుడు వారందరినీ దగ్గరగా చేర బిలిచి:

నాయనా! విన్నారా! ఆ గర్జ! కార్యసాధకుడు కాకపోతే అలా గర్జించలేడు. నిస్సంశయంగా మనవాడు విజయం సాధించి వస్తున్నాడన్నాడు.

పరమ సంతోషంతో వారందరూ పర్వతశిఖరాల మీద, చెట్ల చివరి కొమ్మల మీద గంతులు వేస్తూ హనుమంతుని రాకకోసం నిరీక్షిస్తున్నారు.

మేఘం మీద మేఘం వస్తున్నట్టు దిగే హనుమంతునికి దోసిలి ఒగ్గి నిలిచారు.

హనుమంతడు మహేంద్రగిరిమీద రెక్కలు లేని పర్వతంలా దిగాడు. అందరూ హనుమంతుని చుట్టూ చేరారు.

అనాయాసంగా అంత ప్రయాణం చేసి వచ్చిన హనుమకు వారందరూ దుంపలూ, పళ్ళూ కానుక లర్పించారు.

వృద్ధుడయిన జాంబవంతునికి, యువరాజయిన అంగదునికి అభివాదం చేశాడు. చేస్తూనే:

ఆలోచించాడు; హనుమంతుడు.

''దృష్టాసీతా'' చూశాను సీతను, అని-

రాక్షసస్త్రీజన మధ్యంలో, ఏకవేణితో, ఉపవాస కృశీభూతదేహంతో, రామ విరహశోకంతో మలినవస్త్రంతో ఉన్నది, అన్నాడు.

చూశాను అనేమాట అమృతప్రాయంగా విని వారందరూ సింహ నాదాలతో, కిల కిలా రావాలతో, ఉరువులతో, తోకలు పొడుగుచేస్తూ, పైకెత్తుతూ. నేలమీద తాడిస్తూ, గిరిశిఖరాలకు దూకుతూ, చెట్లమీదికి ఎగురుతున్నారు.

అంగదుడు: హనుమా! నీ వల్ల మా అందరి ప్రాణాలూ నిలిచాయి. ఇప్పుడు మనం రామ దర్శనం చెయ్యగలం. నీ పరాక్రమ, ధైర్య, ప్రభు భక్తులు ప్రశంసనీయాలు. నీ అదృష్టం వల్ల నువ్వు జానకిని చూడగలిగావు. సీతా వియోగ దుఃఖం రామునికి ఉండదు, అంటూండగా మిగిలిన వారందరూ హనుమంతుని యాత్రా విశేషాలు వినడానికి చుట్టూ చేరి కూర్చున్నారు. ఆ వానరవీర మధ్యంలో అంగదుడు దేవ పరివృతుడైన దేవేంద్రుని వలె ఉన్నాడు.

ఆ వానర యోధులతో పర్వత శిఖరం శోభిస్తున్నది.

**56, 57 సర్గలు.**

## అన్వేషణ గాథ

మహేంద్రగిరి మీద అందరూ సుఖాసీను లయారు.

అప్పుడు జాంబవంతుడు చిరునవ్వుతో హనుమంతుని చూస్తూ:

నాయనా! సీతాదేవిని ఎలా చూడగలిగావు! క్రూర రావణుని లంకలో ఆవిడ ఎలా వున్నది? అసలు నువ్వు ఎలా వెళ్ళావు? ఈ వివరాలన్నీ మాకు యథాతథం వినిపించు. విన్నాక తరువాయి కథ ఆలోచిద్దాం, అన్నాడు.

ఆ మాట వినగానే హనుమంతునికి శరీరం పులకించింది.

సీతాదేవికి మనసా నమస్కరించి, కథ ఆరంభించాడు.

మీ రందరూ చూస్తూండగానే మహేంద్రగిరి మీద బయలుదేరి గగన వీధికి లేచాను కదా! సముద్రం మీద వెడుతూండగా నా దారికడ్డుగా ఒక సువర్ణగిరి కనిపించింది. అది నాకు అవరోధంగా నిలబడుతున్నదనే అనుమానం కలిగి దాన్ని ముక్కలు చేసి తీరాలనుకొని నా వాలంతో కొట్టగా దాని శిఖరం వేయి ముక్కలయింది.

అప్పుడా గిరి: నాయనా! నీ తండ్రి వాయుదేవుడూ నా స్నేహితుడు. నన్ను మైనాకుడంటారు. ఈ సముద్రం నా నివాసం. పర్వతాలకు రెక్కలుండేవని నువ్వు విని ఉంటావు. వాటితో ఎగురుతూ అవి భూత కోటిని నాశనం చేస్తూంటే దేవేంద్రుడు వజ్రాయుధంతో వాటి రెక్కలు నరికాడు. అప్పుడు వాయువు సాయపడి నన్ను ఈ సముద్రంలో చేర్చాడు.

ధర్మపరుడయిన రామునికి సాయం చేయడం నా విధి. మీ తండ్రి చేసిన ఉపకారానికి ప్రత్యుపకారంగా నీకు సాయపడాలని ఉంది, అన్నాడు.

నా ప్రయాణ ప్రాధాన్యం వివరించి వాని సెలవు పొంది బయలుదేరాను. తీవ్రవేగుడనై వెడుతూంటే దారిలో నాగమాత సురస అడ్డుపడి:

ఓ వానరా! దేవతలు నిన్ను నాకు ఆహారంగా అనుగ్రహించారు. చిరకాలానికి నా ఆకలి తీరుతున్నది, అనగా నేను చేతులు జోడించి:

అమ్మా: నేను దాశరథియైన రాముని పనిమీద వెడుతున్నాను. భార్య సీతతో, తమ్ముడు లక్ష్మణునితో రాముడు దండకారణ్యానికి రాగా అక్కడ దుష్టరావణుడు సీతను అపహరించాడు. రాముని దూతనై నేను సీతాన్వేషణకు వెడుతున్నాను. ఆవిడను దర్శించి, ఆ వృత్తాంతం రామునికి నివేదించి వచ్చి నేను నీ నోట పడతాను, నన్ను నమ్ము అన్నాను.

ఆ కామరూపిణి సురస; ఓరీ! నన్ను దాటి వెళ్ళడం ఏ ప్రాణికీ తరం కాదు, అంది.

నేను పది ఆమడలు పెరిగాను.

సురస అంతకంటె పెద్ద నోరు తెరిచింది.

ఉత్తర క్షణంలో నేను అంగుష్ఠ దేహుడనై ఆమె గర్భంలో ప్రవేశించి అంతలోనే ఈవలకు రాగా, నన్ను చూసి నాగమాత:

వానరా! నాకు సంతోషంగా వుంది. నువ్వు నిశ్చింతగా వెళ్ళు. నీ సంకల్పం ఫలిస్తుంది. సీతా రాములకు సమాగమం కలిగించు, అంది.

గరుత్మంతునివలే గగనవీధికిఎగిరాను.

దక్షిణముఖంగా సాగుతున్నాను.

అంతలో నన్ను క్రిందికి లాగుతున్నట్లనిపించింది ఏదో శక్తి.

క్రిందికి చూశాను. ఏమీ కనబడలేదు. అటూ యిటూ చూశాను. ఏ ప్రాణీలేదు. నా వేగం ఆగిపోయి క్రిందికి దిగిపోతున్నాను. బాగా నీటిలోకి చూశాను.

ఆ సాగరంలో భయంకర రూపంతో అట్టహాసంతో ఒక రాక్షసి కనిపించింది.

ఓ మహాకాయుడా! ఎక్కడికి పోతున్నావు. చిరకాలంగా ఆహారం లేక ఆకలితో బాధపడుతున్నాను. నిన్ను తిని నా బాధ తీర్చుకుంటాను, అంది.

ఆ రాక్షసి నోరుకంటె విశాలంగా నా దేహం పెంచాను. అది దాని నోరు విశాలం చేస్తున్నది. పెరిగి పెరిగి ఒక్కసారిగా నా శరీరాన్ని సంకోచింపజేసి దాని ఉదరంలోకిపోయి గుండె చీల్చి బయటపడ్డాను. పర్వత దేహంతో అది నీటి మీద తేలింది. చూసిన చారణులు:

భయంకర రూపిణి అయిన సింహిక హనుమంతుని చేతులలో ప్రాణాలు వదిలింది, అనుకుంటూంటే వింటూ సాగి సాగి లంకా నగరపు సరిహద్దులో ప్రవేశించాను.

సూర్యుడు అస్తమిస్తున్నాడు.

లంకలో దిగాను.

దిగుతూన్న సమయంలో-

ప్రళయకాలమేఘంలా ఒక మహారాక్షసి భీకరాట్టహాసంతో నా ఎదుట నిలబడింది. దాని శిరోజాలు అగ్ని శిఖలవలె వున్నాయి. అది నన్ను చంపడానికి ప్రయత్నించింది. నా ఎడమ పిడికిలి బిగించి ఒక్క పోటు పొడిచాను.

నేల కూలుతూ: ఓ మహావీరుడా! నేను లంకా నగర అధిష్ఠానాన్ని. నన్ను జయించిన నీకు లంకలో ఎదురులేదు, అని కన్ను మూసింది.

చీకటి పడింది. నగరంలో అన్వేషణ ప్రారంభించాను. లంక అంతా చుట్టబెట్టినా సీత జాడలేదు. విపరీత దుఃఖంతో నగర ప్రాకారంతో సమంగా వున్న మరొక సువర్ణ ప్రాకారాన్ని చూశాను. అందులో ఉద్యానవనం. దాని పేరు అశోకవనం. దానిలో శింశుపావృక్షం మీద కూర్చుని చూడడం మొదలు పెట్టాను.

ఆ చెట్టు మొదట ఉపవాసంతో కృశించి, ఏకవేణితో దీనవదనంతో భర్తృ చింతాపరాయణయై వున్న సీతను చూశాను.

ఆమెచుట్టూ వికృతాకారాలతో క్రూరస్వభావంతో రాక్షసీజనం.

రక్త మాంసాలతో బ్రతికే పెద్ద పులుల మధ్య ఆడు లేడిలా వుంది.

ఈ రాక్షస స్త్రీల బాధలు భరించలేక ప్రాణాలు వదిలిపెట్టే దశలో వుండగా చూశాను.

అంతలో రావణ భవనం నుండి అందెల ధ్వనులు అశోక వనముఖంగా వస్తున్నట్లు వినిపించింది.

నేను కొంచెం జంకి ఎవరికీ కనిపించకుండా కొమ్మల చాటున చేరి చూస్తున్నాను.

రావణుడు తన పత్నీ సమూహంతో వచ్చాడు.

సీతాదేవి ఆ రావణుని చూస్తూనే భయంతో ముడిచిపెట్టుకు కూర్చుంది.

గజ గజలాడే ఆమెను చూస్తూ రావణుడు.

ఓ సుందరీ! ఇంక నీకు రెండు మాసాలు గడువుంది. ఈ లోపున నీ మనసు నాపై మరలదో నీ రక్తం త్రాగక తప్పదు, అని గర్జించాడు.

సీత: రాక్షసాధమా! అమిత తేజశ్శాలి రాముడు నా భర్త. ప్రఖ్యాత మయిన ఇక్ష్వాకుల ఇంటి కోడలిని. అటువంటి నన్ను నోటికి వచ్చినట్లు ఆడుతున్న నీ నాలుక ఊడి నేలపడకుండా ఉన్నదే!

నాడు పర్ణశాలలో ఆయన లేనప్పుడు వచ్చావు కనక ఇంకా బ్రతికి వున్నావు. ఆయన కొలువులో సేవకత్వం కూడా నీకు దొరకదు. ఆయన అజేయుడు. అని క్రోధంతో మాట్లాడుతూంటే రావణుడు కన్నుల నిప్పులు కురుస్తూ పిడికిలి బిగించి ఆమెను సంహరించబోగా అక్కడి నారీజనం హా హా రవాలు చేశారు.

వారి మధ్యనున్న మండోదరి వచ్చి వారించి:

నీకు ఈ సీత దేనికి! దేవ గంధర్వ యక్ష కాంత లెందరు లేరు నీ అంతఃపురంలో.

వారితో హాయిగా భోగా లనుభవించు, అని తీసుకువెళ్ళింది. వాడు వెళ్ళాడు.

ఇక్కడి రాక్షస స్త్రీలు పరిపరి విధాల వినరాని మాటలతో సీతను హింసిస్తున్నారు. ఆ సమయంలో అప్పుడే నిద్రనుంచి లేచి త్రిజట వారందరినీ చేర బిలిచి:

ఓసీ! మీ కాలం మూడింది. ఈ సీతను ఎవరూ ఏమీ చెయ్యలేరు. మిమ్మల్ని మీరే నాశనం చేసుకుంటున్నారు. ఈ బాల జనక రాజపుత్రి, దశరథుని కోడలు, మహాపతివ్రత.

ఇప్పుడే నాకు కల వచ్చింది.

ఈమె భర్త లంకకువచ్చి రాక్షసులను ఓడించాడు. ఆయనను విజయలక్ష్మి వరించింది. ఈ సమయంలో వచ్చిన కల నిజమయి తీరుతుంది. కనుక మనం ఇప్పుడే ఈమెను ప్రార్థించి ప్రాణభిక్ష కోరుకోవాలి, అనగానే అందరూ ఆమె పాదాలమీద పడ్డారు.

మీ మాట నిజమే అయితే మీ అందరికీ నేను అభయం ఇస్తున్నాను, అంది సీత.

అప్పుడే నేను పరాక్రమం ప్రదర్శించి వారికి ప్రాయశ్చిత్తం చెయ్యాలనుకున్నాను. కాని బాగా ఆలోచిస్తే అది వుచితం అనిపించలేదు.

అప్పుడు ప్రశాంత సమయంలో ఇక్ష్వాకు వంశకీర్తనంతో ప్రసంగం ప్రారంభించాను.

నా మాటలు వింటూ సీతాదేవి కన్నీరు విడుస్తూ:

ఓ వానరోత్తమా! నువ్వెవరవు? ఇక్కడకు నిన్నెవరు పంపారు? రామునితో నీకెలా స్నేహమయింది? అని అడిగింది.

అప్పుడు నేను:

అమ్మా! బలశాలియైన వానరేశ్వరుడు సుగ్రీవుడు. నేనాయన భృత్యుడను. నీ భర్త రామచంద్రుని ఆదేశానుసారం వచ్చానిక్కడికి. ఇదిగో ఈ ఉంగరం ఆనవాలుగా యిచ్చాడు. నువ్వు ఏం చెయ్యమంటే అది చేస్తాను, నీ అభిమతమయితే వారి దగ్గరకు నిన్ను తీసుకువెడతాను అన్నాను.

జానకి: నాయనా! ఆయన స్వయంగా వచ్చి రావణ సంహారం చేసి నన్ను తీసుకువెళ్ళాలి. అప్పుడు నేను; అమ్మా! ఆయనకు ఆనవాలుగా ఏమయినా యిస్తావా, అని అడిగాను.

అవిడ ఈ మణి యిచ్చింది.

అది అందుకుని, ఆవిడకు ప్రదక్షిణం చేసి తిరిగి రావడానికి సన్నద్ధమయ్యాను.

అప్పుడావిడ : నాయనా! నా అవస్థ అంతా వివరంగా చెప్పి, రెండు మాసాలలోగా వారు రాకపోతే నేను జీవించనని చెప్పు, అని విచారించింది. నేను ఓదార్చాను.

ఓదార్చి నా శరీరం పర్వతమంత పెంచాను.

ఆవిడ శోకం చూసిన నాకు రావణునిపై క్రోధం రేగింది. ముందుగా ఆ వనాన్ని ధ్వంసం చేయడం ఆరంభించాను. అది చూసి రాక్షస స్త్రీలు రావణునితో చెప్పారు. ఆయన మహాబలిష్ఠులయిన కింకర గణాన్ని పంపాడు. శూల ముద్గరాయుధాలతో వచ్చారు వారు. నేను తోరణ ద్వారం మీది దూలం అందుకుని వారిని యమపురికి పంపాను. హతశేషులు వార్తాహరులయ్యారు.

నేను నెమ్మదిగా అక్కడున్న చైత్యద్వారం మీదికి చేరాను. దానికి కాపలా ఉన్నవారిని ఒక స్తంభంతో కడతేర్చాను.

రావణుడు జంబుమాలిని పంపించాడు.

వీడు, వారి సేనాపతి ప్రహస్తుడున్నాడే వాడి కొడుకు.

వాడు తన బలగంతో దిగాడు. అందరినీ ఒక దూలానికి ఎరచేశాను.

అప్పుడు మంత్రి కుమారులు వచ్చారు.

వారిని కూడా అంతకు ముందు వచ్చిన వారికి తోడు పంపాను. సేనాపతులు వచ్చారు. వారు అయిదుగురు, మహాయోధులు, వారు కూడా యమపురి చేరారని విని రావణుడు తన ముద్దులకొడుకయిన అక్షుని పంపాడు. వాడు చతురంగబలాలతో వచ్చాడు. వీడు మండోదరి కుమారుడు.

వచ్చిన అక్షుని రెండు కాళ్ళూ పట్టి గిర్రున త్రిప్పి విసిరేశాను. అది విన్న లంకేశ్వరుడు ఆగ్రహంతో ఇంద్రజిత్తును వదిలాడు. వీడు చాలా ఘటికుడు. ముందుగా వాని సేనను చిత్తు చేశాను. చూశాడు ఇంద్రజిత్తు. ఈ వానరుడు సామాన్యుడు కాడనుకుని బ్రహ్మాస్త్రంతో బంధించాడు. అది చూసి మిగిలిన సేవకులు నన్ను త్రాళ్ళతో బంధించి రావణుని కొలువుకూటానికి కొనిపోయారు.

ఆ దుష్టుడు నన్ను చాలా ప్రశ్నలు వేశాడు. జానకీ దర్శనార్థం వచ్చాననీ, అందుకే యింత చేశాననీ చెప్పి, నేను సుగ్రీవ సచివుడను, రామదూతను, వాయుదేవుని ఔరసపుత్రుడను.

మా రాజు సుగ్రీవుడు నీ క్షేమ సమాచారాలు తెలుసుకు రమ్మని, ఇంకా ఏమన్నాడంటే;

రావణా! రాముడు నా స్నేహితుడు. ఆయన భార్యను అపహరించిన రాక్షసుని సంహరించడానికి నేనంగీకరించాను. వాలిని సంహరించడానికి ఆయన అంగీకరించాడు. అగ్ని సాక్షిగా మైత్రి ఏర్పడింది మాకు.

రాముడు ఒకే ఒక్క బాణంతో వాలిని నేల కూల్చాడు. సుగ్రీవుడు వానరేశ్వరుడయ్యాడు. మమ్మ్మ దశ దిశలకూ పంపాడు. నేను నీ దగ్గరకు దూతగా వచ్చాను.

వానర వీరుల సంగతి మీరెవరూ ఎరుగరు. వారు దేవసమ పరాక్రములు. వారందరూ వచ్చి నీసేనను నాశనం చెయ్యకముందే సీతాదేవిని రామునికి అప్పగించు, అని మా ప్రభువు సందేశం.

ఇలా నేను చెపుతూంటే రావణుడు క్రోధతామ్రాక్షుడై నన్ను తక్షణం సంహరించమని ఆజ్ఞాపించాడు.

అయన తమ్ముడున్నాడు ధీమంతుడు విభీషణుడు. ఆయన రాజనీతి చెపుతూ దూతవధ చాలా అన్యాయమనీ, దూతకు అంగవికలత్వం పెద్ద శిక్ష అనీ అనగా ఆ రాజు నా తోకకు నిప్పు పెట్టమన్నాడు.

రాక్షసులందరూ నా తోకకు గుడ్డలు చుట్టి అంటించారు. నన్ను కర్రలతో, పిడికిళ్ళతో హింసించారు. అలా రాజవీధులు త్రిప్పుతూంటే నగరం అంతా చూసాను. చూడడం అయింది.

శరీరాన్ని సంకుచితం చేసి కట్లు సడలించి, అంతలో పర్వతాకారుడనై మండుతున్న తోకతో లంకానగర సౌధ, భవన, ప్రాసాదాలన్నీ తగులబెట్టాను, అంతా అయాక సీత ఏమయిందో అని చింతలో పడ్డాను.

అప్పుడు ఆకాశచారులమాటలను బట్టి సీతాదేవి సురక్షితంగా వుందని గ్రహించాను. నా లాంగూలాన్నే దహించని అగ్ని సీతాదేవికి హానిచేస్తాడా, అనుకుంటూ మళ్ళీ ఓ మారు ఆవిడను దర్శించి లంకలోని అరిష్టపర్వతం ఎక్కి గగనమార్గాన ఇలా వచ్చాను, ఇది యింతవరకూ జరిగిన కథ.

ఇక జరగవలసింది ఆలోచించండి, అన్నాడు.

5 8వ సర్గ.

## ఆలోచనలు

హనుమంతుడు ఇంకా చెప్పుతున్నాడు:

రామకార్యం, సుగ్రీవయత్నం సఫలమయినట్లే. సీతాదేవిని చూసిన అనంతరం ఆ శీలవతి పట్ల నా మనస్సు నిర్మల భక్తి భావంతో వుంది. ఇక రావణుడు, వాని తపశ్శక్తి ఎంతటి దంటే ఈ సర్వలోకాలనూ రక్షించనూ గలడు, దహింపజెయ్యనూ గలడు. అంత శక్తివంతుడు. ఆ తపశ్శక్తి కారణంగానే వాడు సీతను తాకినా నశించలేదు. ఆవిడ నిజంగా ఆగ్రహిస్తే అగ్నికంటె తీక్షణ మయింది. వాని తపోఽగ్ని ఎంత!

సరే. ఇప్పుడింక మనం రామ లక్ష్మణులను తీసుకుని సీతాదేవిని దర్శించాలి.

లంకా నగరాన్ని ధ్వంసంచేసి, మూలబలంతో రావణుని కడతేర్చే శక్తి నాకు లేకపోలేదు. మీ వంటి మహాయోధులు కూడా కలిస్తే వేరే చెప్పవలసింది లేదు.

ఐంద్ర, రౌద్ర, వాయవ్య, బ్రహ్మాస్త్రాలు నన్నేమీ చెయ్యలేవు. మరి మీ ఆజ్ఞలేదు కనక కాని, అప్పుడే రావణ వంశ నాశనం, చేసేవాడిని.

మన మహానాయకుడు జాంబవంతుడు విజృంభిస్తే, ఎదురేముంది.

అందాకా ఎందుకు! మన యువరాజు అంగదుడు చాలు. వీరులు పనస, నీలులు కదిలితే మందరగిరిని పిండిచేస్తారు. మైంద ద్వివిదులను ఎదుర్కొనే శక్తి దేవ దానవ గంధర్వ యక్ష రాక్షస నాగజాతులలో ఎవరికుంది? వీరు బ్రహ్మ వర ప్రభావ సంపన్నులు. అమృతం అందుకున్నవారు. వీరిద్దరూ చాలు లంకను కూల్చడానికి, నేనే లంకానగరాన్ని బూడిదచేసి వచ్చాను. అక్కడ రామలక్ష్మణ సుగ్రీవ జయనాదాలు చేశాను; అన్నాడు.

## అంగదుడు

మారుతి మాటలు విని అంగదుడు:

సీతను చూసి వచ్చామే కాని ఆవిడను తీసుకురాలేదని చెప్పడం మనవంటి మహాపరాక్రమ సంపన్నులకు ఉచితంకాదేమో! మన హనుమ రాక్షస సంహారంచేసే వచ్చాడు కనక మనం సీతను తీసుకువెళ్ళడం మంచిది. సీతను రామలక్ష్మణుల ముందుంచి మన పరాక్రమం చాటుకుందాం, అన్నాడు.

అప్పుడు జాంబవంతుడు.

నాయనా! సుగ్రీవుడు కాని, రాముడు కాని మనకు అన్వేషణ కార్యం అప్పగించారే తప్ప మరేమీ చెప్పలేదు. అయినా మనం సాహసించి సీతను తీసుకువెడితే ఆ రాజశార్దూలుడు మనలను ఏ దృష్టితో చూస్తాడో! అది తన వంశ ప్రతిష్ఠకు భంగకరం అనుకుంటాడేమో! మనకు తెలీదు.

ఏమంటే సీతను తాను తెచ్చుకుంటానని ప్రతిజ్ఞ చేశాడాయన. ఆ మాట చెల్లించుకోవాలి. ఇప్పుడు మనం నువ్వు చెప్పినట్లు చేశామో ఆయన మనస్సు వికలమయి తీరుతుంది. మన శ్రమ వ్యర్థమవుతుంది.

అందువల్ల వెళ్ళి జరిగిన విషయం చెప్పడమే మన కర్తవ్యం. అప్పుడాయన ఏం చెపితే అలా చెయ్యడానికి మనం సిద్ధంగానే ఉన్నాం కదా! అనగా అంగద, హనుమదాదులందరూ అంగీకరించారు.

## మధువనం

అందరూ మహేంద్రగిరి శిఖరం నుండి గగన వీధికి ఎగిరారు.

మత్తేభాలవలె, మహాగిరులవలె వారు ఆకాశమంతా క్రమ్ముకున్నారు. వారందరూ సాగి సాగి నందన వనంలా ఉండే మధువనంలో ప్రవేశించారు. వివిధ తరు లతా శోభతో అది సుగ్రీవ రక్షితమై సర్వమనోహరంగా వుంది. ఆ వనంలో ఎవరూ అడుగు పెట్టడానికి వీలులేదు.

సుగ్రీవుని మేనమామ దధిముఖుడు ఆ వనపాలకుడు. ఆయన అప్రమత్తంగా రక్షించే వనంలో ప్రవేశిస్తూనే వానరులందరూ అంగదుని చేరి మధుపాన కాంక్ష వెలిబుచ్చగా, ఆ యువరాజు జాంబవంతాది వృద్ధులతో సంప్రదించి వానరులకు అనుమతి యిచ్చాడు.

అంతతో పట్టరాని సంతోషం కలిగిన ఆ వానరులు.

***గాయన్తి కేచిత్ ప్రణమంతి కేచిత్***
***నృత్యన్తి కేచిత్ ప్రహసన్తి కేచిత్।***
***పతన్తి కేచిత్ విచరన్తి కేచిత్***
***ప్లవంతి కేచిత్ ప్రలపంతి కేచిత్॥***

కొందరు పాటలు మొదలుపెట్టారు. కొందరు ప్రణామాలు, నాట్యాలు, నవ్వులు, తిరుగుళ్ళు, దూకుళ్ళు, అతి ప్రసంగాలు అలా సాగిస్తున్నారు.

ఒక చెట్టుమీది నుండి మరొక చెట్టుకు దూకుతూ, చివరి కొమ్మనుండి నేలకు దుముకుతూ, నేలనుండి వృక్షాగ్రాలకు ఎగురుతూ గడిపారు. ఒకడు పాడుతూంటే ఒకడు నవ్వుతున్నాడు, నవ్వే వానిని చూచి ఏడిచే వాడొకడు, అరిచే వాడొకడు. వాడికి ప్రోత్సాహం ఒకడు:

మధుపానమత్తులై వారు మతులుపోయి చరిస్తున్నారు.

పాన మత్తతలో వారు కొమ్మలు విరిచారు, చెట్లు ధ్వంసం చేస్తున్నారు. చూశాడు దధిముఖుడు, వనపాలుడు.

క్రోధంతో వచ్చి వారించబోయాడు. కొందరిని మందలించాడు, దూషించాడు, దెబ్బలు వేశాడు. వారందరూ ఆ మత్తులో దధిముఖుని దండించడం ఆరంభించారు.

గోళ్ళతో రక్కి, పళ్ళతో పీకి, కాళ్ళతో తన్ని నానా హింసలూ పెట్టారు.

అది చూసి హనుమంతుడు మీరందరూ మధుపానం సాగించండి. వీరి విషయం నేను చూస్తాను, అనవిని అంగదుడు కార్యసాధకుడైన హనుమంతుడు చెపితే అకార్యం అయినా చెయ్యవలసిందే, అనగా వారందరూ అంగదుని కొనియాడి మధువనంలో మిగిలిన వృక్షాలవైపు సాగి ఫలాలు భక్షిస్తూ, మధువు త్రాగుతూ అడ్డు వచ్చిన వారిని చావగొడుతున్నారు.

దోసెళ్ళతో కొందరు త్రాగుతూంటే మధుభాండాలు చంకలలో పట్టుకుపోతున్నారు కొందరు, త్రాగి కొట్టుకోవడం మొదలు పెట్టారు, కొందరు చెట్టు మొదట నిలిచారు. కొందరు ఎండుటాకుల మీద దొర్లుతున్నారు. తూలే వారు కొందరు, త్రోసుకునేవారు కొందరు.

కూతలు కూసేవారు, నిద్రపోయేవారు, సింహనాదాలు చేసేవారు, అట్టహాసాలు, తాడనాలు అలా మత్తులో ఉన్నారు వారు.

వారి చేత దెబ్బలు తిన్న వన పాలకులు పిక్కబలం చూపారు.

తన సేవకుల పరాభవం విని దధిముఖుడు వారందరినీ తీసుకుని మహావృక్షాలు పెరికి వానరయోధులను వారించరాగా హనుమదాదులు ఎదురు వచ్చారు.

పానమత్తుడై వున్న యువరాజు అంగదుడు ఒళ్ళు తెలియని దశలో దధిముఖుని నేలమీద పడగొట్టి చితకబొడిచాడు.

ఆ యువకుడి దెబ్బలకు మూర్ఛపోయాడు దధిముఖుడు. కొంత సేపటికి తేరుకొని తన అనుచరులను వెంటబెట్టుకుని సుగ్రీవుని చేరి మధువనంలో జరుగుతున్న విషయం వివరించి తలవంచి దోసిలి ఒగ్గి, యింత అకార్యానికీ కారకుడు అంగదుడు, అంటూ పాదాలమీద పడ్డాడు.

సుగ్రీవుడు వానిని లేవనెత్తి:

నీకు అభయమిస్తున్నాను. విషయం వివరంగా చెప్పు, అన్నాడు.

వానరేశ్వరా! నీ తండ్రి ఋక్షరజసుడుగానీ, మీ అన్న వాలిగానీ మధువనంలో అడుగుపెట్టలేదు. నువ్వు కూడా ఎప్పుడూ ఆ వనంలో దిగలేదు. అటువంటి వనాన్ని ధ్వంసం చేసి మధువంతా పానం చేశారు అంగదాదులు. మేమందరం వారించబోగా బాగా మాకు పాదతాడనాలు లభించాయి. చక్రవర్తివి నువ్వుండగా మాకు వారే శిక్ష వేశారు, అని దుఃఖిస్తూంటే, చూచి లక్ష్మణస్వామి:

వానరేశ్వరా! ఎందు కీయన దుఃఖిస్తున్నాడు, అని ప్రశ్నించాడు.

లక్ష్మణా! అంగదాదులు మధువనంలో ప్రవేశించి యథేచ్ఛగా త్రాగుతూ తిరుగుతున్నారని చెపుతున్నాడు.

వారందరూ దక్షిణదిశకు అన్వేషణకు వెళ్ళినవారు. ఆ వనంలో వారు స్వేచ్ఛగా చరిస్తున్నారంటే కార్యసాధకులై వచ్చారన్నమాట. కాకపోతే ఆ సాహసం వారికి రాదు. నిస్సందేహంగా వారు సీతను చూశారు.

హనుమంతుడే ఆ కార్యం సాధించి ఉంటాడు. కార్యసాధనకు యోగ్యమయిన ఆలోచనా శక్తి అతనికే ఉంది. వివేకవంతుడయిన పరాక్రమ సంపన్నుడు మా హనుమ. అదీకాక-

***జాంబవా న్యత్ర నేతాస్యాత్***
***అంగదశ్చ బలేశ్వరః***
***హనుమాం శ్చాప్యధిష్ఠాతా***
***న తస్య గతి రన్యథా***

నాయకుడు జాంబవంతుడు.

బలాధిపతి అంగదుడు.

అధిష్ఠాత హనుమంతుడు. ఇక కార్యసాధనకు అడ్డేమిటి!

వీరందరూ మధుపానానికి ఉపక్రమించారంటే సీతాదేవిని చూసి వచ్చారన్నమాటే.

కాకపోతే బ్రహ్మదత్తమయిన మధువనంలో కాలు పెట్టడానికి అంగదాదులకు ఎన్ని గుండెలు కావాలి. వారు సీతను చూశారు, అనడంతో రామ లక్ష్మణులు పరమానందం పొందారు:

అప్పుడు సుగ్రీవుడు:

కార్యసాధకులయి వచ్చిన అంగదాదులు ఏం చేసినా క్షమించాలి. సింహసదృశులయిన హనుమదాదులందరినీ మేము చూడగోరుతున్నాం. సీతాన్వేషణ విశేషాలు వినగోరుతున్నాం, అన్నాడు.

ఆ మాట విని దధిముఖుడు సుగ్రీవ రామ లక్ష్మణులకు నమస్కరించి తన అనుచరులతో మధువనం చేరాడు.

అప్పటికి మత్తు వదులుతూన్న వానరవీరులను సమీపించి, చేతులు జోడించి, అంగదుని సమీపించి:

యువరాజా! మా అపరాధం మన్నించండి. ఈ వనం మీద మీకూ అధికారముంది. ఒకనాడు వాలి వానరేశ్వరుడు, అదే రీతిగా సుగ్రీవుడు, ఆ తరువాయి నువ్వు. అందువల్ల క్షమాభిక్ష కోరుతున్నాను.

ఇప్పుడు మేము సుగ్రీవునికి ఈ వార్త నివేదించగా ఆయన సంతోషంతో అందరినీ రమ్మన్నాడు. త్వరగా మిమ్మల్ని చూడగోరుతున్నాడు అనగా, అంగదుడు: వానర వీరులారా! రామచంద్రుని కీ విషయం తెలిసివుంటుంది. అందువల్ల మనం త్వరగా వెళ్ళాలి. మధుపానమత్తులై హాయిగా నిద్రించే వానరవీరులను తీసుకుని సుగ్రీవ సన్నిధానానికి వెళ్ళాలి. పెద్దలు ఎలా చెపితే అలా నడుచుకుంటాను. నేను యువరాజునయినా కార్యసాధకులను అజ్ఞాపించడం ఉచితం కాదు, అన్నాడు.

ప్రభువయినవాడెవ్వడూ యింత వినయంగా మాట్లాడడం మేమెరగం. ప్రభుత్వమదం వినయాన్ని దరిజేరనివ్వదు. అహంకారం దాని లక్షణం. ఇది నీ భావిశ్రేయస్సుకు మంచిది.

నీ మాట మీద మే మందరం సుగ్రీవ సన్నిధానానికి రావడానికి సిద్ధంగా ఉన్నాం, అన్నారు వారు.

అయితే నడవండి, అని అంగదుడు ఎగిరాడు.

ఒక్కమారుగా యంత్ర ఉత్క్షిప్తమయిన పర్వతాలవలె వానరయోధులు ఎగిరారు.

వాయు విచలితములయిన మేఘసముదాయంలా గర్జిస్తూ వస్తూంటే సుగ్రీవుడు:

రామభద్రా! నువ్వు నిశ్చింతగా వుండు. మనవారు సీతను చూసే వస్తున్నారు. ఎలా అంటావా! నేను పెట్టిన గడువు దాటిన తరువాయి నా ఎదుటపడగల వానరుడు లేడు. గడువుదాటి వస్తున్నారంటే పనిచేసుకు వచ్చారన్నమాట, అలా కాకపోతే మా అంగదుడు నా ముందుకు రానే రాడు.

పయిగా వారు మహోత్సాహంలో వున్నారని విన్నాంకదా! దాని అర్థం కార్యం సాధించారనే. అదీకాక మా తాత తండ్రులు ప్రాణప్రదంగా రక్షించే మధువనం ధ్వంసం చేశారంటే ఎంత ఉత్సాహంతో వున్నారో యోచించు.

నిస్సందేహంగా సీత కనిపించి వుంటుంది, హనుమంతుడే చూచి వుంటాడు. మా హనుమ ధీశాలి, కార్యసాధకుడు.

**హనూమతిహి సిద్ధిశ్చ**
**మతిశ్చ మతి సత్తమ-**

జాంబవంతుడు నాయకుడు, అంగదుడు బలేశ్వరుడు, హనుమంతుడు సాధకుడు. అటువంటప్పుడు మరోలా జరగడానికి వీలులేదు. నువ్వు నిశ్చింతగా వుండు, అంటూండగా కిలకిల ధ్వానం చేరింది.

ఆ ఉత్సాహధ్వానం వినే సుగ్రీవుని వాలం పెరిగింది; మనసు సంతోషంతో పొంగింది.

వానరు లందరూ రామదర్శన లాలసులై అంగదునీ, హనుమంతునీ ముందుంచుకుని క్రిందికి దిగారు.

హనుమంతుడు చేతులు జోడించి, రాముని ముందు నిలిచి:

స్వామీ! సీతాదేవి క్షేమంగా వుంది, అన్నాడు.

సుగ్రీవునికి తన ఊహ నిజమయినందుకు ఆనందం కలిగింది. లక్ష్మణుడు ఆదరనయనాలతో హనుమంతుని చూశాడు. రామభద్రుడు సంతోష వదనంతో చూశాడు.

## చూడామణి

రామభద్రుడు:

ఓ వానర వీరులారా! సీతాదేవి ఏ స్థితిలో వుంది. నా యందు ఆవిడ ఏ దృష్టితో వుంది. అంతా వివరంగా చెప్పండి, అన్నాడు.

అప్పుడు వానరులందరూ సర్వవృత్తాంతం ఎరిగిన హనుమంతుని రాముని ముందుకు నడిపించారు.

హనుమంతుడు దక్షిణ దిశగా తిరిగి మనసా సీతాదేవికి నమస్కరించి రామునిచూచి:

రామభద్రా! అమ్మవారిని అన్వేషించడానికి దక్షిణ సముద్రం నూరు యోజనాలు దాటి లంకలో అడుగుపెట్టాను. అక్కడ సీతాదేవిని దర్శించ...

ఆ పతివ్రతా శిరోమణి తన మనస్సు నీ మీదనే లగ్నంచేసి నీకోసమే జీవిస్తున్నది. రావణుని ఉద్యానవనంలో రాక్షసీ జనమధ్యంలో వారి పరుష భాషణలతో హింస పడుతున్నది. ఆమెకు వారే రక్షకులుగా వున్నారు.

దీనురాలై, ఏకవేణితో, భూమిమీదనే శయనిస్తూ, మంచుదెబ్బతిన్న పద్మంలా వుంది.

క్రూర రావణుని హింసలు పడలేక ప్రాణత్యాగానికి సన్నద్ధమవు తూండగా నేను వారించి ఓదార్చడానికి ప్రాతిపదికగా ఇక్ష్వాకువంశ కీర్తనం ఆరంభించాను.

అప్పుడు నన్ను విశ్వసించి నాతో మాట్లాడింది. నేను విషయమంతా వివరించాను.

మీ మైత్రిమాట విని సంతోషించింది. మీకు గుర్తుగా చిత్రకూటం మీద వాయసం కథ చెప్పింది. ఆవిడ తిలకం జారినప్పుడు మణిశిలతో మీరు తిలకం దిద్దిన వృత్తాంతం గుర్తుచేసింది.

ఇదిగో ఈ చూడామణి ఆనవాలుగా యిచ్చింది. ఆ రాక్షసా వాసంలో మరొక్క మాసంకంటె జీవించనని చెప్పింది, అని విషయాలు విస్తరంగా చెప్పాడు.

రాముడు చూడామణిని అందుకుంటూనే గుండెలకు హత్తుకుని కన్నీరు విడుస్తూ సుగ్రీవుని వైపు తిరిగి:

లేగదూడ కోసం ఆవు ఎంత తపన పడుతుందో ఈ మణిని చూడడంతో నేను సీతకోసం అంత బాధ పడుతున్నాను. కల్యాణ వేదిక మీద ఆ జనక మహారాజు దీనిని ఆమెకు శిరోభూషణంగా అలంకరించాడు. ఈ మణి పవిత్ర జల సంభూత. దీనిని దేవేంద్రుడు కానుకగా యిచ్చాడు. దీన్ని చూస్తూంటే మా తండ్రిగారినీ, మా మావగారినీ చూసినట్లనిపిస్తున్నది. ఇది ఆమెకే అలంకారం, అని హనుమంతునివైపు తిరిగి:

మారుతీ! దాహపీడితుడికి స్వాదుజలంవలె నీ మాటలు నా బాధకు ఉపశమనం కలిగిస్తున్నాయి. నా జానకి యింకా ఏం చెప్పిందో వివరించు; జానకి లేని జీవితం క్షణం కూడా భరించలేను. నన్ను కూడా ఆమె దగ్గరకు తీసుకువెళ్ళు. ఆ రాక్షసుల మధ్య ఏం బాధలు పడుతున్నదో, మేఘాచ్ఛాదిత శరచ్చంద్రునివలె వుండి వుంటుంది. రోగికి ఔషధంలా నాకు నీ మాటలే, జీవనాధారం. ఆ ప్రియభాషిణి చెప్పిన మాటలన్నీ వినిపించు, అన్నాడు.

రామభద్రా! చిత్రకూటం మీద మీరుభయులూ విశ్రాంతి తీసుకునే వేళ నువ్వు నిద్రపోయేవేళ ఒక వాయసం వచ్చి జానకమ్మను హింసిస్తుండగా నువ్వు మేలుకాంచి దర్భను బ్రహ్మాస్త్రంగా అభిమంత్రించి విడిచావట. ఆ కాకికి ముల్లోకాలలోనూ అభయం దొరకక నిన్నే శరణువేడితే అప్పుడు అమోఘమయిన ఆ అస్త్రానికి లక్ష్యంగా కన్ను వదులుకున్నదట.

అలనాడు వాయసంమీద అస్త్రం ప్రయోగించిన రాముడు రాక్షసుల విషయంలో ఎందుకు ఉపేక్ష వహిస్తున్నాడు. లక్ష్మణుడయినా ఎందుకు రావడంలేదు.

బహుశ నేను చేసిన పాపకర్మలు పూర్తికాలేదేమో! లేకుంటే యింత కాలం ఆ మహావీరులు ఉదాసీనంగా ఎందుకుంటారు, అని కన్నీరు విడిస్తుంటే నేను:

తల్లీ! రాముడు నీ విరహవ్యథతో నిశ్చేష్టుడై వున్నాడు. లక్ష్మణుడు అన్నగారి దుఃఖం చూడలేక బాధపడుతున్నాడు.

ఇంతకాలం నీ జాడ తెలియలేదు. ఇప్పుడింక నువ్వు చింతించకు. వారుభయులూ హుటాహుటిని వచ్చి లంక దహించి, ఈ రావణుని బంధుకోటితో సహా కడతేర్చి తమతో తీసుకువెడతారు. ఆయనకు ఆనవాలుగా ఏదయినా ఇయ్యి, అని అడిగాను.

అప్పుడావిడ అటూ యిటూ చూసి, జుట్టు ముడిలోని ఈ మణి యిచ్చింది.

నేను తిరుగు ప్రయాణానికి బయలుదేరుతూంటే,

హనుమా! సింహసదృశ పరాక్రమ సంపన్నులయిన రామ లక్ష్మణులనూ వానరేశ్వరునీ అడిగానని చెపుతూ, రామలక్ష్మణులను దర్శించగలగడం నీ అదృష్టం, అని నన్ను అభినందించింది.

అప్పుడు నేను:

తల్లీ! నా వీపుమీద కూర్చో. ఈ క్షణంలో వారి దగ్గర దింపుతాను, అన్నాను.

అప్పుడావిడ!

హనుమా! ఈ మనస్సు నా స్వాధీనంలో వుండగా పరపురుష స్పర్శ సహించను. అలనాడు కాలం ఎదురు తిరగడంవల్ల, ఆ రాక్షసుడు నన్ను ముట్టగలిగాడు, ఇక రాముడు నన్నీ దుఃఖసాగరం నుండి ఎలా ఉద్ధరించాలో అదంతా ఆయనతో నువ్వు ఆలోచించు. ఈ రాక్షసపీడ చూశావుగదా! అంతా ఆయనకు చెప్పు. నీకు శుభమగుగాక! అని క్షణం ఆగి:

పోనీ ఈ రోజు యిక్కడెక్కడయినా విశ్రాంతి తీసుకుని వెళ్ళరాదా! నువ్వు వెళ్ళి మళ్ళీ తిరిగి వచ్చేవరకూ నేను వుంటానో వుండనో! నా దుఃఖాలకు అంతు కనబడడంలేదు, మీ వానర, భల్లూక సేనలు ఈ అనంత విశాల సాగరాన్ని ఎలా దాటగలవయ్యా!

దాశరథులకు మాత్రం యిది సాధ్యమా!

వాయుదేవుడు, గరుత్మంతుడు, నువ్వూ తప్ప మరెవరూ ఈ సముద్రం దాటలేరు కదా.

మరి ఈ అసాధ్యాన్ని నువ్వు ఎలా సాధిస్తావో చూడాలి. అందుకు నువ్వే సమర్థుడవు. రాముడు స్వయంగా వచ్చి రాక్షస సంహారం చేసి నన్ను తీసికెళ్ళడం ఆయనకు యశస్కరం.

ఈ రాక్షసుడు రామునికి భయపడినందువల్లనే కపట మార్గాన నన్ను హరించాడు. రాముడు తన పరాక్రమం ప్రదర్శించాలి. అదంతా నువ్వు చెప్పాలి, అని అన్నది.

అప్పుడు నేను:

అమ్మా! వానరేశ్వరుడు సుగ్రీవుడు కృతనిశ్చయుడై వున్నాడీ విషయంలో

వానర భల్లూక పతులందరూ ఆయన కను సన్నలలో నడుస్తారు. వారు సంకల్పించారంటే సాధించి తీరతారు. వారికి అవరోధం లేదు. వాయుమార్గాన భూప్రదక్షిణం చేయగల యోధులు వారందరూ.

అక్కడ నా కంటె మహామహులూ, నాతో సమానులూ వున్నారే తప్ప తక్కువ వారెవరూ లేరు. దూతగా నన్ను పంపారు. అంటే వారికంటె తక్కువ వాడినే కదా, పెద్దలను దూతకృత్యానికి పంపరు కదా!

ఈ వానరయూథనాథులు ఒక్క ఊపులో లంకలో వ్రాలుతారు. ఇక ఆ రాజ సింహాలు నా వీపుమీద వచ్చి యిక్కడ సూర్య చంద్రునివలె దిగుతారు.

సర్వశత్రు సంహార సమర్థుడు, సింహసమ పరాక్రమోపేతుడు, రామ భద్రుడు ధనుర్ధారియై లంకానగర ద్వారంలో నిలబడడం త్వరలోనే నువ్వు చూడగలవు.

వాడి గోళ్ళూ, నిశిత దంతాలూ, ఆయుధాలుగా వహా వానర గణాధిపతులు సింహ శార్దూల బలసంపన్నులు. వారు మత్తగజ సన్నిభులై నీ ముందుంటారు.

వార్షుకాభ్రాలవలె, మహాపర్వతాలవలె వారు ఈ లంకానగర సమీప గిరి సానువులమీద సింహనాదాలు చేస్తూంటే వినే రోజు ఎంతో దూరంలో లేదు.

రామభద్రుడు శత్రుసంహారం చేసి వనవాసం ముగించి నిన్ను వెంట బెట్టుకుని అయోధ్యానగరం చేరి తీరతాడు, అని జానకీదేవిని ఓదార్చాను;

అని హనుమంతుడు పలకడంతో రామభద్రుడు సంతుష్ట చిత్తుడయాడు.

**అరిఘ్నం సింహ సంకాశం**
**క్షిప్రం ద్రక్ష్యసి రాఘవం**
**లక్ష్మణంచ ధను ష్పాణిం**
**లంకాద్వార ముపస్థితం**

(59 నుడి 68వ సర్గ)

# ఇది సుందరకాండ

***ఆదికవి వాల్మీకి అనుగ్రహించిన శ్రీ మద్రామాయణంలో సుందరకాండకు ఇది ఉషశ్రీ స్వేచ్ఛానువాదం.***

# హనుమంతుని విశ్వరూపం

మహర్షి వాల్మీకి మానవజాతికి అందించిన ఆదికావ్యం శ్రీ మద్రా మాయణం.

రామకథలో ప్రతి పాత్రకూ ప్రత్యేకత వున్నది. ప్రధానపాత్రల స్వరూప స్వభావాలు మన మనస్సులో ప్రముఖంగా నిలిచే మాట వాస్తవమే. అంతమాత్రాన క్షణాల వ్యవధిలో ప్రవేశించి నిష్క్రమించే శబరి, శూర్పణఖ, మంథర, మారీచ, కుంభకర్ణాదులు సైతం మన స్మృతిసీమను వీడిపోలేరు. వారు మన ఎదుట నిలిచిన క్షణాల కాలంలోనే వారి చిత్తవృత్తులు, ఆకార, వికారాలు సాక్షాత్కరిస్తాయి. అదీ–వాల్మీకి కవి విలక్షణ ప్రతిభ.

* * * *

కావ్య నాయకుడు రాముడు.

అనంతరం అంతటి వున్నత స్థానాన్ని అందుకున్నవాడు హనుమంతుడు.

బాల, అయోధ్య, అరణ్యకాండలలో హనుమంతుని ప్రస్తావన లేదు.

కిష్కింధలో దర్శనమిచ్చిన హనుమంతుడు సుందరకాండలో తన విశ్వరూపాన్ని ఆవిష్కరించి యుద్ధకాండ ముగిసేవరకు – అంటే రామ పట్టాభిషేక పర్యంతం – మనలను తన వెంట త్రిప్పుకుంటాడు.

కాని......

రామాయణంలో వాల్మీకి చూపిన ఈ విశ్వరూపానికీ, అనంతరకాలంలో రామభక్తులు చూసిన హనుమంతునికీ హస్తిమశకాంతరం దూరం వుంది.

భక్తులయిన వారందరికీ హనుమంతుడు–

*యత్ర యత్ర రఘునాథ కీర్తనం*
*తత్ర తత్ర కృత మస్తకాంజలిం*
*బాష్పవారి పరిపూర్ణ లోచనం*
*మారుతిం నమత రాక్షసాంతకం.*

(రామనామం వినిపించే ప్రతిప్రాంతంలో ఆనంద బాష్పాలతో తలవంచి నిలబడే మారుతికి నమస్కారం. ఇది భక్తుల దృష్టిలో హనుమంతుని రూపం)

ఆదికవి యిచ్చిన హనుమంతుడు:

*అంజనా నందనం – వీరం*
*జానకీ శోకనాశనం*

*కపీశం అక్ష హంతారం*

*వందే లంకా భయంకరం.*

అదీ ఆయన రూపం.

రామలక్ష్మణులు సీతను వెదకుతూ కిష్కింధ చేరారు.

చేరిన వారిని దూరాన ఋశ్యమూక పర్వతం మీద ఆప్తసచివులతో వున్న సుగ్రీవుడు చూశాడు.

చూస్తూనే గజగజలాడిపోయి పరుగు లంకించుకున్నాడు, అనుచర సమేతం.

గుట్టలు, మిట్టలు, కొండలు, కోనలు దూకుతున్నారు వారందరూ. కొంతదూరం సాగిన తరువాయి హనుమంతుడు సుగ్రీవుని ఆపి:

ప్రభూ! ఏమిటీ పరుగు, ఎక్కడకీ ప్రయాణం? అన్నాడు.

సుగ్రీవుడు: హనుమా! చూశావా ఆ కోదండపాణుల్ని, కరవాలధరులను, ఆజానుబాహు దేహులను. విషం క్రక్కే కోడెత్రాచుల వంటి కరవాలాలు, తాళప్రమాణంలో వున్న ధనుస్సులు, ముల్లోకాలనూ భస్మం చేయగల శక్తి సంపన్నులయిన వీరిని మా అన్నగారు వాలి నన్ను చంపడానికి పంపాడు.

హనుమ: ప్రభూ! భయగ్రస్త హృదయానికి శంకలు ఎక్కువ. నిజానికి వారెవరో ఎందుకు వచ్చారో తెలియకుండా ఎందుకీ పలాయనం. మీరిక్కడే ఆగండి. నేను విషయం తెలుసుకొని క్షణంలో తమకు నివేదిస్తాను.

అని భిక్షుక రూపంలో రామలక్ష్మణుల ముందు చేతులు జోడించి, తలవంచి నిలబడి:

ఆర్యా! దివ్యకాంతులతో విరాజిల్లే మీ శరీర కాంతీ, చతుర్దశ భువనాలనూ గజగజలాడించ గలిగిన మీ ధనుర్బాణాలూ, కరవాలాలూ మాకు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ఇవన్నీ వీరవరులయిన రాజ పురుష లాంఛనాలు.

కాని - జటాజూటాలూ, నారచీరలూ ధరించి ముని బాలకులవలె వున్నారు. ఇది ఆశ్చర్యంగా వుంది. తమ రెవరు? ఏ పనిమీద యిటు వచ్చారు, అన్నాడు.

రామ లక్ష్మణులు మాట్లాడలేదు. అప్పుడు హనుమ:

మన్నించండి. నేనెవరినో తమకు చెప్పలేదు. ఈ కిష్కింధకు అధిపతి వాలి. ఆయన తన తమ్ముడయిన సుగ్రీవుని రాజ్యభ్రష్టుని చేసి, ఆయన భార్యను కూడా తన దగ్గరే ఉంచుకున్నాడు. నేను సుగ్రీవుని అనుచరుడను, అన్నాడు.

రాముని వదనం సంతోషంతో వికసించింది. తమ్ముని వైపు తిరిగి:

**నా నృగ్వేద వినీతస్య**
**నా యజుర్వేద ధారిణః।**
**నా సామవేద విదుషః**
**శక్యమేవం విభాషితుం॥**

అని హనుమంతుని ధీశక్తినీ, వాక్చాతుర్యాన్నీ ప్రశంసిస్తూ,

లక్ష్మణా! ఈ కపిప్రవరుని సంభాషణ ఎంత ఉదాత్తంగా వున్నదో చూశావా!

వేదత్రయం అధ్యయనం చేసి, ఆరుశాస్త్రాలూ, కంఠపాఠం అయి, నవ వ్యాకరణాలూ కరతలామలకం అయినవాడు కాని యిలా మాట్లాడలేడు. అంతేనా!

మాట్లాడుతూన్నప్పుడు తల విసరడం, కనుబొమలు ఎగరవేయడం, నుదురు బిగించడం వంటి వికారాలేమీ లేవు. ఇంకా చూశావా;

**అ విస్తరం అ సందిగ్ధం**
**అ విలంబితం అవ్యథం**

చెప్పవలసిన విషయాన్ని ముక్తసరిగా మూడు ముక్కలలో చెప్పాడు. అంతమాత్రాన మనకు వినబడకుండా అక్షరాలు మ్రింగేయలేదు; సాగతీత సంగీతంలేదు. గొంతు చించుకుని తను బాధపడి, మన చెవులకు కఠోరంగా అరవలేదు. సంస్కార సంపన్నమై మధ్యమస్థాయిలో హృదయాహ్లాదకరంగా మాట్లాడాడు.

ఇంత ప్రతిభ కల సచివుడుంటే - ముల్లోకాలనూ జయించగలం. కనుక ఇతనితో నువ్వు సముచితంగా మాట్లాడు, అన్నాడు.

తనంత వాడయిన లక్ష్మణుని ఈ విధంగా హెచ్చరించి రాముడు మాట్లాడడం ఇతఃపూర్వం ఎప్పుడూలేదు, అనంతరం అసలు కనబడదు.

రామాయణంలో ఈ చివరినుంచి ఆ చివరకు చదివిన వారికి కూడా రాముని నోట యిటువంటి ప్రశంస ఎవరికీలేదు. ఆయన ప్రశంసించిన వారే, లేరు. హనుమంతుడు తప్ప.

అంటే-

హనుమంతుడు వచ్చి మాట్లాడిన మూడు మాటలలో ఆయన శక్తి సామర్థ్యాలను గ్రహించి, ఆ శక్తిని అభినందించిన ఉత్తమనాయకుడు రామచంద్రుడు. అటువంటి ఉదాత్తశీలుని అభినందనలను అరనిమేషంలో అందుకున్న అద్భుత ప్రతిభాశాలి హనుమంతుడు.

వాల్మీకి రామాయణంలో హనుమంతుని పాత్ర ఇలా ప్రవేశించింది.

అంటే మాట్లాడడం అనే విద్య హనుమంతుని వెంట తిరిగి సర్వ మానవ ప్రాణీ నేర్చుకోవాలని భావించాడు మహర్షివాల్మీకి.

ఎందువల్ల?

మాట ఒక్కటే మానవ ప్రాణికి లభించిన వరం. మిగిలిన ఆహార, నిద్రా, భయ, మైథునాదులు సృష్టిలో అన్ని ప్రాణులకూ సహజమే.

★★★★

ఈ విధంగా హనుమంతుని ప్రవేశపెట్టిన క్షణంనుంచి ఆ మహా మహుడు తన బుద్ధిశక్తిని ఎలా నడిపినదీ అడుగడుగునా కనిపిస్తూనే వుంటుంది. అందులో కొన్ని సన్నివేశాలు చూసి, మిగిలినవి రామాయణ కావ్యంలో చూడండి.

భూగోళంలోని వానర సంఘాలకు అధిపతి - వాలి - మహా బలిష్ఠుడు.

చతుర్దశ భువనాలనూ విలవిలలాడించిన లంకేశ్వరుడైన, రావణుని వంటి మహావీరుని తన చంకలో ఇరికించి సముద్రాల ముంచి వదలిన వీరుడు వాలి.

అంతటివాడు - రాముడు విడిచిన ఒకే ఒక్క బాణంతో నేలకూలినాడు. అది చూసిన వానర యోధులు గజ, గవయ, గవాక్ష, గంధమాదన, నల, నీల, మైంద, ద్వివిదాదులందరూ కొయ్యబారిపోయారు.

నోట మాట లేకపోగా, గట్టిగా ఊపిరి పీల్చలేకపోయారు.

వాలి నేల కూలిన వార్త వినీ వినగానే హుటాహుటి వచ్చింది. వానరేశ్వరుని భార్య తార.

వస్తూనే భర్త దగ్గర కూలబడి ఏడ్చింది, ఏమేమో అనుకున్నది. అందరూ శిలాప్రతిమలవలె నిలబడి వింటున్నారు. ఆవిడ ఎదుట నిలిచి మాట్లాడే ధైర్యం లేదెవరికీ.

అప్పుడు హనుమంతుడు ముందుకు వచ్చి:

మహారాణీ! జగదేక మల్లుడయిన వానరేశ్వరుని పట్టపురాణివి, నువ్వు శోకిస్తున్నావా! సర్వవానరయోధులతో కిష్కింధ నీ కనుసన్నలలో నడుస్తుంది. గుండె నిబ్బరం చేసుకుని నీ బిడ్డను సింహాసనం మీద కూర్చోబెట్టు. నీ బుద్ధిబలం వానరరాజ్యానికి పెట్టనికోట..........అన్నాడు.

అదీ హనుమంతుని ధీశక్తి. ఆమె కుమారుని సింహాసనం ఎక్కించమన్నాడు.

భర్త మరణం ఎంతగా వేధిస్తున్నా, కన్నకొడుకు రాజు కాబోతున్నాడంటే తల్లి గుండె ఎంత పొంగి పులకించాలి. పయిగా నాటి వరకూ ఆవిడ ఆలోచన మీదనే వానర రాజ్యం నడుస్తున్నది. ఆ అధికారం పోకుండా ఆమె కొడుకు సింహాసనం ఎక్కుతాడు.

అయితే-

సుగ్రీవుడికి రాజ్యం యిస్తానని మాట యిచ్చాడుకదా రాముడు. ఆ విషయం ఎరగడా హనుమంతుడు!

ఎరగక కాదు- తారవంటి ధీశక్తి సంపన్నురాలు తన కొడుకుని ఆ సమయంలో రాజ్యాధిపతిని చెయ్యడానికి అంగీకరించదని తెలుసు హనుమకు.

అదే జరిగింది.

సుగ్రీవుడు రాజుగా పట్టాభిషిక్తుడయాడు.

వర్షాకాలం వచ్చింది. వానలు తగ్గగానే సీతాన్వేషణకు వానరసేనలను పంపుతానన్నాడు.

అన్నాడు కాని రాజ్య భోగాలలో, మదిరాపాన - మదవతీ, పరీరంభాలలో ప్రపంచాన్నే విస్మరించాడు.

వానలు తగ్గినా సుగ్రీవుని జాడ లేకపోవడంతో రాముడు లక్ష్మణుని పంపించాడు. కోటగుమ్మంలో నిలబడి ధనుష్టంకారం చేశాడు లక్ష్మణస్వామి. కిష్కింధ యావత్తూ కంపించింది. సుగ్రీవుని మత్తు దిగిపోయింది. లక్ష్మణుని వెంట రాముని సమీపించి, పాదాభివాదం చేసి, వానర వీరులను నాలుగు

దిక్కులకు పంపుతూ, దక్షిణదిశగా వెళ్ళేవారికి జాంబవంతుడు నాయకుడనీ, అంగదుడు బలాధిపతి అనీ, హనుమంతుడు సేనాధిష్ఠాత అనీ అన్నాడు.

వారు బయలుదేరుతూండగా రాముడు హనుమంతుని పిలిచి తన అంగుళీయకం యిచ్చి జానకీదేవికి గుర్తుగా చూపమన్నాడు. అంటే ప్రభువయిన రామునికి తన ఎదుట నున్న వారిలో ఎవరు ఎంతటివారో గ్రహించి వారిని ఉచితరీతిని సమ్మానించడం తెలుసు. అది మరో కథ.

★ ★ ★ ★

వానరవీరులందరూ సముద్రతీరం చేరారు.

అంతవరకూ ఉరకలు వేసిన ఉత్సాహం సముద్ర దర్శనంతో చల్లబడింది.

నాయకుడయిన జాంబవంతుడు వారిని ఆశ్వాసించి, హనుమంతుని లేపాడు. బయలుదేరాడు హనుమంతుడు. సముద్రం మీద సాగుతున్నాడు. దారిలో మైనాకుడు అతిథి సత్కారం చేస్తానంటే, కార్యార్థియై వెళ్ళేవానికి ఈ సన్మానాలు పనికిరావన్నాడు.

నాగమాత సురస అడ్డుపడి మింగేస్తానంది. యుక్తితో ఆమె గర్భంలో ప్రవేశించి యీవలకు వచ్చి ముందుకు సాగి అవలి తీరం చేరుతూండగా ఛాయాగ్రాహి సింహిక కబళించబోయింది. దాన్ని కడతేర్చి లంకానగరం పొలిమేరలో కొండమీద దిగాడు.

అక్కడ లంకానగర అధిష్ఠాన దేవత లంకిణి ఎదురు కాగా దాన్ని నిర్జించి, సీతాన్వేషణం ఆరంభించాడు.

రాజభవనాలు, అమాత్యమందిరాలు, సచివసౌధాలు, పరిజనగృహాలు అన్నీ మూల మూలలా వెదకి వెదకి సీత కనిపించక విషాద హృదయుడై ఆత్మహత్యకు సన్నద్ధుడై అశోకవనంలో అడుగుపెట్టాడు.

ఆత్మహత్యకు ఎందుకు ఉపక్రమించాడు?

సీతను చూడకుండా వస్తే వానరులందరికీ శిరశ్ఛేదమే శిక్ష అని సుగ్రీవాజ్ఞ.

అదీ సుగ్రీవాజ్ఞ!

అందువల్ల తను తిరిగి వెళ్ళి లంకలో జానకి లేదని చెప్పగానే వానర సంఘానికి మరణం తప్పదు.

అంతకు ముందు రాముడు ప్రాణం వదలుతాడు, వెనువెంట లక్ష్మణుడు, ఈ వార్త విని అయోధ్యలో వీరి ఆప్తులు అందరూ ప్రాణాలు వదలుతారు, హనుమంతుడు సీతను చూడకుండా వెడితే!

అంతకంటే తనే ప్రాణత్యాగం చేస్తే, యింకా హనుమంతుడు వస్తాడు, వస్తాడనుకుంటూ వేలమంది జీవిస్తారు. అదీ ఆయన సమాజ కల్యాణ దృష్టి.

ఆ నిశ్చయంతో అడుగుపెట్టిన హనుమంతునికి అక్కడ సీత కనిపించిది; ప్రాణం లేచి వచ్చింది.

అదే సమయానికి రావణుడు రావడం. ఎన్నో దుర్భాషలాడి వెళ్ళడం, ఆ బాధపడలేక సీతాదేవి ఉరిపోసుకు ప్రాణం వదలడానికి సిద్ధపడడం. అప్పుడు హనుమంతుడు తన ధీశక్తి అంతా ఉపయోగించి, ఆవిడను ఆ యత్నం నుండి విరమింపజేయడం, అనంతరం ఆవిడతో మాట్లాడడం, జీవితంమీద ఆశ కలిగించడం.

ఇందుకూ - సుందరకాండ నిత్య పారాయణం చెయ్యాలని పెద్దలనడం. జీవితంలో ఎన్ని క్లేశాలు వచ్చినా ధర్మం విడవకుండా నడిస్తే ఫలం లభిస్తుంది, అనే సందేశాన్ని నినాదంగా, ఉపదేశంగా వాచ్యం చెయ్యకుండా ధ్వని ప్రస్థానంలో సాగించాడు, మహర్షి వాల్మీకి. ఆ జీవితాశను రేకెత్తించి సత్య, ధర్మపథాన నడవడమే భారతీయ సాహితీ తపస్వి లక్ష్యం.

★★★★

లంకానగరం అంటించి, తిరిగి సముద్రం దాటి యీవలి తీరానికి వచ్చి తన ఆప్తమిత్రుల మధ్య నిలబడి, సాగరతరణ,లంకాప్రవేశ, సీతాన్వేషణ, లంకా దహన, రాక్షస సంహారగాథ అంతా సవిస్తరంగా వినిపించాడు. కాని రామభద్రుడికి సీతాదేవి అందించిన సందేశం మాత్రం ప్రస్తావించడు.

కిష్కింధలో రామ లక్ష్మణ సుగ్రీవుల సన్నిధానంలో తన సాహస పరాక్రమ గాథ ఏమీ చెప్పకుండా, అదంతా మూడు మాటల్లో ముగించి సీతాసందేశాన్ని యథాతథం వినిపించాడు.

అదీ హనుమంతుని ధీ విశేషం.

ఎక్కడ, ఎప్పుడు, ఎంత, ఎలా మాట్లాడాలీ అనేది కిష్కింధ, సుందర, యుద్ధకాండలు మూడూ పూర్తిగా చదివితే ఆయనవల్ల మనకు బోధ పడుతుంది.

ఇంతటి ధీమంతుడైన హనుమంతుని విశ్వరూపం దర్శించి పులకించిన కల్పవృక్ష కవి విశ్వనాథ వారి హనుమంతుని చూడండి.

## కల్పవృక్షంలో

రావణుడు నేల కూలాడు.

విభీషణ పట్టాభిషేకం అయింది.

వానరవీరులతో, విభీషణుడు సీతారామలక్ష్మణులను పుష్పకం మీద అయోధ్యకు తీసుకు వస్తుండగా, దారిలో భరద్వాజమహర్షి ఆశ్రమం వద్ద ఆగారు.

అందరూ భరద్వాజులకు నమస్కరించి వెడుతున్నారు. చివరకు హనుమంతునికి అవకాశం వచ్చింది. వెళ్ళి పాదాభివాదం చేశాడు. చెయ్యగా-

*మునియున్ మారుతి కౌగిలించుకొని*
*సమ్మోదంబు దీపింప; అంతన అబ్ధిన్*
*విపదబ్ధి దాటితివి నిన్ దాటించితన్నన్*
*మహాముని! అప్పుడప్పుడు మీరు మీర్మనులు*
*అంభోయాన పాత్రీకృతాత్మ నితాంతోగ్ర*
*తపశ్ఛటా వితతి పంపన్ నేను గుర్తించితిన్॥*

అంటాడు చేతులు జోడించి వినయముగా.

ఇంతటి ధీ ధీరశక్తి సంపన్నుడు కనుకనే రామపట్టాభిషేకవేళ అందరికీ సన్మానాలు ఎవరెవరో జరిపితే, హనుమంతునికి తన రత్నహారం తీసి రాముడు సీతచేత సత్కరింప జేశాడు.

అదీ హనుమంతుని విశేషం. ఈ దృష్టితో చదవండి రామాయణం, కావలసినంత లోకజ్ఞానం లభిస్తుంది.

స్వస్తి

★★★★

T.T.D. Religious Publications Series No.14

Price Rs.10-00

అదికవి వాల్మీకి మునిచంద్రుడు రామాయణంలోని కిష్కింధా - యుద్ధకాండల మధ్య జరిగిన విశేషాలకు 'సుందరకాండ' అని నామకరణం చేశారు.

ఇందులో హనుమంతుని విశ్వరూప సౌందర్యం, ఆయన సేవాధర్మ సౌందర్యం, లంకానగర సౌందర్యం, దశకంఠుని రాజసవీర సౌందర్యం మరియు ఈ పాంచభౌతిక సుందరత్వం అంతనూ తృణప్రాయంగా చూడగల జానకీ శీలసౌందర్యం ఇక్కడే సాక్షాత్కరిస్తుంది. సుందరకాండ చదివితే రామాయణమంతా పఠించిన ఫలం దక్కుతుందని పెద్దలు చెబుతారు.

తెలుగువారికి తెలుగుభాషలో పారాయణ యోగ్యంగా సుందరకాండను ఉషశ్రీ అనువదించి అందించిన గ్రంథమిది.

ప్రతి మానవుడికీ జీవితంమీద ఆశకల్పించే సన్నివేశాలున్నందువల్లనే ఈ గ్రంథాన్ని చదవాలి. నిత్యం పారాయణం చెయ్యాలి.

Printed and Published by Sri **A.P.V.N.SARMA, I.A.S.**, Executive Officer, T. T. Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.